RNI No.TELTEL/2005/16755

# ప్రజాబలం

PRAJABALAM Telugu Daily తెలుగు దినపత్రిక

Website: prajabalam.in

10 జూన్ 2025 మంగళవారం | హైదరాబాద్ | పేజీలు:12 | వెల రూ.2.00 | సంపుటి:21 | సంచిక:9



# వచ్చే బడ్జెట్లో జనాభా దామాషా ప్రకారం నిధుల కేటాయింపు

**సమ సమాజ నిర్మాణమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం**

**ప్రజల ఎజెండానే చట్టంగా చేసి పరిపాలన సాగిస్తున్నాం**

**డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్కమార్క**





వార్తా 2 లో





**జూబ్లీహిల్స్ ప్రజాబలం ప్రతినిధి:** శాసనసభ డిప్యూటీ స్పీకర్గా డోర్నకల్ ఎమ్మెల్యే జాటోత్ రామ చందర్ నాయక్ పేరును ప్రకటించిన నేపథ్యంలో వారు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని జూబ్లీహిల్స్ నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. వారికి ముఖ్యమంత్రి అభినందనలు తెలియజేశారు.



**జూబ్లీహిల్స్ ప్రజాబలం ప్రతినిధి:** రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని కలిశారు. రాష్ట్ర మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన నేపథ్యంలో ముఖ్యమంత్రి ని జూబ్లీహిల్స్ నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అడ్లూరి లక్ష్మణ్ కి ముఖ్యమంత్రి అభినందనలు తెలియజేశారు.



# ప్రజాబలం

10 జూన్ 2025 మంగళవారం


## చుట్టుముడుతున్న యుద్ధాగ్ని జ్వాలలు

రష్యాతో భారత్ తన సంబంధాలు తెంచుకోవాలని చెప్పడం ద్వారా అమెరికా దాదాపుగా భారత్‌ను హెచ్చరించినట్లుగానే భావించాలి. అమెరికా వాణిజ్య కార్యదర్శి లుత్నిక్ మాటలు డొనాల్డ్ ట్రంప్ మాటలుగానే భావించాలి. రష్యా వద్ద ఆయుధాలు కొనుగోలు చేయడం వాషింగ్టన్‌ను వ్యతిరేకించడమేనన్న అమెరికా వ్యాఖ్యలు అనుచితం. అమెరికా తన ఆర్థిక దివాళాకోరుతనాన్ని ట్రేడ్ డీల్స్ ద్వారా తేటతెల్లం చేస్తున్నది. భారత్‌పై ప్రతీకార సుంకాలను విధిస్తూ ఇబ్బందిపెట్టాలని చూసిన ట్రంప్‌కు భారత్ కూడా ప్రతీకార సుంకాలతోనే గుణపాఠం నేర్పడానికి సంసిద్ధమైనది. చిరకాల మిత్రులైన భారత్- రష్యాలను విడదీయాలనే దుర్మార్గమైన ఆలోచనకు అమెరికా స్వస్తి చెప్పాలి. ఉగ్రమూకలకు స్వర్గధామమైన పాకిస్తాన్ పట్ల అమెరికా ఉదార స్వభావాన్ని ప్రదర్శించడం సిగ్గుచేటు. ఇటీవల పుతిన్- అజిత్ దోవల్ మధ్య జరిగిన సంభాషణలు అమెరికాకే కాకుండా చైనా, పాక్, బ్రిటన్‌లకు వెన్నులో వణుకు పుట్టించాయి.ఒక వైపు అమెరికా, బ్రిటన్ మరికొన్ని యూరప్ దేశాలు రష్యాకు వ్యతిరేకంగా ఉక్రెయిన్‌కు భారీగా ఆయుధాలను సరఫరా చేస్తున్నాయి. ఉగ్రవాదులను పెంచి పోషిస్తూ, భారత్‌లో మారణహోమం సృష్టిస్తున్న పాక్‌ను మందలించకుండా భారత్‌లో ఉగ్రవాద కార్యకలాపాల (%ువతీతీశీతీఱర ఖష్ఱజఱఅవం%) కు వెన్నుదన్నుగా నిలుస్తున్న పాక్‌ను ఎదిరించేందుకు రష్యాతో ఆయుధ ఒప్పందం కుదుర్చుకుంటున్న భారత్‌పై ఈర్ష్యాద్వేషాలను ప్రదర్శిస్తున్న అమెరికా వైఖరి అసమంజసం. పాక్ ఆక్రమిత కశ్మీర్ ఎంతో అందమైన ప్రాంతం. ఉగ్రవాదులతో, జిహాదీ శిక్షణలో ఎలాంటి అభివృద్ధి సాధించకుండా పిఒకె నిస్తేజంగా మారిపోయింది. పిఒకె ప్రజలకు తినడానికి తిండిలేదు. విద్య, ఉపాధి అవకాశాలు లేవు. భారత్‌లోని జమ్మూ కశ్మీర్ ఇందుకు విరుద్ధం.కశ్మీర్ ప్రజలు టూరిజంతో ఉపాధి అవకాశాలు పొందుతున్నారు.

ఉగ్రవాదం వలన జీవితాలు ఎంత దుర్భరంగా మారతాయో అక్కడ ప్రజలకు అర్ధమైనది. ఆర్టికల్ 370 రద్దు తర్వాత కొంత కాలం అలజడులు చెలరేగినా అక్కడ జరుగుతున్న ఆర్థిక కార్యకలాపాలు కశ్మీర్ ప్రజల్లో మార్పును తెచ్చిన మాట కాదనలేని సత్యం. ఎవరో కొద్ది మంది చేసే పనుల వలన కశ్మీర్‌లో ఏదో జరిగిపోతుందనుకోవడం విడ్డూరం. జమ్మూకశ్మీర్‌లో జరుగుతున్న అభివృద్ధిని గమనించిన తరువాత పాక్ ఆక్రమిత కశ్మీర్ ప్రజలు కూడా భారత్‌లో విలీనం కావాలని కోరుకుంటున్నారు. జై శంకర్, యోగి ఆదిత్యనాథ్, రాజ్ నాథ్ సింగ్ వంటి వారు పిఒకె స్వాధీనం గురించి ఇదివరకే తమ అభిప్రాయాలను కుండబద్దలు గొట్టినట్టు చెప్పారు. పిఒకెను భారత్ స్వాధీనం చేసుకుంటుందా? ఇందుకు చైనా, అమెరికాలు అభ్యంతరం చెప్పి, పాక్‌కు ఆయుధాలు సరఫరా చేసి భారత్‌పై యుద్ధానికి ప్రేరేపిస్తాయా? అనే విషయం తేలాలి. రష్యా- ఉక్రెయిన్ల మధ్య గత మూడున్నర సంవత్సరాలుగా కొనసాగుతున్న యుద్ధాన్ని ఆపడం అమెరికాకు చేతకాలేదు. పైగా ట్రంప్‌ను జెలెన్స్కీ ప్రత్యక్షంగానే విమర్శించిన విషయం మరవలేం. తన మద్దతు లేకపోతే ఉక్రెయిన్ యుద్ధం చేయలేదని డాంబికాలు పలికిన అమెరికాను సవాల్ చేస్తూ, మునుపెన్నడూ లేని విధంగా రష్యాపై ఉక్రెయిన్ స్పైడర్ వెబ్ ఆపరేషన్‌ను చేపట్టి రష్యాను భయపడేలా చేసింది.రష్యాలోని కీలకమైన క్రిమియా బ్రిడ్జిని ఉక్రెయిన్ కూల్చింది. 41 యుద్ధ విమానాలు, ఒక బ్రిడ్జిని ధ్వంసం చేసి పటిష్టమైన రక్షణ వ్యవస్థ కలిగిన రష్యాకు సవాల్ విసిరిన ఉక్రెయిన్‌కు నాటో దేశాలు సహకారం అందించడం వలన జరిగే మహావిలయాన్ని ఊహించగలమా?రష్యా కూడా ఉక్రెయిన్‌కు చెందిన వందలాది మంది సైనికులను హతమార్చినట్టు ప్రకటించుకుంది. ఉక్రెయిన్ దాడులకు ప్రతీకారం తీర్చుకుంటామని రష్యా చేసిన హెచ్చరిక ఎలాంటి పరిణామాలకు దారితీస్తుందో చెప్పలేం.

రష్యాకు యుద్ధంలో సహాయం చేయడానికి ఉత్తర కొరియా సంసిద్ధత వ్యక్తం చేసింది. వేలాది సైన్యం, ఆయుధాలతో కిమ్ రష్యాకు అండగా ఉండబోతున్నారు. ఉక్రెయిన్ రష్యాపై ఆకస్మికంగా దాడి చేసి ఎయిర్‌బేస్‌లను ధ్వంసం చేయడం అవాంఛనీయ పరిణామంగా భావించాలి. అహం దెబ్బతిన్న రష్యా ఉక్రెయిన్‌పై భారీ స్థాయిలో విరుచుకుపడడానికి సిదంగా ఉంది. రష్యా రిటాలియేషన్ ఏ స్థాయిలో ఉంటుందో ఊహించలేం. ఈ పరిణామాల వలన అమెరికా, నాటో దేశాలు ఉక్రెయిన్ పక్షాన నిలబడి భారీ యుద్ధానికి తెరతీసే అవకాశముంది. రష్యా- ఉక్రెయిన్ యుద్ధం ముగింపు దశకు చేరుకుందని అందరూ భావిస్తున్న తరుణంలో అనుకోని విధమైన మలుపులు తిరుగుతూ ప్రపంచాన్ని భయానకమైన వాతావరణంలోకి నెట్టింది. ఉక్రెయిన్‌పై ప్రతీకారం తీర్చుకుంటామని రష్యా అధ్యక్షుడు పుతిన్ ట్రంప్‌కు స్పష్టం చేసారు. ఎక్స్ ద్వారా ట్రంప్ ఈ విషయాన్ని తేల్చిచెప్పారు. భారత్ -రష్యా సంబంధాలను అమెరికా జీర్ణించుకోలేకపోతున్నది. భారత దేశానికి అంతర్జాతీయంగా అన్నివిధాలుగా సహకరిస్తున్న ఏకైక విశ్వసనీయమైన దేశం రష్యా. అలాంటి రష్యాకు మన దేశం ఎంతో రుణపడి ఉంది. 1971లో జరిగిన ఇండో- పాక్ యుద్ధంలో అమెరికా, బ్రిటన్ వంటి దేశాలు పాకిస్తాన్‌కు మద్దతు తెలిపినా, అప్పటి సోవియట్ యూనియన్ భారత్‌కు అన్ని విధాలా సాయంచేసి నిజమైన స్నేహానికి నిర్వచనం చెప్పింది. అప్పటి సోవియట్ యూనియన్ నుంచి నేటి రష్యా వరకు భారత్‌కు వెన్నంటి ఉన్న మిత్ర దేశంతో భారత్‌ను వేరుచేయాలని అమెరికా విఫల ప్రయత్నాలు చేస్తున్నది. ఆసియా, ఐరోపా ఖండాల్లో విస్తరించి ఉన్న రష్యా ఒకప్పటి సోవియట్ యూనియన్‌లో ఒక భాగం. కొన్ని దేశాల కుట్రల వలన, మిఖాయిల్ గోర్బచేవ్ విధానాల వలన ఎంతో ఖ్యాతి గాంచిన సోవియట్ యూనియన్ విడిపోయింది. 15 కామన్ వెల్త్ ఇండిపెండెంట్ స్టేట్స్‌లో రష్యా ఒక కీలకమైన దేశం.

సోవియట్ యూనియన్ నుంచి విడిపోయిన రష్యా ఈనాటికీ మిగిలిన ప్రాంతాల కంటే అత్యధిక ఆయుధ, సైనిక బలగం గల దేశం. అప్పటి సోవియట్ యూనియన్ మాదిరిగా రష్యా కూడా ఒక అగ్రరాజ్యం. ప్రపంచంలోనే అత్యధిక విస్తీర్ణంగల దేశంగా మైదానాలతో, వ్యవసాయ భూములతో, సహజ వనరులతో తులతూగుతున్న రష్యా అంటే ఈనాటికీ కొన్ని దేశాలకు గిట్టదు. అమెరికా, బ్రిటన్ వంటి దేశాలు రష్యాకు బద్ధశత్రువులు. ఇటీవల కాలంలో రష్యాపట్ల స్నేహ వైఖరిని ప్రదర్శించినట్లు నటించిన ట్రంప్ తన దుర్బుద్ధిని చాటుకున్నారు. రష్యా కు భారత్ మరింత సన్నిహితంగా మెలగడం అమెరికాకు నచ్చడంలేదు. అమెరికాలో స్థిరపడ్డ భారతీయులు ట్రంప్ అధికారంలోకి రావడానికి కృషి చేసారు. ఎన్నికల తర్వాత అక్రమ వలసదారుల పేరుతో భారతీయులకు సంకెళ్ళు వేసి, యుద్ధ విమానాల్లో వారిని భారత్‌కు పంపించి, ఘోరంగా అవమానించాడు. భారత్‌ను ప్రశంసిస్తూ, మోడీ తన మిత్రుడంటూనే అమెరికా అధ్యక్షుడయ్యాక ట్రంప్ భారత్‌కు వెన్నుపోటు పొడిచాడు. ట్రంప్ చేష్టలను తట్టుకోలేక అతని ఆప్తమిత్రుడైన ఎలాన్ మస్క్ కూడా ట్రంప్‌ను అభిశంసించి, గద్దె దించాలని, జెడి వాన్స్‌ను అధ్యక్ష స్థానంలో నిలబెట్టాలని ప్రయత్నించడం గమనార్హం. భారత్ విషయంలో కూడా ట్రంప్ ధోరణి సముచితంగా లేదు. ప్రపంచంలో పెద్ద ప్రజాస్వామ్య దేశంగా, అత్యధిక జనాభా గల దేశంగా భారత్ తన సార్వభౌమత్వాన్ని, సమగ్రతను కాపాడుకోవడానికి ఎంతో కృషి చేస్తున్నది. ఈ క్రమంలో రష్యా భారత్‌కు అన్ని విధాలా అండగా ఉంటున్నది. చైనా, పాకిస్తాన్, అజర్ బైజాన్, బంగ్లాదేశ్, టర్కీ వంటి దేశాలు భారత్‌పట్ల అకారణ విద్వేషాన్ని ప్రదర్శిస్తున్నాయి. ఒకప్పుడు ఇండో- చీనీ భాయ్‌భాయ్ అంటూనే 1962లో భారత్‌తో యుద్ధానికి తలపడి, భారత్ భూభాగాలను ఆక్రమించి చైనా నమ్మకద్రోహం చేసింది. టిబెట్ బౌద్ధ గురువు దలైలామాకు భారత్ ఆశ్రయమివ్వడమనే అంశంతో చైనా భారత్‌తో యుద్ధానికి దిగిందనే వాదనలో పసలేదు.

భారత్ లోని ఈశాన్య ప్రాంతాన్ని తమ అధీనంలోకి తెచ్చుకోవడమే లక్ష్యంగా నాడు చైనా యుద్ధం చేసింది. చికెన్ నెక్‌గా పిలవబడుతున్న సిలిగురి కారిడార్‌ను వివాదాస్పదం చేసి ఈశాన్య భారతాన్ని మింగేయడానికి డ్రాగన్ దేశం విస్తృతంగా ప్రయత్నిస్తున్నది.

## వచ్చే బడ్జెట్లో జనాభా దామాషా ప్రకారం నిధుల కేటాయింపు

**ఖమ్మం ప్రజాబలం ప్రతినిధి:**వచ్చే బడ్జెట్లో రాష్ట్రంలోని జనాభా దామాషా ప్రకారం నిధులు కేటాయించి విద్య, ఉపాధి, సంక్షేమ రంగాల్లో అవకాశాలు పెరిగేలా కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. సోమవారం ఆయన ఖమ్మం జిల్లా కేంద్రంలో గౌడ సంఘం భవన నిర్మాణం పనులకు శంకుస్థాపన సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన ప్రసంగించారు.సమాజంలోని అన్ని వర్గాలకు సమాన అవకాశాలు కల్పించి సమ సమాజం స్థాపించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం అన్నారు. ప్రజల ఎజెండానే చట్టంగా చేసి ఇందిరమ్మ ప్రజా ప్రభుత్వం పరిపాలన చేస్తుంది అన్నారు.ఎన్నికల ముందు చెప్పినట్టుగా అధికారంలోకి రాగానే బీసీ కుల గణన చేసి వారు జనాభాలో 56 శాతం ఉన్నారని కాంగ్రెస్ ప్రభుత్వం లెక్క కట్టి చెప్పింది, స్థానిక సంస్థల్లో, ఉద్యోగాల్లో వారికి 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ చట్టం చేసి కేంద్రానికి పంపామని ఇది ఇందిరమ్మ ప్రభుత్వం సాధించిన గొప్ప విజయం అని డిప్యూటీ సీఎం తెలిపారు.

తెలంగాణ మోడల్ దేశవ్యాప్తంగా జరగాలి అని రాహుల్ గాంధీ ఒక్కొక్కటిగా వివరాలతో చెబుతుంటే మొదట నవ్వారు.. ఇప్పుడు తెలంగాణ మోడల్ దేశానికే దిక్సూచిగా మారిందని తెలిపారు. ఇది తెలంగాణ ప్రజల విజయం అని పేర్కొన్నారు. రాష్ట్ర జనాభాలో ఉన్న బీసీల సంఖ్యను కుల సర్వే చేసి తద్వారా వనరులు, సంపద, పాలన అధికారాల్లో అత్యంత వెనుకబడిన వర్గాలకు ప్రాధాన్యత ఇస్తామని ఎన్నికల ముందు రాహుల్ గాంధీ ఆమె ఇచ్చారని గుర్తు చేశారు. ఎన్నికల ముందు రాహుల్ గాంధీ ప్రసంగాన్ని తానే translation చేశానని సీఎం గుర్తు చేశారు. బీసీ కుల గణన తెలంగాణ నుంచే మొదలుపెడతామని రాహుల్ గాంధీ హామీ ఇచ్చిన మేరకు అధికారంలోకి రాగానే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎంగా తను యావత్ క్యాబినెట్ ఏకగ్రీవంగా ఆమోదించి శాసనసభలో తీర్మానం ప్రవేశపెట్టామని తెలిపారు. ప్రణాళిక శాఖను చూస్తున్న తాను 50 రోజుల రోజుల్లోనే ఒక చిన్న పొరపాటు లేకుండా విజయవంతంగా సర్వే పూర్తి చేసి దేశ చరిత్రలోనే ఓ రికార్డు సృష్టించామని తెలిపారు. స్వాతంత్రం వచ్చాక ఏ రాష్ట్రంలో కుల గణనకు ఎవరు సాహసం చేయలేదని తెలిపారు, కుల సర్వే ప్రారంభించిన మొదట్లో చాలా పొరపాట్లు జరుగుతాయి, పట్టుకుందామని చాలామంది చూశారు కానీ సర్వే కార్యక్రమాన్ని మా మంత్రి వర్గం ప్రతిష్టాత్మకంగా భావించి అనేక రాష్ట్రాల్లో తిరిగి ఎలాంటి పొరపాటు లేకుండా బీసీ సర్వేను పూర్తి చేసామని తెలిపారు.

ప్రతి 150 ఇళ్ళను ఒక బ్లాక్ గా గుర్తించి, ప్రతి బ్లాక్ కు ఒక ఎనిమరేటర్, ప్రతి మండలానికి ఒక ఇంచార్జ్, జిల్లాకు అదనపు కలెక్టర్ ఇన్చార్జి, వీరందరిపై కలెక్టర్ పర్యవేక్షణ, ప్రతిరోజు 10 ఇళ్లకు మించి సర్వే చేయవద్దని ప్రభుత్వ యంత్రాంగానికి ఆదేశించి శాస్త్రీయంగా సర్వేను పూర్తి చేసినట్టు తెలిపారు.

ఏడాది లోపలోనే గౌడ సంఘ భవనం నిర్మాణం పూర్తి చేసుకోవాలని, ఇక్కడే నిరుద్యోగులకు ఒక కోచింగ్ సెంటర్ ఏర్పాటు చేయిస్తామని, సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహాన్ని ఏడాదిలోపే ఏర్పాటు చేసుకోవాలని డిప్యూటీ సీఎం గౌడ సంఘ నాయకులను కోరారు. ఈ కార్యక్రమాలకు కావలసిన సహకారాన్ని ప్రభుత్వం పూర్తిస్థాయిలో అందిస్తుందని భరోసా ఇచ్చారు. విద్యార్థులు విద్యాబుద్ధులు నేర్చుకొని అద్భుతంగా ఎదిగే ప్రాంగణంగా తీర్చిదిద్దాలని డిప్యూటీ సీఎం కోరారు. చైతన్యానికి మారుపేరు, బలహీన వర్గాలకు పుట్టినిల్లు ఖమ్మం జిల్లా అని డిప్యూటీ సీఎం తెలిపారు. ధీరోదాత్తుడైన సర్వాయి పాపన్న విగ్రహాన్ని ఏర్పాటు చేసుకొని బలహీన వర్గాలు స్ఫూర్తిని పొందాలి అన్నారు. సర్దార్ సర్వాయి పాపన్న వరంగల్ జిల్లాకు 40 కిలోమీటర్ల దూరంలో సామాన్య కుటుంబంలో జన్మించి సమాజాన్ని ప్రభావితం చేశారని తెలిపారు. వరంగల్ నుంచి మొదలుపెడితే గోల్కొండ వరకు అనేక కోటలను కొల్లగట్టి స్వాధీన పరుచుకుని పరిపాలన సాగించారని, బలహీన వర్గాలు కూడా పాలించగలవు అని పాపన్న సమాజాన్ని ప్రభావితం చేశారని డిప్యూటీ సీఎం వివరించారు. మెట్ కాఫ్ అనే చరిత్రకారుడు పాపన్న జీవిత చరిత్రను వెలికి తీశాడని తెలిపారు.

## తెలంగాణ రాష్ట్రస్థాయి హ్యాండ్ బాల్ పోటీలలో గోల్డ్ మెడల్, సిల్వర్ మెడల్ గెలుపొందిన క్రీడాకారులను అభినందించిన జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్.




**ములుగు జిల్లా ప్రతినిధి (ప్రజాబలం) జూన్ 9:** సోమవారం జిల్లా కలెక్టర్ తన ఛాంబర్ లో జిల్లా క్రీడల అధికారి తులా రవి ఆధ్వర్యం లో రాష్ట్రస్థాయి పోటీలలో గెలుపొందిన క్రీడాకారులను కలెక్టర్ శాలువ తో సత్కరించి అభినందించారు.

నల్గొండ జిల్లాలో నకిరేకల్ మండలం మంగళ పల్లి క్రీడా మైదానంలో ఈనెల 04 నుండి 06 తేదీల్లో జరిగిన తెలంగాణ రాష్ట్ర స్థాయి జూనియర్ బాల బాలికల హ్యాండ్ బాల్ పోటీలలో ఉమ్మడి వరంగల్ బాలికల టీం గోల్డ్ మెడల్ , వరంగల్ బాలుర టీం సిల్వర్ మెడల్ గెలుపొందారు.ములుగు జిల్లా హ్యాండ్ బాల్ క్రీడాకారులు జాడి.రాధిక గోల్డ్ మెడల్, ఎండి, ఇమ్రాన్, జాడి వాసు సిల్వర్ మెడల్స్ ఈ విజయంలో కీలక పాత్ర పోషించారు.

ఈ కార్యక్రమంలో ప్రస్తుతంజిల్లా స్పోర్ట్స్ అధికారి సర్దార్ సింగ్ , జూనియర్ అసిస్టెంట్ లావణ్య, కుమారి, హ్యాండ్ బాల్ కోచ్ పర్వతాల కుమారస్వామి,రెజ్లింగ్ కోచ్ సతీష్, సైక్లింగ్ కోచ్ శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.



**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి** ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ని తన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసిన మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

అడ్లూరిని అభినందించి, ఆశీర్వదించిన మంత్రి దామోదర

ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, రాష్ట్ర అభివృద్ధికి కృషి చేయాలని సూచించిన మంత్రి దామోదర

సామాజిక న్యాయానికి కేరాఫ్ కాంగ్రెస్ అని పేర్కొన్న దామోదర

ఎస్సీ వర్గీకరణ, కుల గుణన, బీసీల రిజర్వేషన్ల పెంపు, మంత్రి వర్గంలో నలుగురు ఎస్సీలకు స్థానం కల్పించడం, స్పీకర్‌గా అవకాశం ఇవ్వడం వంటి అంశాలను గుర్తు చేసుకున్న మంత్రులు

## హైదరాబాద్‌లో మంత్రిఅడ్లూరి లక్ష్మణ్ కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన బొల్లి స్వామి నేతృత్వంలోని ప్రతినిధి బృందం



**జగిత్యాల జిల్లా, ధర్మారం ప్రజాబలం ప్రతినిధి :9** జూన్ రాష్ట్ర కేబినెట్ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌ను సోమవారంనాడు మర్యాదపూర్వకంగా కలిసిన పెద్దపల్లి జిల్లా కాంగ్రెస్ పార్టీ నేతల బృందం, మంత్రి కి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షులు మరియు మాజీ ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ ఎంపీటీసీ ఫోరం రాష్ట్ర అధ్యక్షులు బొల్లి స్వామి ముఖ్యంగా పాల్గొన్నారు.బొల్లి స్వామి మాట్లాడుతూ, ప్రజలకు సేవ చేయడమే తమ ముఖ్య లక్ష్యమని, పార్టీ పట్ల అంకితభావంతో కొనసాగుతామన్నారు. అలాగే, మంత్రి నాయకత్వంలో రాష్ట్ర అభివృద్ధి మరింత వేగం పుంచుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఇతర నేతలు ఇంజపురి కుమార్, చిప్ప మణి వర్మ తదితరులు పాల్గొన్నారు. మంత్రివర్యుడు ప్రతినిధి బృందాన్ని ఆత్మీయంగా ఆహ్వానించి, వారికి అభినందనలు తెలిపారు.

## ఉద్యోగులందరూ రక్షణతో పని చేయాలి -మందమర్రి ఏరియా జీఎం జి. దేవేందర్



**ప్రజాబలం చెన్నూరు నియోజకవర్గ రిపోర్టర్ జూన్ 9 :**మందమర్రి ఏరియా వర్క షాప్ లో ఫాటల్ ఫ్రీ జూన్ -2025 నెలగా మార్చడానికి ఉద్యోగులందరూ రక్షణతో పని చేయాలని మందమర్రి ఏరియా జీఎం జి. దేవేందర్ కోరారు. సోమవారం వర్క్ షాప్ లో ఏర్పాటు చేసిన ప్రత్యేక భద్రత అవగాహన సదస్సులో పాల్గొని మాట్లాడారు. ప్రతి సంవత్సరం జూన్ మాసంలో సింగరేణి సంస్థలో ఏదో ఒక చోట గనిలో ప్రమాదాలు జరిగి కార్మికుల మరణాలు సంభవిస్తున్నాయని తెలిపారు. ప్రమాదాల నివారణకే మూడు సంవత్సరాలుగా ప్రతి జూన్ మాసంలో ఫాటల్ ఫ్రీ జూన్ పేరుతో ఉద్యోగుల్లో రక్షణపై అవగాహన పెంచుతామన్నారు. ఉద్యోగుల రక్షణ సంస్థ బాధ్యత అని, ఉద్యోగులు రక్షణతో కూడిన పని చేయాలని, ఉద్యోగుల రక్షణపై వారి కుటుంబ సభ్యులు ఆధారపడి ఉన్నారని చెప్పారు. రక్షణ అనేది వారి ఇంటి నుంచి ప్రారంభం కావాలని సూచించారు. ఉద్యో గులు భద్రతపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, రక్షణతో కూడిన బొగ్గు ఉత్పత్తి చేసి సింగరేణి సంస్థ అభివృద్ధికి తోడ్పడాలని కోరారు. ఈ కార్యక్రమంలో జి.ఎం సేఫ్టీ బెల్లంపల్లి ఏరియా రఘు కుమార్, వై వెంకటరమణ, ఏరియా సేఫ్టీ ఆఫీసర్, మాటూరి రవీందర్, వర్క్ షాప్ ఇంచార్జ్ వి. దూప్ సింగ్, వైస్ ప్రెసిడెంట్ భీమనాదుని సుదర్శన్, పిట్ కార్యదర్శులు ప్రభాకర్ శర్మ, ఏరియా వర్క్ షాప్ అధికారులు దండే సదానందం, వి.హరికృష్ణ, నాగుల శ్రీనివాస్ ఉద్యోగులు పాల్గొన్నారు.

# పౌర హక్కుల మేధావి

పౌరహక్కుల ఉద్యమానికి అంతర్జాతీయ ఖ్యాతి తెచ్చిపెట్టిన ఘనత బాలగోపాల్ కే దక్కుతుంది. బాలగోపాల్ ఒక మధ్యతరగతి తెలుగు బ్రాహ్మణ దంపతుల ఎనిమిది మంది పిల్లలలో ఐదవ సంతానం- కందాళ్ళ పార్థనాథ శర్మ మరియు రాళ్ళపల్లి నాగమణి దంపతులకు బాలగోపాల్ 1952, జూన్ 10న బళ్ళారి, కర్ణాటకలో జన్మించాడు. ఆయన సోదరులలో ఒకరైన అనంత భారత సైన్యంలో డాక్టర్. . మాతామహుడు: ప్రముఖ సాహితీవేత్త రాళ్లపల్లి అనంత కృష్ణశర్మ. ఈటీవీ2లో చాలాకాలం తెలుగు వెలుగు కార్యక్రమానికి నిర్వాహకురాలు గా ఉన్న మృణాళిని సోదరి. ఒకటి నుంచి డిగ్రీ వరకు తిరుపతిలో ఎస్వీ ఆర్ట్స్ కళాశాలలో డిగ్రీ పూర్తి, వరంగల్ లోని ఆర్ఈసీ నుంచి గణితంలో పీహెచ్డీ, 1980లో కాకతీయ విశ్వ విద్యాలయంలో గణిత అధ్యాకు డిగా ఉద్యోగంలో చేరిక, 1985లో ఉద్యోగానికి రాజీనామా, అప్పటి నుంచి హక్కుల ఉద్యమానికే పూర్తిగా అంకితం అయ్యాడు. మూడు దశాబ్దాలుగా అవిశ్రాంత కృషి సలిపిన ప్రముఖ హక్కుల నేత, న్యాయవాది, హేతువాది మేధావి. హైదరాబాద్ లోని గుడిమల్కాపూర్ ప్రియా కాలనీలో నివసించాడు. ఆయన భార్య వసంత లక్ష్మి ఆంధ్రజ్యోతిలో పాత్రికేయురాలు. వారికి ప్రభాత అనే కుమారుడు కలిగాడు. మానవతా విలువల కోసం పోరు సల్పుతు, ఆదివాసీ ఉద్యమం నుంచి విప్లవోద్యమం వరకు, పౌరహక్కుల ఉద్యమం నుంచి మానవ హక్కులు ఉద్యమం వరకు, కూలీ పోరాటం నుంచి భూపోరాటం వరకు అన్నిరకాల ఉద్యమాలతో పెనవేసుకు పోయిన నాయకు డాయన. ఎక్కడ అన్యాయం, వివక్ష, అణిచివేత, అసమానతలు కనిపించినా నిష్కర్షగా, నిక్కచ్చిగా, నిర్భయంగా పోరాడాడు. ఈ క్రమంలో వచ్చిన బెదిరింపుల్ని ఏనాడూ లెక్కచేయలేదు. ఆయనపై ఎన్నోసార్లు భౌతిక దాడులు జరిగినా రెట్టించిన ఉత్సాహంతో పనిచేశాడు. బూటకపు ఎన్కౌంటర్లను వెలుగు లోకి తేవడంతో పోలీసులు ఆయనపై నక్సలైట్గా ముద్ర వేశారు. కొత్తగూడెంలో ఓసారి ఆయనపై దాడికి పాల్పడిన పోలీసులు చనిపోయాడని భావించి, మురికి కాల్వలో పడేసి వెళ్లగా పీడీఎస్యూ కార్యకర్తలు ఆయన్ను కాపాడారు. ఆయన మానవ హక్కుల ఉద్యమంతో పూర్తిగా సంబంధం కలిగి ఉన్న తరువాత చాలా కాలం తరువాత న్యాయవాదిగా మారడానికి ఎంచు కున్నాడు. బాలగోపాల్ 1983 మరియు 1997 మధ్య ఆంధ్రప్రదేశ్ సివిల్ లిబర్టీస్ కమిటీ (ఏపిసిఎల్సి) ప్రధాన కార్యదర్శిగా పనిచేశాడు. ఏపిసిఎల్సి లో అభిప్రాయ భేదాల తరువాత, అతను ఏపిసిఎల్సిని వదిలి మానవ హక్కుల ఫోరంను ఏర్పాటు చేశాడు. 26 సంవత్సరాల కాలంలో, అతను ఆంధ్రప్రదేశ్ మరియు ఇతర ప్రాంతాలలో ప్రభుత్వ దళాలు వేలాది మంది చట్టవిరుద్ధ హత్యల కేసులను నమోదు చేశాడు. 1980 ల చివరలో మావోయిస్టులు చేసిన కిడ్నాప్ వరుస సందర్భంగా, అప్రమత్తమైన సంస్థ ప్రజా బంధు ( ?ఫ్రెండ్స్ ఆఫ్ ది పీపుల్ ) ఆయనను అపహరించి, ఇద్దరు పోలీసు అధికారులను నక్సలైట్ కస్టడీ నుండి విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర పోలీసుల తో సంబంధాలున్నాయని అనుమానించిన ఈ సంస్థ, అపహరణకు గురైన పోలీసులను తిరిగి ఇచ్చిన తర్వాతే ఆయనను విడుదల చేసింది. బాలగోపాల్ 90 దశక ప్రారంభం వరకు ఎకనామిక్ అండ్ పొలిటికల్ వీక్లీలో ప్రచురించిన అనేక వ్యాసాలలో మాండలిక మార్క్సిస్ట్ పద్ధతిని అనుసరించాడు. సోవియట్ యూనియన్ పతనంతో తీవ్ర మనస్తాపానికి గురైన బాలగోపాల్ సమాధానాల కోసం మార్క్సిజంలో మానవతావాద సంప్రదాయాలను అన్వేషించడం ప్రారంభించాడు. 90 వ దశకంలో ఆయన వ్యాసాలు ఈ మార్పును ప్రతిబింబిస్తాయి. రాజ్య హింస తోపాటు ప్రైవేటు హింసను ఆయన వ్యతిరేకించాడు. నక్సల్బరీ ఉద్యమానికి ఎంతోమంది కార్యకర్తలను అందించిన ఆయన ఆ తర్వాత క్రమంలో విప్లవపార్టీల వైఖరిని తప్పుబట్టారు. ప్రజలకు చేరువకావడంలో ఎం.ఎల్ పార్టీలు విఫలమయ్యాయని విమర్శిం చారు. ఆయన రాసిన 'నక్సల్బరీ ఉద్యమం, గమ్యం, గమనం', 'చీకటి కోణం' పుస్తకాలు సంచలనం సృష్టించాయి. మావోయిస్టుల హింస చర్యలపై ఆయన బహిరంగంగా విమర్శిం చడం నక్సలైట్ల నుండి తీవ్ర విమర్శలను ఆకర్షించింది. పశ్చిమ బెంగాల్లోని లాల్ ఘడ్ లో జరిగిన హింసపై ఆయన చేసిన వ్యాఖ్యల తరువాత, మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు మల్లోజుల కోటేశ్వర్ రావు... బాలగోపాల్ను లాల్ గఢ్ నిరోధక ప్రాంతాన్ని సందర్శించి నిజమైన చిత్రాన్ని తెలుసుకోవాలని సవాలు చేశాడు. ఆయన 2008 లో భారతదేశ ప్రణాళికా సంఘం ఏర్పాటు చేసిన తీవ్రవాద ప్రభావిత ప్రాంతాలలో అభివృద్ధి సవాళ్ళపై నిపుణుల సమూహంలో సభ్యుడిగా పనిచేశాడు. మానవ హక్కులు అవిభక్త మైనవని ఆయన నమ్మాడు. అతను తన సరళమైన జీవనానికి మరియు ఎకనామిక్ అండ్ పొలిటికల్ వీక్లీలో క్రమం తప్పకుండా కనిపించే విశ్లేషణాత్మక వ్యాసాలకు ప్రసిద్ది చెందాడు. ఇపిడబ్ల్యులోని అతని కథనాలలో ఇందిరా గాంధీ పాలన, రిజర్వేషన్ల సమస్య, వివిధ ప్రదేశాలలో ఎప్పటికప్పుడు మానవ హక్కుల ఉల్లంఘన, గుజరాత్ అల్లర్లు, ప్రత్యేక ఆర్థిక మండలాలు, భూసేకరణ, ఆంధ్రప్రదేశ్లోని షెడ్యూల్డ్ కులాల ఉప వర్గీకరణ, వైయస్ఆర్ ప్రభుత్వం మరియు సిపిఐ-మావోయిస్టుల మధ్య చర్చలు తదితరాలతో ఆయన పాత్ర విడదీయరానిది. రాడికల్ విప్లవం కోసం తాము కృషి చేస్తున్నామని చెప్పుకునే వారి మానవ హక్కుల ఉల్లంఘనను ఆయన తెలుగు వ్యాసం 'చీకటి కోణాలు' లో ప్రత్యక్షంగా ప్రశ్నించారు. మానవ హక్కుల ఫోరం ఏర్పడిన తరువాత, అతను తన కార్య కలాపాలను విస్తరిం చాడు. జమ్మూ కాశ్మీర్, గుజరాత్, పశ్చిమ బెంగాల్ మరియు ఒరిస్సాలో తీవ్రమైన సామాజిక గందరగోళానికి గురైన ప్రాంతాలను సందర్శించాడు. ఒరిస్సాలో అతని నిజనిర్ధారణ బృందాలు రాయగడ జిల్లాను సందర్శించాయి. ప్రధాన స్రవంతి రాజకీయ పార్టీల పనితీరులో ఉన్న వంచనను ఆయన విశ్లేషించాడు, బహిర్గతం చేశాడు. బాల గోపాల్ దాదాపు ఒక దశాబ్దం క్రితం న్యాయశాస్త్రం అభ్యసించడం ప్రారంభించాడు. పోలీసులు హత్యలను ఎదుర్కో వటానికి సంబంధించిన డజన్ల కొద్దీ కేసులను వాదించాడు. ఎన్కౌంట ర్లలో పాల్గొన్న పోలీసులపైన హత్యానేరం నమోదు చేయాలని ఆయన గట్టిగా వాదించి విజయం సాధించాడు. ఈ రాష్ట్రంలో ఆయన అడుగుపెట్టని పల్లె లేదు, పట్టణం లేదు. అరణ్యాల నుంచి జనారణ్యాల వరకూ ఎక్కడ ఏ సమస్య తలెత్తినా ఆయన తప్పని సరిగా ఆ ప్రాంతానికి వెళ్లి అధ్యయనం చేసేవాడు. అందుకే మన భౌగోళిక, నైసర్గిక స్థితిగతులపై ఆయనకున్న జ్ఞానం అపారం. ఆయన అక్టోబర్ 8, 2009 రాత్రి హైదరాబాద్ లోని బంజారా హిల్స్ లో గుండెపోటుతో మరణించాడు.

# విద్యా వ్యాప్తికి ఓ అద్భుత వరం

రాయడానికి అందుబాటులో ఉన్న ఏకైక ఉత్తమ సాధనం "బాల్పాయింట్" పెన్ లేదా "బాల్ పెన్" అని మనకు తెలుసు. చిన్నారి నుంచి పండు ముసలి వరకు అందరి హస్త భూషణం బాల్ పెన్. బాల్ పెన్ను చూడని, స్పర్శించని వారు ఉంచారా ! విద్యా బోధన, విద్యావంతుల జేబు భూషణం, వ్యాపార గణాంకాల పునాది, సమాచార వితరణశీలి పెన్ను మాత్రమే. నేడు ప్రపంచవ్యాప్తంగా పెన్ను అంటేనే బాల్పాయింట్ పెన్ అనేది నిర్వివాదాంశం. గత ఎనిమిది దశాబ్దాలకు పైగా మన ఇంటి నేస్తం అయ్యింది బాల్ పెన్ను. గతంలో ఇంకులో ముంచి రాసుకునే పన్నులు, సిరా నింపి రాసుకునే పన్నులను చూసాం. నేడు ఇంకా పెన్ను అంతరించిపోయింది. బాల్పాయింట్ పెన్ను మన నిత్య నేస్తం అయ్యింది. 1888లో జాన్ లావుడ్ అనే శాస్త్రవేత్త ఇంకు పెన్నును కనుగొనడం జరిగింది. ఇంకు పెన్ను వాడుకలో వచ్చిన అసౌకర్యాల వల్ల మరో మెరుగైన పెన్ను అవసరం ఏర్పడింది. 1938లో "లాజ్లో బిరో" అనే హంగేరియన్ జర్నలిస్టు బాల్పాయింట్ పెన్నులు తెలిసాయి రూపొందించడం, తర్వాత 10 జూన్ 1943న తన సోదరుడు ఇంజనీర్ "జియార్జీ బిరో"తో కలిసి బాల్పాయింట్ పెన్నును పెటెంట్ చేయడం జరిగింది. ఈ పరమ అద్భుత ఆవిష్కరణకు గుర్తుగా ప్రతి ఏట 10 జూన్న ప్రపంచ దేశాలు "జాతీయ బాల్పాయింట్ పెన్ దినోత్సవం (నేషనల్ బాల్పాయింట్ పెన్ డే)" పాటించడం ఆనవాయితీగా మారింది. జాతీయ బాల్పాయింట్ పెన్ దినం వేదికగా పెన్నులు కృతజ్ఞతలు తెలపడం, వివిధ రకాల పెన్నుల ప్రదర్శనలు, పెన్నులను అలంకరించి కృతజ్ఞతలు తెలపడం, పెన్తో మన ఆప్తులకు ఉత్తరం రాయడం, పెన్ను ప్రాధాన్యాన్ని గూర్చి వ్యాసం రాయడం, బాల్ పెన్ ఆవిష్కర్తలకు కృతజ్ఞతలు తెలపడం లాంటి కార్యక్రమాలను నిర్వహించవచ్చు. నాటి నుంచి నేటి వరకు విద్యాలయాలు, విద్యావంతులు, వ్యాపారవేత్తలు, కార్యాలయాలు, ఉత్తర ప్రత్యుత్తరాలు, అన్ని వర్గాల ప్రజలు/యువా/పిల్లలకు ఆత్మీయ నేస్తంగా, గౌరవాన్ని పెంచే చవకైన సాధనంగా, జేబుకు అలంకారంగా బాల్పాయింట్ పెన్ను అపార అద్వితీయ సేవలను అందిస్తున్నది. బాల్పాటింట్ పెన్ సాధనంగా విద్యా బోధనలు, సాంస్కృతిక వికాసం, ఆర్థిక వ్యవస్థలు, సగటు మనిషి జీవనశైలిలో ఓ అవిభాజ్య భాగం అయ్యింది. ఒక్క బాల్పాయింట్ పెన్తో దాదాపు 50,000 పదాలు రాస్తూ 100 పేజీల వరకు రాయవచ్చు. ప్రతి ఒక్కరు సాలీనా సగటున 4.3 బాల్ పెన్నులను వాడడం జరుగుతోంది. ప్రపంచవ్యాప్తంగా సెకనుకు 125 బాల్ పెన్నుల అమ్మకాలు జరుగుతున్నాయి. పలు రకాల బ్రాండ్లు, అద్భుత ఆకృతులు, ఆకర్షణీయ కళా సంపదలతో బాల్ పెన్నులు మనకు అందుబాటులో ఉన్నాయి. తరగతి గది గుండెకాయ బాల్ పెన్ అని తెలుసుకోవాలి. అందరికీ చవకగా అందుబాటులో ఉన్న బాల్పాయింట్ పెన్నులు నమ్మకమైన, నాణ్యమైన, మృదు రాతల ధారలు పారిస్తున్నాయి. తేలికగా పేపరుపై పారడం, సులభంగా ఆరిపోవడం, అందమైన రాతలకు వారధిగా కావడం బాల్ పెన్ను ప్రత్యేకతలుగా పేర్కొనాలి. ఆకర్షణీయమైన రంగులు, వివిధ కాళాకృతులతో నేడు బాల్ పెన్నులు పిల్లలు/యువతలో చదుకోవాలనే, రాయాలనే ఉత్సుకతను ప్రేరేపిస్తున్నాయి. నేడు అందమైన బాల్పాయింట్ పెన్నులు వ్యక్తుల స్థాయిని, వ్యక్తిత్వాలను చెప్పకనే చెబుతున్నాయి. మన జేబులో చేరిన పెన్ను మన హృదయ ఉపరితలంపై నాట్యమాడుతూ మనకు సమోన్నత గౌరవాన్ని ఆర్జించి పెడుతున్నాయి. మన జీవితంలో ఒక విడదీయరాని భాగమైన బాల్పాయింట్ పెన్నులను పూజాగదిలో ఇష్టదైవం ముందు పెట్టి మనకు విజ్ఞాన వివేకాలను అందించమని వేడుకుందాం. మన బాల్పాయింట్ పెన్నుకు శతకోటి వందనాలు అర్పిద్దాం, సన్మార్గంలో నడిచే ధైర్యాన్ని ఇవ్వమని వేడుకుందాం.

## పలు ప్రత్యేకతల సమాహారం దుగ్గిరాల జీవనయానం

తమ తాత తండ్రుల నాటినుండి నివాసముంటున్న తమ ఆవాస స్థానాలను వదిలి, కేవలం ఒక వ్యక్తి చెప్పిన మాటలను తూ.చా తప్పకుండా పాటించి ఒక నిరసన తెలియ జేయడం కోసం లక్ష్య సాధన ధ్యేయంగా గ్రామాలనే వదిలి వెళ్ళిన ఉదంతం చరిత్రలో ఎక్కడా జరిగి ఉండదు. భారత స్వాతంత్ర్యోద్యమ సమయంలో ఒక అరుదైన స్ఫూర్తిదాయకమైన సంఘటన తెలుగు నేలపై జరిగింది. ఒకరు కాదు ఇద్దరు కాదు, పదులు కాదు వందలు కాదు, రెండు గ్రామాలకు చెందిన పదిహేడు వేల మంది ఆ సంఘటనలో స్వగ్రామాలు వదిలి సరి హద్దులు దాటి బయట సంవత్సర కాలంగా ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటూ లక్ష్యం కోసం జీవితాలు గడపాలంటే అది సామాన్యమైన విషయం కాదు. అలా వేలాది మంది అభిమానాన్ని చూరగొని వారిని సంఘటితంగా ఒక్కటిగా నిలిపిన ఘనత ప్రముఖ స్వాతంత్ర సమర యోధుడు, తెలుగు వాడు దుగ్గిరాల గోపాలకృష్ణయ్య దక్కుతుంది. 1919 లో బ్రిటిష్ ప్రభుత్వం చీరాల, పేరాల రెండు గ్రామాలను కలిపి మునిసిపాలిటీగా విలీనం చేసినపుడు, అధిక పన్నులు చెల్లించడానికి వ్యతిరేకంగా జరిగిన సహాయ నిరాకరణోద్యమానికి గోపాల కృష్ణయ్య నాయకుడు. ఇది స్వాతంత్ర్య పోరాటంలో ఒక ముఖ్యమైన గాంధీజీ సందర్శించి అభినందించిన చీరాల పేరాల సమరం సుప్రసిద్ధం, ముఖ్య ఘట్టం. స్వాతంత్ర్య సమర యోధుల్లో ప్రముఖుడు దుగ్గిరాల గోపాల కృష్ణయ్య (జూన్ 2, 1889 – జూన్ 10, 1928) ఆయన గొప్ప నాయకుడు, సాహసికుడు, వక్త, కవి, గాయకుడు. ఆంధ్ర రత్న బిరుదు బిరుదాంకితుడు. కృష్ణా జిల్లా, పెనుగంచిప్రోలు గ్రామంలో 1889 జూన్ 2 న దుగ్గిరాల గోపాల కృష్ణయ్య జన్మించారు. ఆయన పుట్టిన మూడవ రోజునే తల్లి సీతమ్మ, మూడో ఏట తండ్రి కోదండ రామస్వామి మరణించారు. అప్పటినుండి పినతండ్రి, నాయనమ్మల సంరక్షణలో పెరిగారు. కూచిపూడిలోను, గుంటూరులోను ప్రాథమిక విద్య జరిగింది. హైస్కూలులో చదివే సమయంలోనే 'జాతీయ నాట్య మండలి' స్థాపించి సంగీత, నాటక కార్యక్రమాలు నిర్వహించారు. అయితే చదువుపై అంత శ్రద్ధ చూపక పోవడం చేత మెట్రిక్యులేషనులో తప్పారు. తరువాత బాపట్ల లో చదివి ఉత్తీర్ణుడయ్యారు. నడింపల్లి వెంకట లక్ష్మీ నరసింహారావు అనే ఒక మిత్రుని సాయంతో 1911లో స్కాట్లండు లోని ఎడింబరో విశ్వ విద్యాలయంలో ఎం.ఎ. చదివారు. తరువాత ఆనంద కుమార స్వామితో కలసి కొంతకాలం పని చేశారు. 1916లో తిరిగి భారతదేశం వచ్చిన దుగ్గిరాల, నాటి జాతీయ ఉద్యమానికి కేంద్రంగా వున్న బందరులోని జాతీయ కళాశాలలో ఉద్యోగంలో చేరారు. ఆ సమయంలో నందికేశ్వరుడు రచించిన 'అభినయ దర్పణం' అనే గ్రంథాన్ని "ఫ్త్రవ వీఱతీతీశీతీ శీట +వర్బతీవ," అన్న పేరుతో సంస్కృతం నుండి ఆంగ్లంలోకి అనువదించారు. ఇది 1917లో 'కేంబ్రిడ్జ్ – హార్వర్డ్ యూనివర్శిటీ ప్రెస్' వారిచే ప్రచురించ బడడం విశేషం. 1920లో మహానందిలో జరిగిన ఆంధ్రమహాసభకు అధ్యక్షుడిగా ఒక అంగవస్త్రం, ఒక కండువా, మెడలో రుద్రాక్షమాలతో ప్రత్యక్షమయ్యారు. నాటి నుండి దాదాపుగా ఆయన జీవితం శ్రీరామచంద్రునికే అంకితమన్న రీతిలో సాగింది. 1921 లో గుంటూరులో ఒక సభలో "ఆంధ్ర రత్న" అన్న బిరుదుతో ఆయనను సత్కరించారు. 1921లో బెజవాడ కాంగ్రెస్ సమావేశాలను దుగ్గిరాల తయారు చేసిన వెయ్యిమంది ఎర్రని చొక్కా కుంకుమ బొట్టు ధరించిన ఆ రామదండు సేవా దళమే విజయవంతం చేశారు. రామదండు దుగ్గిరాలకు నమ్మిన బంట్లుగా మిగిలారు. ఆయనలోని ప్రతిభకు అలిండియా కాంగ్రెస్ కార్యదర్శి పదవి దక్కింది. ఆ పదవి దక్కించుకున్న అతి పిన్న వయస్కుడు, తొలి ఆంధ్రుడు ఆయనే. జాతీయ కాంగ్రెస్ ఆఫీసును విజయ వాడలో పెట్టించింది దుగ్గిరాల గోపాలకృష్ణయ్యే. కుటిల రాజకీయ నేతల మధ్య ఇముడలేక, 1923 తర్వాత రాజకీయాలు తనకు వద్దని దూరంగా జరిగారు. తాను వ్యక్తిగా కొత్త జీవితానికి శ్రీకారం చుట్టారు. తెలుగు నాట జానపద కళా రూపాల పునరుద్ధరణకు, గ్రంథాలయాల వ్యాప్తికి గోపాల కృష్ణయ్య ఇతోధికంగా కృషి చేశారు. ఆయన ప్రచారం చేసిన జానపద కళారీతులు – తోలు బొమ్మలాట, జముకుల కథ, బుర్రకథ, వీధి నాటకాలు, సాము గరిడీలు, గొల్ల కలాపం, బుట్ట బొమ్మలు, కీలు గుర్రాలు, వాలకాలు, గోసంగి, గురవయ్యలు, సరదా కథ, కిన్నెర కథ, కొమ్ము బూర, జోడు మద్దెల, పల్లె సుద్దులు, తూర్పు భాగోతం, చుట్టు కాముడు, పిచ్చికుంట్లవాళ్ళ కథ, సాధనా శూరులు, పలనాటి వీర విద్యావంతులు తదితరాలు ఉన్నాయి. 'సాధన' అనే ఇంగ్లీషు పత్రిక, 'రామదండు అనే తెలుగు పత్రికలు నడిపారు. కాంగ్రెస్ వారి అవలక్షణాలను నాడే ఎత్తి చూపిన పత్రికలు అవి.

అటువంటి పత్రికలను మూతపడే వరకు ఆంధ్ర కాంగ్రెస్ నాయకులు శ్రమించారు. వ్యక్తుల్లో ఇంత సంకుచిత భావం, ఈర్ష్యా ద్వేషాలు వుంటాయని దుగ్గిరాల భావించలేదు. అటువంటి నాయకుల మధ్య కలిసి పని చేయటం కన్నా రామభక్తుడిగా శేష జీవితం గడపటం మంచిదను కున్నారు. తన భార్య ఆభరణాలు, వెండికంచం అమ్మిన డబ్బులతో కోదండ రామాలయం, రామలింగే శ్వర ఆలయం నిర్మాణం చేపట్టాలని భావించి పునాదుల వరకు నిర్మించారు. తన యావదాస్తి ఆ దేవాలయాలకే చెందాలని బహిరంగ వీలునామా రాసి ఆంధ్ర పత్రికలో ప్రకటించారు. గుంటూరులో చిన్న ఇంట్లో మకాం మారగా అప్పటికే ఆయనకు క్షయవ్యాధి సోకింది. సొంత ఇంటిలో కన్ను మూయాలన్న కోరికతోనే గుంటూరులో ఊరికి చివరిలో చిన్న ఇల్లు నిర్మించే యత్నం చేశారు. కిటికీలు, తలుపులు కాకుండానే అంత్య కాలం అందులో గడపాలని గృహ ప్రవేశ తంతు ముగించారు. తనకు అన్నింటికీ ఆ రాముడే దిక్కు. అన్నీ రామలీలలే అని చెప్పుకున్నారు దుగ్గిరాల. 28 మే, 1928న గృహప్రవేశం చేసి చుట్టూ వున్న పేదలకు అన్నదానం చేశారు. తన జీవితం అయి పోయిందని ఆయనకు అర్థమై, జూన్ 10న వైద్యుడు చూసి పరవాలేదని చెప్పినా దుగ్గిరాల గోపాలకృష్ణయ్య నమ్మలేదు. ఆ రాత్రి తన మంచం పక్కన ఒక చాప పరచి వుంచమని కోరారు.

రాత్రి పదిగంటల వేళ బాగా దగ్గుతూ, తనను మంచంమీద నుండి చాపమీదికి మార్చమన్నారు. అలా చాపమీద పరుండి తన ఇష్ట దైవమైన రాముని స్మరిస్తూ రాత్రి 10.45 సమయంలో ప్రాణం వదిలారు దుగ్గిరాల. ఆంధ్రరత్న బ్రతికింది కేవలం నాలుగు పదుల లోపే అయినా, విలువలతో కూడిన నిస్వార్థ సేవా నిరతికి ప్రతిరూపమైన దుగ్గిరాల జీవితం ఎందరికో ఆదర్శం. జూన్ 10, 1928 లో గోపాలకృష్ణయ్య మరణించారు.

# ఆ సేవలు బంద్...

విజయవాడ, జూన్ 9, ఏపీ సచివాలయాల్లో సేవలు బంద్.. కారణం అదే! ఏపీ ప్రభుత్వం ప్రజలకు కీలక సమాచారం ఇచ్చింది. రాష్ట్రవ్యాప్తంగా గ్రామ, వార్డు సచివాలయాల్లో ఆన్లైన్ సేవలు తాత్కాలికంగా నిలిపివేయడం హాట్ టాపిక్ గా మారింది. జూన్ 10 మంగళవారం రాత్రి వరకు సేవలను నిలిపివేయనున్నట్లు ఏపీ ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు గ్రామ, వార్డు సచివాలయాల శాఖ డైరెక్టర్ శివప్రసాద్ అధికారిక ప్రకటన విడుదల చేశారు. అయితే సాంకేతిక అంశాలతోనే ఈ సేవలకు అంతరాయం కలుగుతుందని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఇప్పటికే దీనిపై పెద్ద ఎత్తున సచివాలయ ఉద్యోగులు ప్రచారం చేస్తున్నారు. సేవలు నిలిచిపోతాయని ముందుగానే ప్రజలకు సూచించారు. అయితే ఇది ఒక హాట్ టాపిక్ అవుతోంది. ప్రస్తుతం రేషన్ కార్డుల దరఖాస్తు ప్రక్రియ సాగుతోంది. ఇంకోవైపు విద్యా సంవత్సరం ప్రారంభం కావడంతో విద్యార్థులకు ధృవపత్రాలు అవసరం అవుతాయి. ఇటువంటి సమయంలో ఆన్లైన్ సేవలు నిలిపివేయడంపై ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ఏపీ సేవా పోర్టల్ ను మైక్రోసాఫ్ట్ క్లౌడ్ నుంచి రాష్ట్ర ప్రభుత్వ డేటా సెంటర్కు మై గ్రేట్ అవుతోంది. ఈ డేటా మార్పిడి ప్రక్రియ కారణంగా రాష్ట్రవ్యాప్తంగా సచివాలయాలు, మీసేవ కేంద్రాల్లో కొన్ని ముఖ్యమైన ఆన్లైన్ సేవలు అందుబాటులో ఉండకపోవచ్చు అని అధికారులు ముందుగానే వెల్లడించారు. ముఖ్యంగా తాత్కాలికంగా నిలిచే ముఖ్యమైన సేవలపై స్పష్టతనిచ్చారు. ఆదాయ ధ్రువీకరణ పత్రం, సమగ్ర ధ్రువీకరణ పత్రం, భూమి మ్యూటేషన్లు, ఇళ్ల స్థలాల దరఖాస్తులు, వృద్ధాప్య ధ్రువీకరణ పత్రం, వివాహ ధ్రువీకరణ పత్రం, రేషన్ కార్డు సంబంధిత సేవలు, రెవెన్యూ సేవలు, వాటర్ ట్యాక్స్, ప్రాపర్టీ టాక్స్ పేమెంట్లు, పట్టణ పరిపాలన శాఖ సేవలు, మత్స్య శాఖ సేవలు నిలిపి వేస్తున్నట్లు చెప్పింది. అయితే ఈ ధ్రువీకరణ పత్రాల కోసం సచివాలయాలకు వెళ్తున్న వారికి నిరాశ ఎదురవుతోంది. అయితే ఇది తప్పకుండా చేయాల్సిన మార్పు అని? మంగళవారం రాత్రి నుంచి యధాతథంగా సేవలు అందుబాటులోకి వస్తాయని అధికారులు చెబుతున్నారు. ఈ ఆన్లైన్ మార్పుల ప్రభావం అన్ని ప్రభుత్వ సేవలపై ఉండదని కూడా అధికారులు చెబుతున్నారు. ఆధార్ అప్డేట్స్ బ్యాంకు సేవలు, పలు కేంద్ర ప్రభుత్వం స్కీములు, నాన్ రెవెన్యూ ఆధారిత సేవలు వంటి కొన్ని సేవలు మీ సేవ కేంద్రాల్లో యధావిధిగా అందుబాటులోకి ఉంటాయని అధికారులు చెబుతున్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని.. అత్యవసర పనుల కోసం ముందుగానే అవసరమైన ధ్రువీకరణ పత్రాలు లేదా అప్లికేషన్లు చేసుకోవాలని సూచిస్తున్నారు. అంతరాయం ముగిసిన వెంటనే సేవలు మళ్లీ పూర్వస్థితికి తీసుకొస్తామని చెప్పుకొస్తున్నారు. మొత్తానికి అయితే సచివాలయాల సేవలకు అంతరాయం కలుగుతుండడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు.

# పంటి కింద నలుసుగా వర్మ..

కాకినాడ, జూన్ 9, పిఠాపురం నియోజకవర్గంలో తెలుగుదేశం, జనసేనల మధ్య విభేదాలు రోజురోజుకు ముదురుతున్నాయి. అక్కడ టీడీపీ నేతలకు, జనసేన నేతలకు మధ్య పొసగడం లేదు. పవన్ కల్యాణ్ మాజీ ఎమ్మెల్యే వర్మ కు ప్రాధాన్యత ఇస్తున్నప్పటికీ అక్కడ ఉన్న జనసేన ఇన్ ఛార్జులతో పాటు కార్యకర్తలు టీడీపీ నేతలు లెక్క చేయడం లేదు. కనీసం ప్రభుత్వ కార్యక్రమాలకు కూడా ఆహ్వానాలు ఉండటం లేదు. దీంతో జనసేన నేతల పర్యటనల్లో టీడీపీ నేతలు జై వర్మ.. జై జై టీడీపీ అన్న నినాదాలు పెద్దయెత్తున వినిపిస్తున్నాయి. నాగబాబు పర్యటించినప్పుడు కూడా ఇవే నినాదాలు వినిపించాయి. అయితే జనసేన లోకల్ లీడర్స్ మాత్రం పట్టించుకోవడం లేదు. మరొకవైపు మాజీ ఎమ్మెల్యే వర్మ కూడా ఇక లాభం లేదనుకున్నాడో ఏమో రివర్స్ అటాక్ కు రెడీ అయినట్లు కనపడుతుంది. ఇటు కూటమి ధర్మానికి తూట్లు పడకుండానే, జనసేన నేతలను ఇరుకునపడేలా ఆయన చేస్తున్న కామెంట్స్ వైరల్ గా మారుతున్నాయి. పిఠాపురం నియోజకవర్గంలో ఇసుక దోపిడీ కొనసాగుతుందని తెలిపారు. ఇసుక మాఫియా పిఠాపురం నియోజకవర్గంలో రాజ్యమేలుతుందని, రాత్రి వేళ రెండు వందల లారీల ఇసుకను తరలిస్తున్నారని కూడా వర్మ వ్యాఖ్యానించడం విశేషం. పోలీసులు కూడా చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారని, పోలీసులకు కూడా భారీగానే ముడుపులు ముడుతున్నట్లు అనిపిస్తుందని వర్మ అనడం మరింత ఇబ్బంది పెట్టేలా ఉంది ఉప ముఖ్యమంత్రిగా అందరికీ ఆదర్శంగా ఉందామనుకుంటున్న ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలోనే ఇసుక అక్రమ రవాణా జరుగుతుందని మిత్ర పక్షానికి చెందిన నాయకుడు విమర్శలు చేస్తుంటే పవన్ పరువు పోవడమే కాకుండా, పిఠాపురంలో ఏదో జరుగుతుందని అందరికీ అర్థమయ్యే పరిస్థితులు నెలకొన్నాయి. ఇటీవల జరిగిన మహానాడు కార్యక్రమంలో కూడా వర్మకు టీడీపీ నాయకత్వం ప్రాధాన్యత ఇవ్వడం కనిపించింది. దీంతో మహానాడు తర్వాత ఈ వ్యాఖ్యలు చేయడం చూస్తుంటే పవన్ కల్యాణ్ పేరు ప్రస్తావించకపోయినా, ఆయన ఇమేజ్ ను డ్యామేజీ చేయాలన్న భావన వర్మలో ఎక్కువగా ఉన్నట్లు కనిపిస్తుందన్న విశ్లేషణలు వినిపిస్తున్నాయి. వర్మ మామూలుగా చేసిన వ్యాఖ్యలుగా దీనిని చూడాల్సిన అవసరం లేదు. ఎందుకంటే వర్మ సీనియర్ నేత. ఆయన ఏం మాట్లాడితే దాని పర్యవసానాలు ఎలా ఉంటాయో అందరికీ తెలుస్తుంది. కానీ గతంలో నాగబాబు జనసేన ఆవిర్భావ దినోత్సవంలో చేసిన వ్యాఖ్యలు వర్మను ఇబ్బంది పెట్టేవిగా ఉన్నాయి. అలాగే నాదెండ్ల మనోహర్ కూడా పిఠాపురం పవన్ కల్యాణ్ అడ్డా అని అనడం వర్మ ఇగోను దెబ్బతీసిందంటున్నారు. ఈ వ్యాఖ్యలకు కౌంటర్ గానే ఇసుక అక్రమ రవాణా పిఠాపురం నియోజకవర్గంలో జరుగుతుందంటూ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు జనసేనను ఇరకాటంలోకి నెట్టేసి నట్లే కనిపించాయి. ఇసుక అక్రమ రవాణాను అరికట్టలేని తన సొంత నియోజకవర్గంలోనే పట్టు పవన్ కు లేదా? అని సోషల్ మీడియాలో ప్రశ్నిస్తున్నారు.

# టీడీపీలో కోవర్టుల కలకలం

విజయవాడ, జూన్ 9, తెలుగుదేశం పార్టీలో కోవర్టులు చేరుతున్నారన్న ప్రచారంతో ఆ పార్టీ అప్రమత్తమయింది. చాలా నియోజకవర్గాల్లో వైసీపీ ద్వితీయ శ్రేణి నేతలు టీడీపీలో చేరుతున్నారు. వీరి వల్ల అనేక సమస్యలు వస్తున్నాయని.. టీడీపీలో చేరి.. టీడీపీ కార్యకర్తలుగా మారి.. టీడీపీ నేతలను హత్యలు చేస్తున్నారన్న ఆరోపణలు కూడా వస్తున్నాయి. స్వయంగా చంద్రబాబు నాయుడు ఇటీవల టీడీపీ కార్యకర్తల హత్యల విషయంలో ఇదే జరిగిందని పార్టీ ప్లీనరీలో చెప్పారు. కోవర్టులు ఉన్నారని వారిని ఏరివేస్తానని హెచ్చరించారు. ఈ క్రమంలో పార్టీ నాయకత్వం చేరికలపై ఆంక్షలు విధించింది. సాధారణంగా అధికారంలో ఉన్న పార్టీల్లోకి పెద్ద ఎత్తున వలసలు వస్తాయి. ప్రతీ సారి ఇదే సమస్య ఉంటుంది. ఈ సారి మూడు పార్టీల కూటమిగా ఎన్నికల్లో పోటీ చేసి గెలిచింది. వైసీపీ పూర్తి గా సమస్యల్లో పడటం,ద్వితీయ శ్రేణి నాయకులు తమ అవసరాల కోసం ఈ మూడు పార్టీల్లో ఒక దాంట్లో చేరేందుకు ప్రయత్నించడం కామన్ గా మారిపోయింది. జిల్లా స్థాయి నేతల చేరికల విషయంలో మూడు పార్టీలు కలిసి నిర్ణయం తీసుకుంటున్నాయని చెబుతున్నారు. అయితే కింది స్థాయి .. గ్రామ స్థాయి క్యాడర్ విషయంలో మాత్రం పార్టీ నేతలు స్వచ్ఛగా నిర్ణయాలు తీసుకుంటున్నారు. అయితే అలా చేరుతున్న వారిలో కోవర్టులు, నేరగాళ్లు ఉండటం ఆ పార్టీకి సమస్యగా మారింది. కోవర్టుల విషయంలో టీడీపీ అధినేత చంద్రబాబునాయుడుకు స్పష్టమైన సమాచారం ఉండటంతో పలుమార్లు పార్టీ వేదికలపై సూటిగానే హెచ్చరికలు జారీ చేశారు. రాజకీయంగా అధికారంలోకి వచ్చిన తర్వాత పార్టీ కోసం కష్టపడిన వారి అవకాశాలను కొట్టేయడానికి చాలా మంది చేరుతున్నారని అనుమానిస్తున్నారు. చంద్రబాబు నేరుగా హెచ్చరించినా కోవర్టుల చేరికలు ఆగకపోవడంతో అధికారికంగా సమాచారం పంపినట్లుగా చెబుతున్నారు. ఇక ముందు నుంచి ఎవరూ టీడీపీలో చేరాలన్నా పార్టీ హైకమాండ్ నుంచి అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. వచ్చే ఏడాది స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. ఆ ఎన్నికల్లో అవకాశాల కోసం చాలా మంది ఇతర పార్టీల నేతలు టీడీపీలోకి వస్తున్నారు. మాచర్లలో జరిగిన టీడీపీ నేతల జంట హత్యల వెనుక ఇలా అవకాశాల కోసం వచ్చిన వారే ఉన్నారని.. వారు తమ అవకాశాలను మెరుగుపర్చుకోవడానికి టీడీపీలో ఉన్న వారిని హత్య చేసినట్లుగా పోలీసులు గుర్తించారు. వారు అంతకు ముందు వైసీపీలో ఉండేవారు. ఈ సమస్యలన్నింటికీ పరిష్కారం.. చేరికలు ఆపేయడమేనని నర్ణయానికి వచ్చారు.

ఒకటి, రెండు సార్లు ఆలోచించుకోవాలి

టిడిపిలో చేరాలనుకునే వారికి షరతులు వర్తిస్తాయి అంటోంది ఆ పార్టీ హై కమాండ్. చేరికల విషయంలో స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది.' టిడిపి అధినేత చంద్రబాబు ఆదేశానుసారం ఇతర పార్టీ నాయకులను టిడిపిలోకి జాయిన్ చేసుకునే ముందు తప్పనిసరిగా వారి గురించి కేంద్ర కార్యాలయానికి తెలియజేయాలి. వారి గురించి పూర్తిగా కేంద్ర కార్యాలయం విచారణ చేసిన తర్వాత పార్టీ అనుమతితో వారిని ఆహ్వానించాల్సి ఉంటుంది. ఈ విషయాన్ని తెలుగుదేశం పార్టీలో వివిధ హోదాల్లో ఉన్నటువంటి నాయకులు అందరూ గమనించగలరు' అంటూ మంగళగిరి కేంద్ర కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. ఇటీవల తెలుగుదేశం పార్టీలో జరిగిన పరిణామాల దృష్ట్యా హై కమాండ్ ఈ నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోందిగత మాదిరిగా పార్టీలో చేరాలనుకునే వారికి చేర్చుకుంటామంటే కుదరదు. కచ్చితంగా కేంద్ర కార్యాలయానికి సమాచారం ఇవ్వాల్సి ఉంటుంది. అక్కడ నుంచి అనుమతి వచ్చిన తర్వాతే టిడిపిలో చేరికలు ఉంటాయని స్పష్టత ఇచ్చారు. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు పెద్ద ఎత్తున టిడిపిలో చేరారు. గ్రామస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు నేతలు అధికార పార్టీలోకి వచ్చారు. అయితే వీరిలో కొందరు కోవర్టులు ఉన్నారని సీఎం చంద్రబాబు స్వయంగా కడప మహానాడు వేదికగా కామెంట్ చేశారు. పార్టీ కోసం కష్టపడిన వారికి గుర్తింపు ఇస్తామన్నారు. కొవ్వొత్తులను పార్టీలోకి పంపాలనుకుంటే ఆటలు సాగవని.. వలస పక్షులు వస్తాయి.. పోతాయి అంటూ కామెంట్స్ చేశారు. కొవ్వొత్తుల విషయంలో జాగ్రత్తగా ఉండాలని పార్టీ కార్యకర్తలకు సూచించారు.వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి తెలుగుదేశం పార్టీలో చేరిన వారితో ఇబ్బందికర పరిస్థితులు ఎదురవుతున్నాయి. మొదటినుంచి జండా మోసిన వారిని కాదని కొత్తగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరిన వారికి ప్రాధాన్యమిస్తున్నారని హై కమాండ్ కు ఫిర్యాదులు వెల్లువెత్తుతాయి. ఈ పరిస్థితుల్లోనే హై కమాండ్ ఈ ప్రత్యేక ప్రకటన చేసినట్లు తెలుస్తోంది. మరోవైపు పవన్ కళ్యాణ్ సైతం తమ పార్టీ శ్రేణులకు మరోసారి అల్టిమేటం ఇచ్చారు. పార్టీ లైన్ దాటి మాట్లాడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. రెండు పార్టీలు ఏకకాలంలో ఈ ప్రకటన చేయడంపై భిన్న కామెంట్స్ వినిపిస్తున్నాయి. నిఘా వర్గాల హెచ్చరికతోనే ఈ రెండు పార్టీలు అలాంటి ప్రకటన చేసి ఉంటాయని అనుమానాలు వస్తున్నాయి.

# శ్రీశైలం ప్రాజెక్టుకు స్పందించకపోతే భారీ ప్రమాదం తప్పదా?

కర్నూలు, జూన్ 9, కృష్ణానది ప్రవాహం ఆధారంగా అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు శ్రీశైలం జలాశయం నిర్మించారు. ఇది ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఉంది.తెలుగు రాష్ట్రాలకు అత్యంత కీలకమైన శ్రీశైలం జలాశయం ప్రమాదంలో పడిందా? ఈ జలాశయానికి సంబంధించి అక్కడి ప్రభుత్వం తక్షణమే స్పందించకపోతే పెను విపత్తు తప్పదా? దీనికి అవును అని సమాధానం చెబుతున్నాయి ఏపీ ప్రభుత్వ వర్గాలు. ఎంతో ఉదాత్తమైన ఆశయంతో నిర్మించిన ఈ జలాశయం ప్రమాదంలో ఎందుకు పడింది? ప్రభుత్వం తక్షణమే స్పందించకపోతే జరిగే నష్టం ఏమిటి?కృష్ణానది ప్రవాహం ఆధారంగా అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు శ్రీశైలం జలాశయం నిర్మించారు. ఇది ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఉంది. శ్రీశైలం జలాశయంలో నీటి ద్వారా విద్యుతును ఉత్పత్తి మాత్రమే కాకుండా నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు నీటిని సరఫరా చేస్తారు. ఈ జలాశయం ఆధారంగా వేలాది ఎకరాలలో పంటలు పండుతున్నాయి. రెండు కొండల మధ్య శ్రీశైలం జలాశయాన్ని నిర్మించారు. ఇక్కడ కృష్ణానది నీరు గ్రావిటీ ఆధారంగా కిందికి సరఫరా అవుతుంది. తెలంగాణ రాష్ట్రంలోని జూరాల ప్రాజెక్టులో నీరు శ్రీశైలానికి.. శ్రీశైలం నుంచి నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు సరఫరా అవుతుంది.. శ్రీశైలం నిండితే రెండు తెలుగు రాష్ట్రాలలో పంటలకు ఇబ్బంది ఉండదు. పైగా నాగార్జునసాగర్ కు ప్రధాన నీటి వనరుగా శ్రీశైలం జలాశయం ఉంది. శ్రీశైలం జలాశయం ఒకప్పుడు లోతుగా ఉండేది. అయితే గత కొంతకాలంగా ఈ జలాశయంలో పూడిక పేరుకు పోతోంది. ఈ పూడిక వల్ల జలాశయం నిల్వనీటి సామర్థ్యం తగ్గిపోతుంది. వర్షాకాలంలో వరదలు వచ్చినపుడు ప్రాజెక్టు నిండుకుండలా కనిపిస్తోంది. మార్చి నెల వచ్చేసరికి ప్రాజెక్టు నిండుకుంటున్నది. దీనివల్ల వేసవికాలంలో తాగునీటికీ ఇబ్బంది ఏర్పడుతోంది. అందువల్లే శ్రీశైలం ప్రాజెక్టులో పేరుకుపోయిన పూడికను తొలగించాలని ఎప్పటినుంచో విజ్ఞప్తులు వస్తున్నప్పటికీ ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదు.ఇక శ్రీశైలం ప్రాజెక్టుకు సంబంధించి నీరు విడుదల చేసే క్రమంలో డ్యామ్ గేట్లు తెరుస్తారు. ఆ సమయంలో నీళ్లు సరఫరా అయ్యే చోట భారీగా గొయ్యి ఏర్పడింది. దీన్ని నీటిపారుదల శాఖ పరిభాషలో "ప్లంజ్ పూల్" అని పిలుస్తుంటారు. వాస్తవానికి ఈ గుంత దశాబ్దల క్రితమే మొదలైంది. ఇప్పుడు ఏకంగా తాటి చెట్టు అంత పొడుగు లోతు విస్తరించింది. దీనివల్ల ప్రాజెక్టు పునాదులు దెబ్బతినే ప్రమాదం ఉందని శాస్త్రవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అయితే ఈ గుంత సమస్య పరిష్కారానికి శాస్త్రవేత్తల బృందం కొద్ది రోజుల క్రితం నుంచి సర్వే చేస్తోంది. ఈ సర్వే పూర్తయిన తర్వాత యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. లేనిపక్షంలో జలాశయం పునాదులు కదిలిపోయే ప్రమాదం ఉందని చెబుతున్నారు. ఒకవేళ జలాశయం పునాదులు గనుక కదిలిపోతే అప్పుడు జరిగే ప్రమాదం తీవ్రత అధికంగా ఉంటుంది. పరిస్థితి అక్కడిదాకా వచ్చే కంటే ముందే.. మేల్కోవడం మంచిదని శాస్త్రవేత్తలు అంటున్నారు.ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో గతంలో కృష్ణా నదికి విపరీతమైన వరదలు వచ్చాయి. ఆ సమయంలో నీరు అధికంగా రావడంతో శ్రీశైలం ప్రాజెక్టు క్రస్ట్ గేట్ల నుంచి నీరు బయటికి వచ్చింది. నాటి ఘటనలో కర్నూలు జిల్లా మొత్తం మునిగిపోయింది. నష్టం తీవ్ర స్థాయిలో వాటిల్లింది.

ఆ తర్వాత ఆ స్థాయిలో శ్రీశైలం ప్రాజెక్టుకు వరదలు రాకపోయినప్పటికీ.. ప్రాజెక్టు పైనుంచి వచ్చే నీటి వల్ల ఏర్పడిన ప్లంజ్ పూల్ కు మరమ్మతులు చేయాల్సిన అవసరం ఉందని సైంటిస్టులు చెబుతున్నారు. ఎందుకంటే శ్రీశైలం ప్రాజెక్టు రెండు తెలుగు రాష్ట్రాలకు అత్యంత ముఖ్యమైనది. కాకపోతే ఈ ప్రాజెక్టు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పరిధిలో ఉండడంతో ఎక్కువగా ఆ ప్రభుత్వానికి బాధ్యత ఉంటుందని తెలుస్తోంది.

# ఏపీలో అన్నా, చెల్లెళ్ల వార్

కాకినాడ, జూన్ 9, తెలుగు నాట కుటుంబ రాజకీయాలు ఎక్కువగా మారుతున్నాయి. ముఖ్యంగా అన్నా చెల్లెలు మధ్య రాజకీయ విభేదాలు నడుస్తున్నాయి. వైయస్ రాజశేఖర్ రెడ్డి కుమారుడు జగన్మోహన్ రెడ్డితో ఆయన సోదరి షర్మిల విభేదిస్తున్న సంగతి తెలిసిందే. మొన్నటి ఎన్నికల్లో అన్న ఓటమికి కంకణం కట్టుకొని విజయం సాధించారు షర్మిల. ఇప్పుడు తెలంగాణలోనూ అదే పరిస్థితి కొనసాగుతోంది. కెసిఆర్ కుమారుడు కేటీఆర్ ను సోదరి కవిత విభేదిస్తున్నారు. తన తండ్రి కెసిఆర్ ను తప్పు దోవ పట్టిస్తున్నారు అంటూ సంచలన ఆరోపణలు చేశారు. అయితే ఏపీలో ఇప్పుడు మరో అన్నా చెల్లెలు రాజకీయంగా విభేదించుకోవడం ప్రారంభించారు. వారే సీనియర్ నేత ముద్రగడ పద్మనాభం కుమారుడు గిరి, కుమార్తె క్రాంతి. ఇద్దరి మధ్య పొలిటికల్ వార్ నడుస్తోంది. తన తండ్రిని కలవకుండా సోదరుడు అడ్డుకుంటున్నారని సంచలన ఆరోపణలు చేశారు క్రాంతి. తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న తన తండ్రిని కలవనివ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తూ ఆమె రాసిన లేక వైరల్ గా మారింది.జనసేన అధినేత పవన్విషయంలో ముద్రగడ పద్మనాభం ఎన్నికలకు ముందు సంచలన ఆరోపణలు చేశారు. తన కుమారుడితో కలిసి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఎట్టి పరిస్థితుల్లో పిఠాపురంలో పవన్ కళ్యాణ్ ను ఓడిస్తానని శపథం చేశారు. అలా చేయని క్రమంలో తన పేరును ముద్రగడ పద్మనాభ రెడ్డి గా మార్చుకుంటానని సవాల్ చేశారు. పిఠాపురంలో పవన్ కళ్యాణ్ ను ఓడించేందుకు పెద్ద ఎత్తున ప్రచారం చేశారు. అయితే ఫలితం లేకుండా పోయింది. చివరకు పవన్ కళ్యాణ్ ఓడిపోయేసరికి తన పేరును ముద్రగడ పద్మనాభ రెడ్డి గా మార్చుకోవాల్సి వచ్చింది. అయితే తన తండ్రి వ్యాఖ్యలను తప్పుపట్టారు కుమార్తె క్రాంతి. గత ఎన్నికలకు ముందు ఆమె జనసేనలో చేరేందుకు సిద్ధపడ్డారు. పవన్ వద్దని వారించారు. ఎన్నికల ఫలితాల అనంతరం ఆమె జనసేనలో చేరారు. అప్పటినుంచి కుటుంబంలో విభేదాలు నడుస్తున్నాయి.ఈ క్రమంలో ముద్రగడ పద్మనాభంను కలిసేందుకు క్రాంతి ఇటీవల ప్రయత్నం చేశారు. కానీ ఆమెను కలవకుండా కుమారుడు గిరి అడ్డుకుంటున్నారన్నది ఒక ప్రచారం. ఈ నేపథ్యంలోనే ముద్రగడ కుమార్తె క్రాంతి ఒక లేఖ సోషల్ మీడియాలో రాశారు. తన తండ్రి ముద్రగడ పద్మనాభం క్యాన్సర్ తో బాధపడుతున్నారని.. ఆయనను చూసేందుకు సైతం తనకు అనుమతించడం లేదని.. తన సోదరుడు గిరి తో పాటు ఆయన భార్య తరపు బంధువులు ముద్రగడ పద్మనాభమును బంధించారని సంచలన ఆరోపణలు చేశారు. దీంతో ఇది ముద్రగడ కుటుంబంలో ఉన్న విభేదాలను బయటపెట్టింది. ముద్రగడ అంటే రాజకీయ నేత కాదు. కాపు రిజర్వేషన్ పోరాట సమితి నేతగానే గుర్తింపు పొందారు. అటువంటి నేత కుటుంబంలో ఇద్దరు పిల్లలు విడిపోయి, విభేదించుకోవడంపై అభిమానులు జీర్ణించుకోలేకపోతున్నారు. ఈ విషయంలో కాపు ప్రతినిధులు చొరవ చూపాలని విజ్ఞప్తి చేస్తున్నారు.ఇటీవల తుని రైలు దహనం కేసులో ముద్రగడ పద్మనాభం పై కోర్టులో అపీల్ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఉత్తర్వులను కూడా జారీ చేసింది. కానీ ఆ మరుసటి రోజునే ఆ ఉత్తర్వులను వెనక్కి తీసుకుంటూ జీవో జారీ చేసింది. కాపు ఉద్యమంలో భాగంగా తునిలో రైలు దహనమైన సంగతి తెలిసిందే. ఆ కేసులో ప్రధాన నిందితుడిగా ముద్రగడ పద్మనాభం ఉన్నారు. వైసిపి హయాంలో విజయవాడ రైల్వే కోర్టు ఆ కేసును కొట్టివేసింది. వైసిపి ప్రభుత్వం కూడా ఆహ్వానించింది. ఇప్పుడు ఆ కేసు కొట్టివేతను సవాల్ చేస్తూ అపీల్ కు వెళ్లాలని ఏపీ ప్రభుత్వం నిర్ణయించింది. కానీ ఆ మరుసటి రోజు ఆ నిర్ణయాన్ని ఒప్పుసంహరించుకుంది. అయితే తాజాగా ముద్రగడకు తీవ్ర అనారోగ్యం అంటూ కుమార్తె బయట పెట్టడంతో.. ప్రభుత్వం సైతం అందుకే వెనక్కి తగ్గి ఉంటుందన్న అనుమానాలు ఉన్నాయి.

# నాలుగేళ్ల ముందే అలెర్ట్...
## బ్యాడ్ నేమ్ తెచ్చుకుంటున్న ఎమ్మెల్యేలపై గురి

విజయవాడ, జూన్ 9,ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎన్నికలకు నాలుగేళ్లకు ముందే అలెర్ట్ అయినట్లు కనిపిస్తుంది. ఎమ్మెల్యేల పనితీరును గమనించకపోతే అసలుకే ఎసరు వస్తుందని ఆయన గట్టిగా నమ్ముతున్నారు. గత ఎన్నికల్లో కూటమి హవాలో 164 స్థానాల్లో సూపర్ డూపర్ విక్టరీ సాధించినప్పటికీ గత ఏడాదిగా కూటమి పార్టీల నేతల మధ్య సయోధ్య లేకపోవడంతో, కిందిస్థాయిలో ఆశావహులు ఎక్కువగా ఉండటంతో పాటు విభేదాలు మరింతగా ముదిరి వీధిన పడుతుండటంతో మూడు పార్టీలకు తలనొప్పిగా తయారయింది. అన్ని చోట్ల ఆధిపత్య పోరు కనిపిస్తుంది. ఇక ఎమ్మెల్యేల పనితీరు కూడా అంత ఆశాజనకంగా లేదని అందుతున్న నివేదికలను బట్టి తెలుస్తోంది ప్రధానంగా ఈసారి ఎన్నికల్లో అత్యధికంగా 88 మంది వరకూ మొదటిసారి ఎమ్మెల్యేలుగా గెలిచారు. మొదటి సారి గెలిచిన ఎమ్మెల్యేలతోనే సమస్య తలెత్తుతోంది. సీనియర్ ఎమ్మెల్యేలు ఉన్నచోట్ల ఈ సమస్య పెద్దగా కనిపించడం లేదు. వారిపై పెద్దగా ఆరోపణలు కూడా రావడం లేదు. ఎందుకంటే వారి అనుభవంతో అనేక విషయాలను బయటకు రాకుండానే సహజంగా జాగ్రత్త పడుతున్నారు. కానీ కొత్తగా ఎన్నికయిన ఎమ్మెల్యేలు మాత్రం నేరుగా రంగంలోకి దిగి బ్యాడ్ నేమ్ ను కొని తెచ్చుకుంటున్నారు. ఇసుక తరలింపు, మద్యం షాపుల వేలంపాటలు, బార్లను కొనసాగించడం, రియల్ ఎస్టేట్ వ్యవహారాల్లో తలదూర్చడం వంటి విషయాల్లో కొత్తగా ఎన్నికయిన ఎమ్మెల్యేల పేర్లు జనం నోళ్లతో నానుతున్నాయి.. ఒకవైపు సంక్షేమ పథకాలు అందలేదని జనంలో అసంతృప్తి ఉన్న నేపథ్యంలో మరొకవైపు అవినీతిని ఎమ్మెల్యేలే దగ్గరుండి ప్రోత్సహిస్తుండటం కూడా ప్రజల్లో పలచనకు కారణమయింది. ఇలాగే ఉపేక్షిస్తే వచ్చే ఎన్నికల్లో దారుణమైన ఫలితాలు చూడాల్సి వస్తుందని చంద్రబాబు తన అనుభవంతో ముందే గుర్తించారు. తాము పరిపాలనలో ఎన్ని సంస్కరణలు, ఎన్ని కీలక నిర్ణయాలు తీసుకున్నప్పటికీ స్థానికంగా ఉండే ఎమ్మెల్యేలు సక్రమంగా లేకపోతే అసలుకే మోసం వస్తుందని భావించిన చంద్రబాబు నాయుడు నాలుగేళ్ల ముందే అప్రమత్తమయ్యారు. అందుకే ఎమ్మెల్యేలను గాడిలో పెట్టేందుకు తన వంతుగా ఆయన ప్రయత్నాలను ప్రారంభిస్తున్నట్లు కనపడుతుంది. ఇందులో భాగంగానే చంద్రబాబు నాయుడు మొదటిసారి గెలిచిన ఎమ్మెల్యేలు మరింత బాధ్యతగా పనిచేయాలని గట్టిగా వార్నింగ్ ఇచ్చారు. ప్రజలకు , కార్యకర్తలకు నిత్యం అందుబాటులో ఉండాలి.. వన్ టైమ్ ఎమ్మెల్యేలుగా మిగిలిపోకూడదనేది తన ఆలోచన అని నేరుగా చెప్పేశారు. ప్రజలు అన్నీ గమనిస్తారని, జాగ్రత్తగా ఉండాలని, లేకుంటే ఇబ్బందులు పడతారని చంద్రబాబు గట్టిగానే హెచ్చరించినట్లు తెలిసింది. ప్రతి ఆరు నెలలకు ఒకసారి ఎంపీలు, ఎమ్మెల్యేల పనితీరుపై సర్వేలు, నివేదికలు తెప్పించుకునేందుకు చంద్రబాబు సిద్ధమయ్యారు. అంతేకాదు తాను మంచి చేస్తే అభినందిస్తానని, తప్పు చేస్తే దూరం పెడతానని కూడా చెప్పారు. త్వరలోనే ఒక్కో ఎమ్మెల్యేతో ముఖాముఖి భేటీలు నిర్వహించేందుకు కూడా చంద్రబాబు సిద్ధమవుతుండటం చూస్తుంటే కూటమికి డేంజర్ బెల్స్ మోగుతున్నాయని చంద్రబాబుకు కూడా అర్థమయినట్లే కనిపిస్తుంది.

తలనొప్పిగా మారిన సవిత

మొదటి సారి ఎమ్మెల్యే అయ్యారు. అదృష్టం బాగుండి చంద్రబాబు కేబినెట్ లో మంత్రి అయి కూర్చున్నారు. దీంతో మంత్రి సవితకు ఏమీ అర్థం కావడం లేదు. కనీసం అధికారులను గౌరవించడం కూడా తెలయకుండా మంత్రులు దురుసుగా ప్రవర్తిస్తున్నారు. ఫస్ట్ టైమ్ గా ఎన్నికై అదేదో తమ వల్లనే గెలిచామన్న భావనలో విర్రవీగుతుండటంతోనే ఈ సమస్య తలెత్తుతుంది. మంత్రులలో కొందరు అందులోనూ తొలిసారి మంత్రి అయిన వారు చంద్రబాబు నాయుడుతో పాటు పార్టీకి కూడా తలనొప్పులుగా మారుతున్నారు. గతంలో కడప జిల్లాకు చెందిన మంత్రి మడిపల్లి రాంప్రసాద్ రెడ్డి సతీమణి పోలీసు అధికారిపైనే జులుం ప్రదర్శించారు. దీంతో చంద్రబాబు నాయుడు సీరియస్ అయ్యారు. ఆ దెబ్బకు మడిపల్లి రాంప్రసాద్ రెడ్డితో పాటు ఆయన సతీమణి కూడా క్షమాపణ చెప్పాల్సిన పరిస్థితి వచ్చింది. మంత్రులు అప్పనంగా వచ్చిన పదవులను అనుభవించడంలో తమ దర్పాన్ని ప్రదర్శించడానికే ఇలా చేస్తున్నారా? లేక అతి విశ్వాసంతో ఈ పనులు చేస్తున్నారా? అన్నది తేలకుండా ఉంది. అయితే వీరి వ్యవహార శైలి మాత్రం మొత్తం కూటమి ప్రభుత్వానికి ఇబ్బందిగా మారింది. ఎవరిని కట్టడి చేయలేని పరిస్థితి. తమకు అప్పగించిన శాఖల్లో పట్టు పెంచుకుని, ప్రజలకు సేవలందించాల్సిన అమాత్యులు అనవసర వివాదాల్లో కూరుకుని కూటమిని ఇబ్బందులు పాలు చేస్తున్నారు. ఎన్ని సార్లు చెప్పినా వీరి పరిస్థితుల్లో మార్పు కనిపించడం లేదు. తాజాగా బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత కూడా చంద్రబాబు సర్కార్ కు తలనొప్పులు తెచ్చేలా వ్యవహరించడం ఇప్పుడు చర్చనీయాంశమైంది. పెనుకొండ టిక్కెట్ తెచ్చుకోవడమే అదృష్టం. ఆపైన ఎమ్మెల్యే కావడం మరొక లక్కు. అదీ చాలక ఏకంగా మంత్రి పదవి వరించింది. అణిగి మణిగి ఉండాల్సిన మంత్రి సవిత మాత్రం రెచ్చిపోతున్నారు. అదీ అధికారులపైన మంత్రి సవిత దురుసు ప్రవర్తన సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి. పెనుకొండ తహశీల్దార్ శ్రీధర్ ఇచ్చిన బోకేను మంత్రి సవిత విసిరేసిన వీడియో వైరల్ గా మారింది. సత్యసాయి జిల్లా కలెక్టర్ చేతన్ సమక్షంలో ఘటన జరిగింది. ఈ నెల ఒకటో తేదీన రేషన్ బియ్యం పంపిణీ సందర్భంగా ఈ ఘటన జరగడంతో మంత్రి సవిత తీరుపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

### యువకుడు అనుమానాస్పద మృతి

తిరుపతి రూరల్, శ్రీనివాసపురంలో యువకుడు అనుమానస్పద స్థితి లో మృతి చెందాడు మృతుడు ఉప్పల మాలపల్లి లో నివాసముంటున్న సాయి (26)గా పోలీసులు గుర్తించారు. స్నేహితులతో కలిసి మద్యం సేవించి అర్ధరాత్రి ఫోన్లో గట్టిగా మాట్లాడిన వైనం. ఫ్రెండ్స్ ప్రశ్నించగా పర్సనల్ విషయం అంటూ మాట దాటవేసాడు. సోమవారం ఉదయం ఇంటి పక్క సందులో గాయాలతో పడి ఉన్న వ్యక్తిని గమనించిన స్థానికులు మృతుడి ఫ్రెండ్స్ కు సమాచారం అందించారు. మృతుడు పుత్తూరు కు చెందిన భార్గవి తో వివాహం చేసుకొని ఎలక్ట్రిషన్ గా పనిచేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. మద్యం మత్తులో ప్రమాదం జరిగిందా...? ఆత్మహత్య చేసుకున్నాడా..? మృతుడి మరణం వెనుక మరేమైనా కారణాలు ఉన్నాయా ...? అన్న కోణంలో పోలీసులు విచారణ చేస్తున్నారు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసారు.

# నెల్లూరులో వైసీపీకి దిక్కెవరు.. ?

నెల్లూరు, జూన్ 9, జిల్లా నాయకత్వ బాధ్యతలు అప్పగిస్తే సమర్థవంతంగా నిర్వహించగలరు కూడా. అయితే హై కమాండ్ ఆదాల ప్రభాకర్ రెడ్డిని దూరం పెట్టినట్లు తెలుస్తోంది. అందుకే ఆయన సైతం పెద్దగా పట్టించుకోవట్లేదు అని సమాచారం. దీంతో నెల్లూరు జిల్లాలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ చుక్కాని లేని నావలా మారింది.నెల్లూరు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో ఏం జరుగుతోంది? అసలు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి దిక్కు ఎవరు? కనీసం పార్టీ శ్రేణులను నడిపించే నేత ఎవరు? అంటే సమాధానం దొరకని పరిస్థితి. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కీలక నేతలుగా ఇక్కడ చాలామంది ఉండేవారు. మొన్నటి ఎన్నికల్లో ఎంపీగా పోటీ చేశారు విజయసాయిరెడ్డి. ఆయన పార్టీకి గుడ్ బై చెప్పేశారు. మాజీమంత్రి గోవర్ధన్ రెడ్డి జైలు పాలయ్యారు. మరో మాజీ మంత్రి అనిల్ కుమార్ యాదవ్ పెద్దగా యాక్టివ్ గా లేరు. ఇంకోవైపు మాజీమంత్రి, మాజీ ఎంపీ ఆదాల ప్రభాకర్ రెడ్డి ఉన్నారు. ఆయన సైతం హైదరాబాద్ కి పరిమితం అవుతున్నారు. ఆయనకు సుదీర్ఘ రాజకీయ నేపథ్యం ఉంది. జిల్లా నాయకత్వ బాధ్యతలు అప్పగిస్తే సమర్థవంతంగా నిర్వహించగలరు కూడా. అయితే హై కమాండ్ ఆదాల ప్రభాకర్ రెడ్డిని దూరం పెట్టినట్లు తెలుస్తోంది. అందుకే ఆయన సైతం పెద్దగా పట్టించుకోవట్లేదు అని సమాచారం. దీంతో నెల్లూరు జిల్లాలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ చుక్కాని లేని నావలా మారింది.వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావం నుంచి నెల్లూరు జిల్లాలో వెన్ను దన్నుగా నిలుస్తూ వచ్చింది. 2014 ఎన్నికల్లో గణనీయమైన సీట్లు సాధించింది. టిడిపిని ఒకటి రెండు స్థానాలకే పరిమితం చేసింది. 2019 ఎన్నికల్లో పూర్తిగా స్వీప్ చేసింది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ. ఫ్యాన్ గాలికి సైకిల్ కొట్టుకుపోయింది. అయితే 2024 ఎన్నికలకు వచ్చేసరికి పూర్తిగా సీన్ మారిపోయింది. సైకిల్ దూకుడు ముందు ఫ్యాన్ నిలువలేకపోయింది. అప్పటినుంచి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి కష్టాలు ప్రారంభమయ్యాయి. ఎన్నికలకు ముందు పెద్ద నేతలు అంత టిడిపికి క్యు కట్టారు. ఎన్నికల ఫలితాల తర్వాత చాలామంది నేతలు పార్టీకి గుడ్ బై చెప్పారు. మిగతా నేతలు సైతం సైలెంట్ అయ్యారు.ప్రస్తుతం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి అండగా ఉండేందుకు ఆదాల ప్రభాకర్ రెడ్డిసిద్ధంగా ఉన్నారు. కానీ ఆయన విషయంలో ఎందుకో పార్టీ హై కమాండ్ మొగ్గు చూపడం లేదని తెలుస్తోంది. అధినేత జగన్మోహన్ రెడ్డి సైతం ఆయనకు అపాయింట్మెంట్ ఇవ్వడం లేదని పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతోంది. 2019 ఎన్నికల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి ఎంపీగా పోటీ చేసి గెలిచారు ప్రభాకర్ రెడ్డి. అంతకుముందు ఆయన కాంగ్రెస్ లో పలుమార్లు ఎమ్మెల్యేగా గెలిచి మంత్రిగా కూడా పనిచేశారు. నెల్లూరు ఎంపీగా ఉన్న ఆయనకు పలు అసెంబ్లీ నియోజకవర్గాల్లో బలమైన అనుచరులు ఉన్నారు. కానీ ఎందుకో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ హై కమాండ్ ఆయన సేవలను సద్వినియోగం చేసుకోలేకపోతోంది. మొన్నటి ఎన్నికల్లో నెల్లూరు రూరల్ నియోజకవర్గం నుంచి పోటీ చేశారు ఆదాల. కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి చేతిలో ఓడిపోయారు. ప్రస్తుతం నియోజకవర్గానికి దూరంగా ఉంటున్నట్లు అనుచరులు చెబుతున్నారు.

అయితే ఆయన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని వీడే ఆలోచనలో ఉన్నట్లు కూడా జిల్లాలో ప్రచారం జరుగుతోంది.మరోవైపు ఆదాల ప్రభాకర్ రెడ్డి పార్టీ మార్పుపై అనుచరుల నుంచి మిశ్రమ స్పందన వస్తోంది. ఆయనకు పార్టీ మారే ఉద్దేశం లేదని అనుచరులు చెబుతున్నారు. అయితే పార్టీ పట్టించుకోకపోవడంతోనే ఆయన మనస్థాపంతో ఉన్నారని మరికొందరు చెబుతున్నారు. పిలవని పేరంటానికి ఎందుకని.. కనీసం జగన్మోహన్ రెడ్డి అపాయింట్మెంట్ లభించడం లేదని వైసిపి వర్గాలు చెబుతున్నాయి. నెల్లూరు జిల్లాలో పార్టీ కష్టకాలంలో ఉండగా ఓ సీనియర్ నేత విషయంలో హై కమాండ్ అలా చేయడం ఏంటన్న ప్రశ్న వినిపిస్తోంది. మరి ఆదాల ప్రభాకర్ రెడ్డి ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో చూడాలి.

# కల్తీ నెయ్యి కాదు... నకిలీ నెయ్యి...

తిరుమల, జూన్ 9,కల్తీ నెయ్యి ఎపిసోడ్‌లో సస్పెన్స్ వీడుతోంది. స్పెషల్ సిట్ దర్యాప్తు క్లైమాక్స్‌కు చేరుకుంటుంది. దర్యాప్తులో షాకింగ్ విషయాలు వెలుగులోకి వస్తున్నాయ్. తిరుమల లడ్డూ తయారీకి డెయిరీలు సప్లై చేసింది నెయ్యే కాదని కన్ఫామ్ అయిందట. శ్రీవారి లడ్డూ వివాదంలో కళ్లు భైర్లు కమ్మే విషయాలు కోర్టుకు చెప్పింది సిట్. దీంతో ఇప్పటివరకు ఆరోపణలు, విమర్శలు, అనుమానాలతో కొనసాగిన వ్యవహారంలో అసలు కథ బయటికి వస్తోంది.స్పెషల్ సిట్ హైకోర్టుకు సబ్‌మిట్ చేసిన రిపోర్టులో షాకింగ్ విషయాలను తెలిపింది. తిరుమల లడ్డూ తయారీ కోసం డెయిరీలు సప్లై చేసింది నెయ్యి కాదట. ఆ మాటకొస్తే అసలు అది కల్తీ నెయ్యే కాదంటోంది సిట్. పక్కా ప్రణాళిక ప్రకారం నకిలీ నెయ్యిని సరఫరా చేశారని గుర్తించారట. వివిధ రసాయనాలతో నెయ్యి లాంటి పదార్థాన్ని తయారు చేసి టీటీడీకి సప్లై చేశారట. పామాయిల్, కొన్ని రసాయనాలు, ముడి పదార్థాలు వాడి నెయ్యి తయారు చేసిందట భోలేబాబా డెయిరీ. ఈ విషయాన్ని హైకోర్టుకు ఇచ్చిన నివేదికలో స్పష్టం చేసింది స్పెషల్ సిట్.నెయ్యి సప్లై చేసేందుకు ఏఆర్ డెయిరీ, వైష్ణవి డెయిరీతో టీటీడీ ఒప్పందం చేసుకుంది. కానీ ఆ రెండు డెయిరీల వెనుక ఉండి కథ నడిపించింది మాత్రం భోలేబాబా డెయిరీ అని సిట్ హైకోర్టుకు చెప్పింది. భోలేబాబా డెయిరీకి పాలు, నెయ్యి ఉత్పత్తి చేసే వ్యవస్థ లేదని సిట్ తేల్చిందట. మరోవైపు తమ నుంచి అసలు పాలే సేకరించలేదని రైతులే తమకు చెప్పారని సిట్ చెబుతోంది. టీటీడీకి కావాల్సిన స్థాయిలో నెయ్యి సరఫరా చేయాలంటే లక్షల లీటర్ల పాలు అవసరం అవుతుంది.రైతుల నుంచి పాలే సేకరించకుండా భోలేబాబా డైయిరీ నెయ్యి ఎలా తయారు చేసిందన్నది సిట్ లేవనెత్తుతున్న ప్రశ్న. భోలేబాబా డెయిరీ పామాయిల్, రసాయనాలు, ముడిపదార్థాలతో నకిలీ నెయ్యి తయారుచేసి ఏఆర్ డెయిరీ, వైష్ణవి డెయిరీకి పంపిందని, ఈ రెండు సంస్థలు ఈ నకిలీ నెయ్యిని టీటీడీకి సరఫరా చేసినట్లు తమ విచారణలో తేలిందంటోంది సిట్. ముందస్తు కుట్ర ప్రకారమే ఏఆర్ డెయిరీ, వైష్ణవీ డెయిరీలను ముందు పెట్టి భోలేబాబా డెయిరీ వ్యవహారాన్ని నడిపిందని సిట్ చెబుతోంది.టీటీడీ అంటే ఓ పెద్ద వ్యవస్థ. దేశంలో ఏ ఆలయానికి లేనంత పటిష్టమైన అడ్మినిస్ట్రేషన్ సిస్టమ్ టీటీడీ సొంతం. అలాంటి తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు.. నెయ్యి సరఫరా విషయంలో డెయిరీలను ఎలా గుడ్డిగా నమ్మిందనేదే అంతుచిక్కడం లేదు. డెయిరీల ఉత్పత్తి సామర్థ్యం ఎంత.? వాళ్లు ఎక్కడెక్కడి నుంచి పాలు సేకరిస్తున్నారన్న వివరాలు..ఆ సంస్థల నిబద్ధతను, వారిచ్చే నెయ్యి క్వాలిటీని చెక్ చేయకుండానే ఎలా కాంట్రాక్ట్ ఇచ్చారన్న డౌట్స్ వ్యక్తం అవుతున్నాయి.ఏఆర్ డెయిరీ, వైష్ణవి డైయిరీలతో నెయ్యి సరఫరా ఒప్పందం ఎలా కుదిరింది.? వాళ్లు భోలేబాబా డెయిరీతో ఎందుకు టైయప్ అయ్యారనేదానిపై సిట్ ఆరా తీసిందట. అయితే నకిలీ నెయ్యి సప్లై వెనుక అప్పుడు టీటీడీలో కీలకంగా పనిచేసిన అధికారులు, ముఖ్యుల పాత్ర ఉందా అని కూడా సిట్ దర్యాప్తు చేస్తోందట. ఆ దిశగానే ఇప్పటికే వైవీ సుబ్బారెడ్డి పీఏ అప్పన్నకు నోటీసులు ఇచ్చి విచారించింది సిట్.సిట్ హైకోర్టుకు సబ్‌మిట్ చేసిన రిపోర్టుతో..అసలు ఎపిసోడ్ ఇప్పుడే స్టార్ట్ అయిందన్న డిస్కషన్ జరుగుతోంది. కల్తీ నెయ్యి వ్యవహారంలో అసలు మ్యాటరేంటో క్లియర్ కట్‌గా కోర్టుకు చెప్పేసింది సిట్. డెయిరీ యజమానులు, నెయ్యి సప్లైదారులు..అసలు సూత్రధారుల పాత్రపై రాబోయే రోజుల్లో మరిన్ని విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది. నిందితులకు బెయిల్ ఇవ్వొద్దని వాదనలు వినిపించే క్రమంలో ఈ కీలక విషయాలను కోర్టుకు వివరించారు సిట్ తరఫు న్యాయవాది.త్వరలోనే టీటీడీ మాజీ ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, మాజీ టీటీడీ ఈవో ధర్మారెడ్డిని సిట్ నోటీసులు ఇచ్చి విచారించే అవకాశం ఉందని టాక్ వినిపిస్తోంది. డెయిరీలకు నెయ్యి సరఫరా కాంట్రాక్టు ఎలా దక్కింది.? ఏఆర్, వైష్ణవి డెయిరీలకు ఎవరైనా పట్టుబట్టి కాంట్రాక్ట్ ఇప్పించారా అన్న అంశంపై కూపీ లాగుతున్నారట. ఇప్పటికే ఎన్నో అరెస్టులు, మరెన్నో రాజకీయ విమర్శలతో హాట్ టాపిక్‌గా మారిన కల్తీ నెయ్యి వ్యవహారం..రాబోయే రోజుల్లో ఇంకా ఎటువైపు టర్న్ తీసుకుంటుందో చూడాలి మరి.

# డ్రోన్ సహాయంతో పోలీసుల ఓపెన్ డ్రింకింగు రైడ్స్

విజయనగరం పట్టణం వన్ టౌన్, టూ టౌన్ పోలీసు స్టేషను పరిధిలోని శివారు ప్రాంతాల్లో జూన్ 7న ఓపెన్ డ్రింకింగు చేస్తున్న వారిపై పోలీసులు డ్రోన్స్ సహాయంతో రైడ్స్ నిర్వహించి, ఓపెన్ డ్రింకింగుకు పాల్పడుతున్న వారిని అదుపులోకి తీసుకొని, వారిపై 'ఓపెన్ డ్రింకింగు' కేసులు నమోదు చేసారని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు. జిల్లా ఎస్పీ వకుల్ జిందల్, ఐపిఎస్ మాట్లాడుతూ - విజయనగరం 1వ, 2వ పట్టణ పోలీసులకు వచ్చిన ఖచ్చితమైన సమాచారంతో 2వ పట్టణ పోలీసు స్టేషను పరిధిలోని పూల్బాగ్ కాలనీ నందిగుడ్డి ప్రాంతంలోను, 1వ పట్టణ పోలీసు స్టేషను పరిధిలోని కనపాక, అయ్యన్నపేట ఏరియాల్లో బహిరంగ ప్రదేశాల్లో ఓపెన్ డ్రింకింగుకు పాల్పడుతున్న వారిపై డ్రోన్ను పంపి, ఆయా ప్రాంతాల్లో కొంతమంది వ్యక్తులు ఓపెన్ డ్రింకింగుకు పాల్పడుతున్నట్లుగా గుర్తించి, రైడ్స్ నిర్వహించినట్లుగా జిల్లా ఎస్పీ తెలిపారు. వన్ టౌన్ పోలీసు స్టేషను వరిధిలో ఓపెన్ డ్రింకింగుకు పాల్పడుతున్న వారిపై ఆరు కేసులు, టూ టౌన్ పోలీసు స్టేషను పరిధిలో ఓపెన్ డ్రింకింగుకు పాల్పడుతున్న వారిపై 11 కేసులను నమోదు చేసామన్నారు. పేకాట, ఓపెన్ డ్రింకింగు, ట్రాఫిక్ రెగ్యులేషను, జాతర్లు, దర్నాల నిర్వహణలో అనుమానస్పద వ్యక్తుల ఆచూకీని కనిపెట్టేందుకు డ్రోన్ వినియోగిస్తున్నామని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు. నేర నియంత్రణలోను, శివారు ప్రాంతాల్లో అసాంఘిక కార్యకలాపాల నియంత్రణకు డ్రోన్స్ ను వినియోగించాలని, శివారు ప్రాంతాలపై నిఘా పెట్టాలని అధికారులను జిల్లా ఎస్పీ ఆదేశించారు.

# ఎయిర్ పోర్టు లో మీడియాపై ప్రభాకర్ రావు అనుచరుల దాడి



శంషాబాద్ మాజీ ఐపిఎస్ ప్రభాకర్ రావు బౌన్సర్లు శంషాబాద్ ఎయిర్పోర్టులో మీడియాపై దాడికి పాల్పడ్డారు. ప్రభాకర్ రావు ఎయిర్పోర్ట్ నుండి బయటికి వచ్చే సమయంలో 50 మంది తన అనుచరులు వచ్చారు. 15 మంది బౌన్సర్లను పెట్టుకొని మీడియా వారిపై దాడికి పాల్పడ్డారు. ఇమిగ్రేషన్ కార్యాలయంలోనే మూడు గంటలపాటు ప్రభాకర్ రావు వివరాలు అధికారులు తీసుకున్నారు. ఎయిర్ పోర్ట్ నుండి బయటికి వచ్చే సమయంలో ప్రభాకర్ రావును మాట్లాడించే ప్రయత్నం మీడియా చేసింది. అదే సమయంలో ప్రభాకర్ రావు వెంట ఉన్న బౌన్సర్లు మీడియా ప్రతినిధులను నెట్టివేసి దాడికి పాల్పడ్డారు..

# రైతులకు 4 శాతం వడ్డీకే రూ. 3 లక్షల రుణం!

న్యూఢిల్లీ జూన్ 9, (న్యూస్ పల్స్) దేశంలోని రైతులకు మోడీ ప్రభుత్వం ఎన్నో పథకాలను ప్రవేశపెడుతోంది. రైతులు ఆర్థికంగా ఎదిగేందుకు రకరకాల స్కీమ్‌లను అందుబాటులోకి తీసుకువస్తోంది. మోడీ సర్కార్ ముందుగా రైతులకు ప్రాముఖ్యతను ఇస్తుంది. ఈ నేపథ్యంలో దేశంలో లక్షలాది మంది రైతులు కిసాన్ క్రెడిట్ కార్డు పథకాన్ని ఉపయోగించుకుంటున్నారని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలాసీతారామ్ అన్నారు. ఈ పథకం ద్వారా రైతులు సకాలంలో తక్కువ వడ్డీ రేటుకే రుణ సౌకర్యాన్ని పొందుతున్నారని అన్నారు. దీనికి సంబంధించి వివరాలను ఎక్స్ వేదిక పోస్టు చేశారు. రైతులకు అందించే ఈ రుణాలు విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల వంటి వ్యవసాయ అవసరాలను తీర్చుకునేందుకు ఉపయోగపడుతున్నాయని అన్నారు.కిసాన్ క్రెడిట్ కార్డ్ పథకం రైతులకు బలమైన ఆర్థిక సహాయంగా మారిందని, ఇప్పటివరకు 465 లక్షల దరఖాస్తులు ఆమోదించినట్లు చెప్పారు. వీటి పరిమితి రూ.5.7 లక్షల కోట్లకు చేరుకుందని ఆమె అన్నారు. క్రెడిట్ కార్డుల ద్వారా స్వల్పకాలిక పంట రుణాలు ఇప్పుడు సులభతరం అయ్యాయి. కెసిసి ద్వారా, వ్యవసాయ కార్యకలాపాలకు వారి ఆర్థిక అవసరాలను తీర్చడానికి కేంద్ర ప్రభుత్వం రైతులకు రుణ రూపంలో రూ.5 లక్షల వరకు సహాయం చేస్తుంది.కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ కార్యాలయం నుండి విడుదల చేసిన పోస్ట్‌లో కిసాన్ క్రెడిట్ కార్డ్ (కెసిసి) ఇప్పుడు దేశంలోని లక్షలాది మంది రైతులకు ఆర్థిక జీవనాధారంగా మారిందని ఆర్థిక మంత్రి అన్నారు. విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు వంటి ముఖ్యమైన వస్తువులను కొనుగోలు చేయడంలో, పంట ఉత్పత్తికి సంబంధించిన నగదు అవసరాలను తీర్చడంలో కెసిసి పథకం రైతులకు గొప్ప సౌలభ్యాన్ని అందించిందని ఆమె అన్నారు. కిసాన్ క్రెడిట్ కార్డు ద్వారా స్వల్పకాలిక పంట రుణాలు ఇప్పుడు సులభతరం అయ్యాయని ఆమె అన్నారు.రైతు సకాలంలో చెల్లిస్తే, రూ.3 లక్షల వరకు రుణంపై 4 శాతం వడ్డీ మాత్రమే చెల్లించాలి. దీనితో పాటు, రుణాన్ని సకాలంలో తిరిగి చెల్లించినందుకు 3 శాతం అదనపు సత్వర చెల్లింపు ప్రోత్సాహకం కూడా అందిస్తుంది. దీని కారణంగా రైతులు ప్రతి లక్ష రూపాయలపై ప్రతి సంవత్సరం దాదాపు రూ.9,000 వడ్డీని ఆదా చేయవచ్చు.ఇదిలా ఉండగా, ప్రభుత్వం ఇప్పుడు ఈ సబ్సిడీ రుణ పరిమితిని రూ.3 లక్షల నుండి రూ.5 లక్షలకు పెంచింది. దీని వలన రైతులకు మాత్రమే కాకుండా మత్స్యకారులు, పాడి రైతులకు కూడా ప్రయోజనం చేకూరింది. ఇప్పటివరకు 7.7 కోట్లకు పైగా రైతులు ఈ పథకం ద్వారా ప్రయోజనం పొందినట్లు కేంద్రం తెలిపింది.2013లో వ్యవసాయ బడ్జెట్ కేవలం రూ.21,500 కోట్లు మాత్రమేనని, 2024 నాటికి దానిని రూ.1.22 లక్షల కోట్లకు పెంచామని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ వ్యవసాయ రంగంపై ప్రత్యేక దృష్టి పెడుతున్నారు.

# కోలుకుంటున్న పహల్గాం

ఎంతో కష్టపడి ఒక అడుగు ముందుకు వేస్తే కలిసి రాని కాలం పదడుగులు వెనక్కి తోసినట్టుంది కశ్మీర్ అభివృద్ధి పరిస్థితి. ఉగ్రవాదుల పు ణ్యమా అని అక్కడి సామాన్య ప్రజల అవస్థలు 'కక్కలేక, మింగలేక' అన్నట్టుగానే ఉ న్నాయి. అత్యంత దుర్మార్గమైన పహల్గామ్ దాడి తర్వాత కశ్మీర్‌లో కొత్త సంక్షోభం తలెత్తుతోంది. అదే పర్యాటక వినాశనం. ఏప్రిల్ 22, 2025న పహల్గాంలోని బైసరన్ లోయలో అమాయక పర్యాటకులపై దుర్మార్గపూరితమైన దాడి జరిగిందిఫలితంగా 26 మంది అత్యంత విషాదకరంగా ప్రాణాలు కోల్పోయారు. ఆ వెంటనే, ఆ ప్రాంతంలో గణనీయమైన అశాంతి నెలకొంది. ఉగ్రవాదులుగా అనుమానిస్తున్న వారి ఇళ్లను అధికారులు కూల్చివేశారు. చాలామందిని అదుపులోకి తీసుకున్నారు. కశ్మీర్‌లోని 87 పర్యాటక ప్రదేశాలలో 48 ప్ర దేశాల సందర్శనలను కూడా నిషేధించారు. పర్యాటక రంగంపై ఎక్కువగా ఆధారపడిన ఈ ప్రాంతంలో స్థానిక ఆర్థిక వ్యవస్థను ఇది తీవ్రంగా ప్రభావితం చేసిం ది. దాడి తర్వాత కొన్ని వారాల నుంచి హోటళ్ళు, విమానాల రద్దు గణనీయంగా పెరిగాయి. చాలామంది పర్యాటకులు ఈ ప్రాంతాన్ని విడిచిపెట్టారు. వేరే మార్గం లేకపోవడంతో చాలా హోటళ్ళు తమ సిబ్బం దిని తొలగించాల్సి వచ్చింది. వీరిలో చాలామంది కశ్మీర్‌లోని చిన్న పట్టణాల నుంచి వలస వచ్చినవారు. కాగా, తాజాగా ప్రధాని నరేంద్ర మోదీ కశ్మీర్‌లోని చినాబ్ వంతెనను ప్రారంభిస్తూ, అభివృద్ధిని ఉగ్రవాదులు ఎంతగా దెబ్బతీయాలని చూసినా ఆపేది లేదని స్ప ష్టం చేశారు. కశ్మీర్ ప్రజలకు జీవనాధారమైన పర్యాటకాన్ని పాకిస్థాన్ లక్ష్యంగా చేసుకుందని ప్రధాని మోదీ అన్నారు. పాకిస్థాన్ కుట్రకు వ్యతిరేకంగా జమ్మూ కశ్మీర్ ప్రజలు నిలబడిన విధానాన్ని ఆయన ఈ సందర్భంగా అభినందించారు.ఈసారి కశ్మీర్ ప్రజలు చూపిన బలం పాకిస్తాన్‌కు మాత్రమే కాక యావత్ ప్రపంచవ్యాప్తంగా ఉగ్రవాదానికి స్పష్టమైన సందేశాన్ని పంపినట్టయ్యిందని" ప్రధాని మోదీ పేర్కొన్నా రు. జమ్మూ కశ్మీర్ యువత ఇప్పుడు ఉగ్రవాదానికి తగిన సమాధానం ఇవ్వాలని నిర్ణయించుకున్నారు.ఉత్తర భారతదేశంలోని జమ్మూ కశ్మీర్‌కు చెందిన అనంత్‌నాగ్ జిల్లాలోని పట్టణమే పహల్గాం. అనంతనాగ్ నగరానికి 45 కి.మీ. దూరంలో, లిద్దర్ లోయ లో, లిద్దర్ నది ఒడ్డున, హిమాలయాలలో సముద్రానికి సుమారు 7,200 అడుగుల ఎత్తులో ఉంది. పహల్గాం ప్రసిద్ధ పర్యాటక కేంద్రమేకాక హిల్ స్టేషన్ కూడా. ఇది హిందువులు అత్యంత పవిత్రంగా భావిం చి, ప్రతీ ఏడూ జరిపే సాహసోపేత యాత్ర అమర్‌నాథ్‌కు ప్రారంభ స్థానం.సంవత్సరం ప్రపంచం నలుమూలల నుం చి వేలాదిమంది పర్యాటకులు పహల్గాంకు వస్తుంటారు. 2025లో పహల్గాం ఉగ్రదాడి జరిగిన నాటినుంచి ఇక్కడ పర్యాటకం పెద్ద ఎత్తున మూలకు పడింది. 'పహ ల్గామ్' అనే పేరు కశ్మీరీ పదాల నుంచి వచ్చింది. 'పుహేల్' అంటే 'గొర్రెల కాపరి', 'గోమ్' అంటే 'గ్రామం' అని అర్థం. ఇది కాలక్రమేణా పుహెల్గోమ్‌గా, పహల్గామ్‌గా మారింది. ఈ పట్టణ ప్రదేశం చుట్టుపక్కల అనేక పచ్చిక బయళ్లు ఆకర్షణీయంగా యాత్రికులకు కనువిందు చేస్తుంటాయి.ఇక్కడ బఖర్వాల్ ప్రజలు వేసవికాలం నుం చి చలికాలం ప్రారంభం వరకు వారి పశువులను మేపుకుంటూ తాత్కాలిక నివాసం ఏర్పరచుకుంటారు. హిందూ సంప్రదాయాల ప్రకారం పహల్గామ్‌ను మొదట బై ల్‌గావ్ (ఎద్దుల గ్రామం) అని పిలిచేవారు. అమర్నాథ్ గుహలోకి ప్రవేశించే ముందు శివుడు, నందిని ఇక్కడే విడిచి పెట్టాడని ఒక పురాణ కథనం ప్రచారంలో ఉంది.స్థానికంగా పత్రికల వారికి అందిన సమాచారం ఇలా ఉంది. శ్రీనగర్‌లోని ఒక హోటల్ యజమాని షోకెట్ అహ్మద్ మాట్లాడుతూ, దాడి జరిగినప్పటి నుంచి బుకింగ్‌లు జరగలేదని, మొత్తం 26 గదులు ఖాళీగా ఉన్నాయని నివేదించారు. అతను ముందస్తు చెల్లింపులను తిరిగి చెల్లించారు. ఆర్థిక పరిమితుల కారణంగా తన 15 మంది సిబ్బందిలో ముగ్గురిని మాత్రమే కొనసాగిస్తున్నారు.షోకెట్‌కు సుమారు రూ. 10 లక్షల మేర నష్టా లు సంభవించగా, ఇంకా కొనసాగుతున్న ఖర్చులు ఉన్నాయి. కానీ, ఆదాయం మా త్రం లేదు. బారాముల జిల్లాలోని పల్హల్లన్ గ్రామానికి చెందిన వలస కార్మికుడు, శ్రీనగర్‌కు చెందిన జకురాలోని ఒక హోట ల్లో మాజీ హౌస్‌కీపర్ అయిన ఇర్ఫాన్ లోన్ దాడి తర్వాత కొద్దిసేపటికే తన ఉద్యోగాన్ని కోల్పోయాడు. "నేను నిస్సహాయుణ్నయ్యాను" అని బాధతో అన్నాడుశ్రీనగర్‌లోని ఖన్యార్లోని ఒక హోటల్లో వె యిటర్‌గా పనిచేస్తున్న ఇంతియాజ్ ఆహ్, ఆ ప్రాంతంలో పర్యాటకులు తగ్గుముఖం పట్టడంతో తన ఉద్యోగాన్ని ఎలా వదిలివేయమని అడిగారో చెప్పుకొచ్చాడు. తన కుటుంబంలో ఏకైక జీవనాధారమైన ఇంతియాజ్ ఈ సవాలుతో కూడిన సమయంలో వారికి ఆహారం అందించడానికి పడరాని కష్టాలు పడుతున్నాడు.పర్యాటక పరంగా సమస్యలను ఎదుర్కొంటున్నది ఒక్క హోటల్ కార్మికులు మాత్రమే కాదు. సోనామార్గ్‌కు చెందిన మహ్మద్ ఆరిఫ్ పర్యాటకుల కోసం గుర్రపు స్వారీలు నిర్వహిస్తాడు. "నేను సాధారణంగా పర్యాటకులను గుర్రంపై పచ్చిక బయళ్ల గుండా తీసుకెళుతుంటా ను. దీనిద్వారా రోజుకు 2,000 రూపాయలు సంపాదిస్తాను. కానీ, ఇప్పుడు నాకు చేసుకోవడానికి ఆ పని లేదు. ఇంట్లోనే ఖాళీగా కూర్చోవాల్సి వస్తున్నది" అని అతను వాపోయాడు.శ్రీనగర్‌లోని మొఘల్ గార్డెన్స్‌కు దారితీసే బౌలేవార్డ్ రోడ్డులో వీధి వ్యాపారి అయిన షానవాజ్, దాల్ సరస్సు దగ్గర కస్టమర్ల కోసం ఎదురు చూస్తూ ఉంటాడు. "నేను ఇక్కడ గత 10 సంవత్సరాలుగా ఫలూడా ఐస్ క్రీం అమ్ముతున్నాను. ఇలాంటి పరిస్థితిని ఎప్పుడూ చూడలేదు. గతంలో రోజుకు సుమారు 3,000 రూపాయలు సంపాదించే వాడిని, ఇప్పుడు 500 రూపాయ లు మాత్రమే సంపాదిస్తున్నాను.పాఠశాల ఫీజులు, నా పిల్లలకు ట్యూషన్స్ ఫీజులు సహా ఇంటి ఖర్చులను నిర్వహించడం కష్టంగా ఉంది. నా కుటుంబంలో ఆరుగు రు సభ్యులు ఉన్నారు. ఈ 500 రూపాయలతో ఎలా బతికేది?" అంటున్నాడత ను."కశ్మీర్ సురక్షితంగా, అందంగా ఉన్నందున పర్యాటకులు వచ్చి సందర్శించాలని నేను అభ్యర్థించాలనుకుంటున్నాను. కానీ నా అభ్యర్థన ఎంతవరకు వెళ్తుందో నాకే ఆశ్చర్యంగా ఉంది" అని ఆయన అన్నాడు. భారతదేశంలో, విదేశాలలో కూడా అతిథుల నుంచి యాత్రల రద్దులు జరుగుతున్నట్టు చెబుతున్నారు. ఈ ప్రాంతంలోని షికారా, హౌస్‌బోట్ యజమానులు తాము ఎదుర్కొంటున్న అనిశ్చితిని వారు హైలైట్ చేశారు. "మేం పర్యాటక రంగంపై ఆధార పడతాం" అని అన్నారు. ఏదేమై నా, పహల్గాంలో జరిగిన దాడి కశ్మీర్లోని అనేక మంది వ్యక్తులు, కుటుంబాల జీవనోపాధిని తీవ్రంగా దెబ్బతీసింది.ఈ పరిణామాల నేపథ్యంలో ప్రత్యేకించి సుందరమైన పహల్గాం పట్టణంలో సాధారణ పరిస్థితులు ఎప్పుడు ఏర్పడతాయా అని స్థానికులు ఎదురు చూడటం తప్ప వారికి మరో గత్యంతరం కనిపించడం లేదు. త్వరలో ప్రారంభం కానున్న అమర్‌నాథ్ యాత్ర పహల్గాం నుండే ప్రారంభ మవుతుంది., ఉగ్రవాదుల భయాందోళనలకు అతీతంగా దేశంలోని ఆయా ప్రాంతాలకు చెందిన వేలసంఖ్యలో భక్తులు ఆ ప్రదేశాన్ని సందర్శించడానికి నమోదు చేసుకున్నట్టు తెలుస్తున్నది. ప్రభుత్వం దీనిని ప్రతిష్ఠాత్మకంగా తీసుకొని 'ఆపరేషన్ శివ' పేరుతో అమర్‌నాథ్ యాత్రికుల కోసం భద్రతా ఏర్పాట్లు చేస్తున్నట్టు వార్తలు వచ్చాయి.

# చైనాలో అందగాళ్లకు డిమాండ్

## కౌగలించుకుటంటే ఐదు నిమషాలకు రూ. 600

బీజింగ్, జూన్ 9, (న్యూస్ పల్స్) చైనాలో కొంత మంది యవతులు ఇ్పుడు ఆప్యాయంగా హగ్ చేసుకున్న వారికి డబ్బులు చెల్లించేందుకు సిద్ధపడుతున్నారు. ఒత్తిడి తగ్గించుకోవడానికి, భావోద్వేగాలను కంట్రోల్చేసుకోవడానికి మృదువైన స్వభావం ఉన్న పురుషులు నుండి ఐదు నిమిషాల కౌగిలింతల కోసం రూ. 600 చెల్లిస్తున్నారు. మృదువైన స్వభావం ఉన్న పురుషలను మాన్ మమ్స్ అని పిలుస్తున్నారు. చైనాలో యువతులు "మాన్ మమ్స్" అని పిలిచే పురుషుల నుండి ఐదు నిమిషాల కౌగిలింతల కోసం సుమారు 50 యువాన్ లు చెల్లించడానికి సిద్ధపడుతున్నరు. యాభై యువాన్లు మన దేశంలో ఆరు వందలతో సమానం. ఈ "మాన్ మమ్స్" అనే పదం గతంలో జిమ్‌లో కసరత్తు చేసే బలిష్టమైన పురుషులకు వాడేవారు. ఇప్పుడు సౌమ్యత , ఓపిక వంటి సాంప్రదాయ స్త్రీ లక్షణాలతో బలాన్ని మిళితం చేసే పురుషులను ఉద్దేశించి ఉపయోగిస్తున్నారు. ఈ కౌగిలింతలు చాట్ యాప్‌ల ద్వారా ఏర్పాటు చేసే సౌకర్యం అందుబాటులోకి వచ్చింది. సాధారణంగా మాల్స్ లేదా సబ్‌వే స్టేషన్‌ల వంటి బహిరంగ ప్రదేశాలలో ఈ కౌగిలింతలు ఉంటాయి. ఒత్తిడితో కూడిన సమయాల్లో భావోద్వేగ ఉపశమనం అందిస్తున్నాయని చైనా మహిళల చెబుతున్నారు. ఒత్తిడితో ఉన్న ఒక విద్యార్థిని తన థీసిస్ ఒత్తిడిని తట్టుకోవడానికి ఫిట్‌గా ఉన్న "మాన్ మమ్" నుండి కౌగిలింత కోసం చెల్లించాలని ఆన్‌లైన్‌లో పోస్ట్ చేసింది. "సెకండరీ స్కూల్‌లో ఒకసారి కౌగిలించుకున్నప్పుడు సురక్షితంగా భావించాను. మనం సబ్‌వే స్టేషన్‌లో ఐదు నిమిషాలు కౌగిలించుకోవచ్చు." అని పోస్ట్ చేసింది. పోస్ట్ వైరల్ అయింది. అప్పటి నుంచి ఈ ట్రెండ్ ప్రారంభమయింది. . మహిళలు మర్యాద, ఓపిక, శారీరక రూపం, ఆకర్షణ ఆధారంగా "మాన్ మమ్స్"ను ఎంచుకుంటారు, సాధారణంగా ప్రైవేట్ చాట్‌ల ద్వారా మాట్లాడిన తర్వాత భేటీ అవుతారు. ఈ ట్రెండ్ ప్రధానంగా చైనా ప్రధాన నగరాల్లో కనిపిస్తోంది. కొందరు ఎత్తు, అథ్లెటిక్ శరీరం కలిగిన మహిళలను కూడా ఈ సేవల కోసం పరిగణనలోకి తీసుకుంటారని సౌత్ చైనా మార్నింగ్ పోస్ట్ పత్రిక తెలిపింది. ఎలాంటి అసభ్యత లేకుండా.. కేవలం ఆప్యాయంగా,ప్రేమగా కౌగలించుకోవాలనుకునేవారికే.. ఈ సర్వీస్ సంతృప్తికరంగా ఉంటుందని చెబుతున్నారు.

# 90 ఏళ్ల వయస్సులో ఒక్కటైన జంట

జైపూర్, జూన్ 9, (న్యూస్ పల్స్) ఇదో వింత ప్రేమ కహానీ.. 70 ఏళ్లుగా సహజీవనం చేస్తున్న జంటకు ఎట్టకేలకు ఊరంతా కలిసి పెళ్లి చేశారు. ఘనంగా ఊరేగింపు, బరాత్ జరిపి 90 ఏళ్ల వధువుకు 95 ఏళ్ల వరుడికి పెళ్లి తంతు నిర్వహించారు. ఈ విచిత్ర ఘటన రాజస్థాన్‌లోని దుంగార్పూర్ జిల్లా గలందర్ గ్రామంలో చోటు చేసుకుంది. వీరి వివాహ వేడుకల వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. వివరాల్లోకెళ్తే..రాజస్థాన్‌లోని దుంగార్‌పూర్ జిల్లా గలందర్ అనే గిరిజన గ్రామంలో గత 70 ఏళ్లుగా సహజీవనం చేస్తున్న వృద్ధ దంపతులకు ఎట్టకేలకు ఇప్పుడు పెళ్లి జరిగింది. వీరికి నలుగురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు, మనవలు ఉన్నారు. వీరందరి సమక్షంలో జీవాలి దేవి (90) మెడలో రమాభాయ్ అంగారి (95) మూడు ముళ్లు వేసి ముసిముసిగా నవ్వుతూ సిగ్గులొలకబోశారు. అధికారికంగా వివాహం జరగనప్పటికీ ఈ జంట ఆరుగురు సంతానంకి జన్మ ఇచ్చారు. ఇందులో నలుగురు ప్రభుత్వ ఉద్యోగాలు కూడా చేస్తున్నారు. వృద్ధ జంట పెద్ద కుమారుడికి 60 ఏళ్లు. వీరి పిల్లలకు కూడా వివాహాలు జరిగి కుటుంబాలుగా ఏర్పడ్డారు. దాదాపు జీవిత చరమాంకంలో ఏడు దశాబ్దాల అనంతరం పెళ్లిముచ్చట తీర్చుకోవాలని ఆశపడిన ఈ జంట తమ కుమారులకు విషయం చెప్పారు.గ్రామపెద్దలు, కుటుంబసభ్యులు అందరూ కలిసి జూన్ 1న హల్దీ వేడుకతో పెళ్లి సంబరాలు మొదలు పెట్టి జూన్ 4వ తేదీన ఇద్దరికీ పెళ్లి చేసి డీజే పాటలు, నృత్యాలతో ఊరంతా ఊరేగించారు. ఈ ఉత్సవాల్లో బిందౌలి (వివాహానికి ముందు జరిగే సాంప్రదాయ ఊరేగింపు), సంగీతం, నృత్యం, ఆచారబద్ధమైన సాత్ ఫేరే (అగ్ని చుట్టూ ఏడు ప్రదక్షిణలు) కూడా ఉన్నాయి. ఈ నూతన వధూవరుల వివాహ వేడుకకు ఊరంతా విచ్చేసి ఆనందంగా సంబరాలు చేసుకున్నారు. కాగా పెళ్లి బంధంతో పనిలేకుండా స్త్రీ, పురుషుల పరస్పర అంగీకారంతో కలిసి జీవించే 'నత ప్రథ' అనే ప్రాచీన సంప్రదాయం రాజస్థాన్‌లో ఇప్పటికీ పలు చోట్ల అమలులో ఉంది.

# బాధ్యతలు తీసుకున్న 24 గంటల్లోనే రాజీనామా

హైదరాబాద్, జూన్ 9,భారీ చిత్రాలకు కూడా పర్సంటేజ్ అనే విధానాన్ని తీసుకురావాలని ఎగ్జిబిటర్లు కొంతకాలంగా డిమాండ్ చేస్తున్నారు. దీనికి నిర్మాతలు ఒప్పుకోవడం లేదు. ఈ పద్ధతిని గనక అమలు చేస్తే తాము తీవ్రంగా నష్టపోతామని వారు వాపోతున్నారు. ఈ వివాదం వల్ల సునీల్ నా రంగ్ తన పదవికి రాజీనామా చేసినట్టు తెలుస్తోంది. తెలంగాణ ఫిలిం చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన 24 గంటల్లోనే నారంగ్ ఈ నిర్ణయం తీసుకోవడం నిజంగా ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. '' నాకు సంబంధం లేకపోయినా సింగిల్ థియేటర్స్ వివాదంలోకి నన్ను లాగుతున్నారు. అందువల్లే ఈ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని" సునీల్ తన అంతరంగికుల వద్ద వ్యాఖ్యానించినట్లు తెలుస్తోంది. ఇటీవల బంద్ వార్తలు వచ్చిన నేపథ్యంలో.. దాని వెనుక ఆ నలుగురు ఉన్నారంటూ జరిగిన ప్రచారం కూడా సునీల్ ను కలతకు గురి చేసినట్టు తెలుస్తోంది. ఆ నలుగురిలో సునీల్ కూడా ఉన్నారని ప్రచారం జరిగింది. అది ఆయనను తీవ్రంగా బాధపెట్టిందని సమాచారం.. ఆ వ్యాఖ్యలపై దిల్ రాజు, అరవింద్ లాంటి వాళ్ల రోజుల వ్యవధిలో విలేకరుల ముందుకు వచ్చి తమ వాణి వినిపించినప్పటికీ.. సునీల్ మాత్రం సైలెంట్ అయ్యారు.. ఇక ఇటీవల చాంబర్ ఆఫ్ కామర్స్ కొత్త కార్యవర్గం విలేకరుల సమావేశం నిర్వహించింది. అందులో శ్రీధర్ అనే వ్యక్తి చేసిన వ్యాఖ్యలు సునీల్ ను తీవ్రంగా వేదనకు గురిచేసాయి.. పెద్ద హీరోలను లక్ష్యంగా చేసుకొని శ్రీధర్ ఆరోపణలు చేశారు. శ్రీధర్ చేసిన వ్యాఖ్యల వెనుక సునీల్ ఉన్నారని ప్రచారం జరిగింది. ఆ ప్రచారం అంతకంతకు పెరుగుతున్న నేపథ్యంలో ఏకంగా ఆయన రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించారు. ఈ విషయాన్ని ఎగ్జిక్యూటివ్ కమిటీకి తెలియజేశారు.సునీల్ రాజీనామాకు కారణమైన వివాదం ఏపీలో మొదలైంది. జూన్ 1 నుంచి థియేటర్లను మూసివేస్తామని వార్తలు వచ్చాయి. చిన్న సినిమాలు తక్కువ కాదని.. పెద్ద సినిమాల మాదిరిగానే పర్సంటేజ్ ఇవ్వాలని ఎగ్జిబిటర్స్ డిమాండ్ చేశారు. ఈ డిమాండ్ వల్ల సినీ పరిశ్రమ రెండు వర్గాలుగా విడిపోయింది. ఈ వివాదం నేపథ్యంలో సినిమా పరిశ్రమలో పనిచేసే పెద్దలు సమస్య పరిష్కారానికి కృషి చేయకుండా.. ఎవరికి వారుగా దూరం జరిగిపోయారు.. ఈ వివాదం ఏప్రిల్ 19న ఆంధ్రప్రదేశ్లోని తూర్పుగోదావరి జిల్లాలో మొదలైంది. తూర్పుగోదావరి జిల్లాలోని అనుశ్రీ ఫిలిమ్స్ అధినేత సత్యనారాయణ ఈస్ట్ గోదావరి జిల్లాలో డిస్ట్రిబ్యూటర్, ఎగ్జిబిటర్ గా కొనసాగుతున్నారు. ఒక సందర్భంలో థియేటర్లను బంద్ చేయాల్సిన అవసరం ఉందని ఆయన తొలిసారిగా వ్యాఖ్యానించారు. అది కాస్త చినికి చినిగి గాలి వానలాగా మారింది. చివరికి నైజాం దాకా విస్తరించింది.. నైజాం ఏరియాకి గుండెకాయ లాంటి హైదరాబాదులో ఎగ్జిబిటర్లు, డిస్ట్రిబ్యూటర్లు, ప్రొడ్యూసర్లు ను ఒక వేదిక బతుకు తీసుకొచ్చి చాంబర్ ఆఫ్ కామర్స్ అనేక సందర్భాల్లో చర్చలు జరిపింది. అయినప్పటికీ ఉపయోగం లేకుండా పోయింది.. ఒకానొక దశలో నిర్మాతలు, డిస్ట్రిబ్యూటర్లు, ఎగ్జిబిటర్స్ మధ్య విపరీతమైన గొడవలు వచ్చాయి. దీని అందరికి కారణం పర్సంటేజ్, రెంట్ అని ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు.ఎగ్జిబిటర్ల సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత ఉందని.. దానికోసం ఒక కమిటీని నియమిస్తామని చాంబర్ ఆఫ్ కామర్స్ కీలక ప్రకటన చేసింది. మే 24 లో సమావేశం నిర్వహించి చర్చలు కూడా జరిపింది.. ఇక ఇదే సమయంలో పవన్ కళ్యాణ్ కార్యాలయం నుంచి ఒక లేఖ వచ్చింది. దీంతో మే 25, మే 26న అల్లు అరవింద్, దిల్ రాజు వరుసగా విలేకరుల సమావేశాలు నిర్వహించి తమ వివరణ ఇచ్చుకున్నారు.." ఆ నలుగురిలో మాకు స్థానం లేదు. అసలు అందులో మేము లేము. పవన్ కళ్యాణ్ సినిమా ఎవరు అడ్డుకుంటారు. అడ్డుకునే స్థాయి ఎవరికి ఉంది" అని వారి వ్యాఖ్యానించారు..

అయితే థియేటర్ల నిర్వహణ వ్యయం అంతకంతకు పెరగడం.. ప్రేక్షకుల సంఖ్య తగ్గిపోవడం.. ఓటిటికి వెంటనే సినిమాలు వచ్చేయడం వల్ల తమకు నష్టం జరుగుతోందని థియేటర్లో ఓనర్లు చెబుతున్నారు. అయితే థియేటర్ ఓనర్ల సమస్యలు గాలికి వెళ్ళగా.. సినిమా పరిశ్రమలోని పెద్దలు ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకున్నారు.

ఈ సమస్యలు 40 రోజులుగా సాగుతున్న వ్యవహారంలో తెరపైకి వచ్చినప్పటికీ.. పరిష్కార మార్గం మాత్రం కాన రాలేదు.. అప్పటికి దిల్ రాజు చెప్పినట్టుగానే.. ఫలు దఫాలుగా జరిగిన చర్చలు ఎటువంటి ఫలితం లేకుండానే అర్ధాంతరంగా ముగిసిపోవడం విశేషం.. థియేటర్ లలో ప్రేక్షకులు సినిమా చూపించేలాగా పరిస్థితులు కనిపించడం.. సినిమాల బడ్జెట్ ను నియంత్రణలో ఉంచడం వంటి చర్యలు తీసుకుంటేనే ఈ సమస్యలను పరిష్కరించడానికి సాధ్యమవుతుంది. లేకుంటే నిర్మాతలు, ఎగ్జిబిటర్లు, డిస్ట్రిబ్యూటర్లు జుట్లు జుట్లు పట్టుకొని కొట్టుకునేదాకా వస్తుంది.

# ఆశను నిరాశ చేసితివా..

హైదరాబాద్, జూన్ 9, సుదర్శన్ రెడ్డికి మంత్రి పదవి దక్కలేదు. కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి అమాత్య స్థానం లభించలేదు. రాములమ్మకు మంత్రదండం సాధ్యం కాలేదు. మొత్తంగా అధిష్టానం ఎవరినైతే ఫిక్స్ చేసిందో వారికి మాత్రమే పదవులు వచ్చాయి. పదవుల మీద ఆశలు పెట్టుకున్న వారికి రిక్త హస్తాలే మిగిలాయి.కాంగ్రెస్ పార్టీలో సిఫారసు రాజకీయాలకు కొదవ ఉండదు.

గ్రూపు రాజకీయాలకు అడ్డు ఉండదు. అలాంటి చోట కేబినెట్ విస్తరణలో ఆశావాహులకు కాకుండా పైరవీకారులకు పదవులు లభిస్తాయని అంచనా ఉన్నది. మీడియాకు కొన్ని పేర్లు లీక్ చేసినప్పటికీ.. వారికి పదవులు లభిస్తాయనే స్పష్టత లేదు.. వాస్తవానికి కేబినెట్ విస్తరణ జరుగుతుందని ఎప్పటి నుంచో ప్రచారం మొదలైంది. దీనిపై అనేక సందర్భాలలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హస్తినకు వెళ్లి వచ్చారు. పార్టీ పెద్దలను కలిశారు. కొన్నిసార్లు ఆయన ఒక్కరు మాత్రమే వెళ్లారు. ఇక అనేక సందర్భాలలో భట్టి విక్రమార్క, శ్రీధర్ బాబు, మహేష్ కుమార్ గౌడ్ వంటి వారు వెళ్లారు. ఇలా అనేక సందర్భాల్లో ముఖ్యమంత్రి హస్తిన వెళ్లిన తర్వాత చివరికి.. మంత్రివర్గం విస్తరణ పై ఒక క్లారిటీ వచ్చిందిశ్రీహరి ముదిరాజ్, వివేక్, అడ్లూరి లక్ష్మణ్ కు మంత్రి పదవులు లభించాయి. బిసి, ఎస్సీ సామాజిక వర్గాలకు చెందిన నాయకులకు మంత్రి పదవులు ఇవ్వాలని అధిష్టానం పట్టుదలతో ఉండడంతో.. సిఫారసులకు లెక్కలేకుండా పోయింది. వాస్తవానికి మంత్రివర్గ విస్తరణలో సుదర్శన్ రెడ్డి, రాజగోపాల్ రెడ్డి, విజయశాంతికి అవకాశం లభిస్తుందని ప్రచారం జరిగింది. ఎందుకంటే సుదర్శన్ రెడ్డికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అండగా ఉన్నారు. రాజగోపాల్ రెడ్డికి కే సి వేణుగోపాల్ రెడ్డి నుంచి అండదండలు ఉన్నాయి. విజయశాంతికి ఏసిసి అధ్యక్షుడి ఆశీర్వాదాలు ఉన్నాయి. ఇన్ని ఉన్నప్పటికీ కూడా ఈ ముగ్గురికి పదవులు రాకపోవడం విశేషం.

వీరు ముగ్గురు కూడా మంత్రి పదవులపై గంపెడు ఆశలు పెట్టుకున్నారు. వీరు మాత్రమే కాదు అద్దంకి దయాకర్ కూడా మంత్రి అవతారని ప్రచారం జరిగింది. అద్దంకి దయాకర్ అనుచరులు సోషల్ మీడియాలో విపరీతంగా ప్రచారం కూడా చేశారు. కాని చివరికి అధిష్టానం తాము అనుకున్న వారికి మాత్రమే పదవులు ఇచ్చింది. అధిష్టానం నుంచి గ్రీన్ సిగ్నల్ రావడంతో స్థానిక నాయకత్వం.. ఆ ముగ్గురికి మాత్రమే మంత్రి పదవులు ఇచ్చినట్టు పేర్కొంది. ఇక డోర్నకల్ ఎమ్మెల్యే రామచంద్రునాయక్ కు డిప్యూటీ స్పీకర్ పదవి రావడం విశేషం. ఆయన తొలిసారిగా డోర్నకల్ నుంచి ఎమ్మెల్యేగా గెలిచారు. ముఖ్యమంత్రి దగ్గర పరపతి ఎక్కువ ఉండడంతో.. చివరికి ఉపసభాపతి పోస్టును సాధించారు. తాజాగా ప్రకటించిన మంత్రి వర్గంలో కరీంనగర్ జిల్లా చెందిన ఒక నాయకుడికి పదవి లభించింది. మొత్తంగా ఉమ్మడి కరీంనగర్ నుంచి ముగ్గురు నాయకులకు మంత్రి పదవులు లభించడం విశేషం. ఇక ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, బట్టి విక్రమార్క మంత్రులుగా కొనసాగుతున్నారు.. ఇప్పుడు ఈ జాబితాలోకి కరీంనగర్ జిల్లా నాయకులు కూడా చేరిపోయారు.

కరీంనగర్ జిల్లా నుంచి శ్రీధర్ బాబు, ప్రభాకర్ తో పాటు లక్ష్మణ్ కు కూడా మంత్రి పదవులు లభించడంతో.. ఖమ్మం తోపాటు కరీంనగర్ కూడా ముగ్గురు మంత్రులతో కొనసాగుతోంది.

# మొదలైన బుజ్జగింపుల పర్వం

హైదరాబాద్, జూన్ 9, మంత్రివర్గ విస్తరణ నేపథ్యంలో తెలంగాణ కాంగ్రెస్ నేతలను పార్టీ నాయకత్వం బుజ్జగించే కార్యక్రమాన్ని చేపట్టింది. మంత్రి వర్గ విస్తరణలో పదవులు రాని వారి ఇళ్లకు వెళ్లి స్వయంగా వారితో మాట్లాడుతున్నారు. మాజీ మంత్రి సుదర్శన్ రెడ్డి ఇంటికి పీసీసీచీఫ్ మహేశ్ కుమార్ గౌడ్, రాష్ట్రవ్యవహారాల ఇన్ ఛార్జి మీనాక్షి నటరాజన్ లు చేరుకున్నారు. ఈ దఫా విస్తరణలో సుదర్శన్ రెడ్డికి చోటు దక్కలేదు. సుదర్శన్ రెడ్డి ఇంటికి... దీంతో ఆయనను బుజ్జగించేందుకు సుదర్శన్ రెడ్డి ఇంటికి చేరుకుని నేతలు బుజ్జగిస్తున్నారు. విస్తరణలో తనకు మంత్రివర్గంలో అవకాశం కల్పించాలని సుదర్శన్ రెడ్డి కోరుతున్నారు. పార్టీలో సీనియారిటీతో పాటు సిన్సియారిటీ, నిజామాబాద్ జిల్లాకు ప్రాతినిధ్యం లేకపోవడంతో తనకు అవకాశం కల్పించాలన్నసుదర్శన్ రెడ్డి పేరును పరిశీలనలోకి తీసుకోలేదు. రెడ్డి సామాజికవర్గానికే ఈ విస్తరణలో చోటు దక్కలేదు. దీంతో ఆయనకు నచ్చ చెప్పేందుకు అగ్రనేతలు సుదర్శన్ రెడ్డి ఇంటికి వెళ్లారు. తర్వాత కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డితో కూడా వీరిద్దరూ భేటీ కానున్నారని తెలిసింది

మూడు సామాజిక వర్గాలకు..

మంత్రి వర్గ విస్తరణ జరిగింది. ముగ్గురికి రేవంత్ రెడ్డి మంత్రివర్గంలో చోటు దక్కింది. గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఈ ముగ్గురి చేత ప్రమాణ స్వీకారం చేయించారు. చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్, మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరికి రేవంత్ రెడ్డి మంత్రివర్గంలో చోటు దక్కింది. ఇద్దరు ఎస్సీ సామాజికవర్గానికి చెందిన వారికి, ఒక బీసీ సామాజికవర్గానికి చెందిన నేతకు మంత్రివర్గంలో చోటు దక్కింది. వీరిలో గడ్డం వివేక్ మాల సామాజికవర్గానికి చెందిన వారు కాగా, అడ్లూరి లక్ష్మణ్ మాదిగ సామాజికవర్గానికి చెందిన వారు. ఇక వెనకబడిన తరగతులకు చెందిన అడ్లూరి లక్ష్మణ్ ముదిరాజ్ సామాజికవర్గానికి చెందిన వారు. ఈ ప్రమాణ స్వీకారానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు హాజరయ్యారు. కొత్త మంత్రులకు సంబంధించిన కుటుంబ సభ్యులు కూడా హాజరయ్యారు. గడ్డం వివేక్ ఇంగ్లీష్ లోనూ, అడ్లూరి లక్ష్మణ్, వాకిటి శ్రీహరిలు తెలుగులో ప్రమాణ స్వీకారం చేశారు.

## విద్యార్థులలో దేశభక్తిని పెంపొందించడానికి భారతదేశము నా మాతృభూమి అనే జాతీయ ప్రతిజ్ఞ రచించిన మహనీయుడు పైడిమర్రి వెంకటసుబ్బారావు -నేడు అయిన జయంతి



భారతదేశంలోని విద్యార్థుల్లోనూ దేశభక్తిని పెంపొందించడానికి భారతదేశము నా మాతృభూమి అనే భారత జాతీయ ప్రతిజ్ఞ రచించిన రచయిత, బహుభాషావేత్త పైడిమర్రి వెంకటసుబ్బారావు. ఈయన 1916, జూన్ 10న పైడిమర్రి రాంబాయమ్మ, వెంకవూటామయ్య దంపతులకు నల్లగొండ కేంద్రానికి అతి సమీపంలో ఉండే అన్నెపర్తిలో జన్మించారు. విద్యాభ్యాసం మొత్తం అన్నెపర్తి, నల్లగొండలోనే సాగింది. తెలుగు, సంస్కృతం, హిందీ, ఇంగ్లీష్, అరబిక్ భాషల్లో నిష్ణాతులు.హైదరాబాద్ రాష్ట్రంలోనే ట్రెజరీ విభాగంలో ప్రభుత్వోద్యోగం సంపాదించారు. ఆ తర్వాత ఆంధ్రప్రదేశ్ ఏర్పడ్డాక ఖమ్మం, నిజామాబాద్, నెల్లూరు, విశాఖపట్నం, నల్లగొండ జిల్లాల్లో పనిచేశారు.ఆయన 1962 లో విశాఖపట్నం ట్రెజరీ అధికారిగా ఉన్నపుడు ఈ ప్రతిజ్ఞ తయారు చేశాడు. భారత్-చైనా యుద్ధం జరుగుతున్న సమయమది. ఆ యుద్ధం పూర్తయిన తర్వాత చైనా ప్రభుత్వం ఓ నిర్ణయం తీసుకుంది. తమ దేశ ప్రజల్లో ప్రాథమిక దశ నుంచే దేశభక్తి భావం నూరిపోయాలని..! ఆ మేరకు ప్రత్యేకంగా కొన్ని దేశభక్తి గేయాలను రాయించి, పాఠశాల విద్యార్థులతో చదివించడం మొదలుపెట్టింది.

అప్పటికే విదేశీ భాషల్లో ప్రావీణ్యం ఉన్న పైడిమర్రి ఈ విషయం గుర్తించాడు. మన దేశ విద్యార్థుల్లోనూ దేశభక్తిని పెంపొందించడానికి గేయాలుంటే బాగుంటుందని భావించాడు. పలు రచనలు చేసిన అనుభవంతో ఆ ఆలోచనకు రూపమివ్వడం మొదలుపెట్టాడు. ప్రతిజ్ఞకు పదాలు కూర్చాడు. విశాఖ సాహితీ మిత్రుడు తెన్నేటి విశ్వనాథంతో చర్చించాడు. వారి శ్రేయోభివృద్ధులే నా ఆనందానికి మూలము' అన్న వాక్యాన్ని అదనంగా చేర్చాడు. అంతాబాగానే ఉంది కానీ, దాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి.. పాఠ్యపుస్తకాల్లో చేర్చడం ఎలా అని ఆలోచించారు.

అది కాసు బ్రహ్మానందడ్డి ప్రభుత్వం. అప్పటి విద్యాశాఖ మంత్రి విజయనగరం రాజాగా పేరుగాంచిన పీవీజీ రాజు. ఆయన సాహితీవేత్త కావడం వారికి కలిసొచ్చింది. తేన్నేటి సాయంతో ప్రతిజ్ఞను పీవీజీ రాజు దృష్టికి తీసుకెళ్లాడు. దాని విలువను, అవసరాన్ని వివరించి ఓ ప్రతిని అందజేశారు. 1964లో బెంగుళూరులో ప్రముఖ న్యాయనిపుణుడు మహ్మద్ కరీం చాగ్లా అధ్యక్షతన కేంద్రీయ విద్యా సలహామండలి సమావేశం జరిపినపుడు జాతీయ ప్రతిజ్ఞగా స్వీకరించారు. తరువాత దీన్ని అన్ని భాషల్లోకి అనువాదం చేయించి 1965 జనవరి 26 నుంచి దేశమంతటా చదువుతున్నారు.

పైడిమర్రి రాసిన ప్రతిజ్ఞలో కాలానుగుణంగా కొన్ని స్వల్ప మార్పులు మాత్రం జరిగాయి. గ్రాంథికంలో కొన్ని పదాల స్థానంలో వాడుక భాష వాడారు. ఇతర భాషల్లోకి అనువదించి 1963 నుంచి దేశ ప్రతిజ్ఞగా అమలులోకి వచ్చింది.ఉద్యోగ విరమణ అనంతరం 1988 ఆగష్టు 13 న ఆయన అనారోగ్యంతో తుదిశ్వాస విడిచారు. పాఠ్య పుస్తకాలలో ప్రచురిస్తున్న ప్రతిజ్ఞకు పైడిమర్రి వెంకటసుబ్బారావు పేరును ముద్రించాలని తెలంగాణ విద్యావంతుల వేదిక 2014 నవంబరు 27న రాష్ట్రపతికి, ప్రధానమంత్రికి, రాష్ట్ర గవర్నర్కు తెలంగాణ సీఎం కెసీఆర్ కు విజ్ఞప్తి చేయగా, 2015-16 విద్యాసంవత్సరం నుంచి కేంద్ర, రాష్ట్ర స్థాయిల్లో అన్ని భాషల్లో అన్ని ప్రభుత్వ పాఠ్యపుస్తకాలలో జాతీయ ప్రతిజ్ఞతో పాటు రచయిత పైడిమర్రి వెంకట సుబ్బారావు పేరును ముద్రిస్తున్నారు. అంతేకాకుండా తెలంగాణ ప్రభుత్వం 5వ తరగతి తెలుగు పుస్తకం అట్ట వెనుక భాగం లోపలి పేజీలో పైడిమర్రి వెంకట సుబ్బారావు జీవిత చరిత్రను ముద్రించి విశేష ప్రాచుర్యం కల్పించి గౌరవించింది. ఆయన రచించిన భారత జాతీయ ప్రతిజ్ఞ మరోసారి మనము చదువుదాము.....భారతదేశం నా మాతృభూమి. భారతీయులందరూ నా సహోదరులు. నేను నా దేశాన్ని ప్రేమిస్తున్నాను.

సుసంపన్నమైన, బహువిధమైన నాదేశ వారసత్వసంపద నాకు గర్వకారణం.

దీనికి అర్హత పొందడానికి సర్వదా నేను కృషి చేస్తాను. నా తల్లిదండ్రుల్ని, ఉపాధ్యాయుల్ని, పెద్దలందర్నీ గౌరవిస్తాను. ప్రతివారితోను మర్యాదగా నడచుకొంటాను. నా దేశం పట్ల, నా ప్రజల పట్ల సేవానిరతితో ఉంటానని ప్రతిజ్ఞ చేస్తున్నాను. వారి శ్రేయోభివృద్ధులే నా ఆనందానికి మూలం.

## ప్రమాద నివారణకు సహకరించాలి.

## రామగుండం ట్రాఫిక్ ఏసిపి సిహెచ్ శ్రీనివాస్.

గోదావరిఖని : రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరు సహకరించాలని రామగుండం ట్రాఫిక్ ఏసిపి సిహెచ్ శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈ మేరకు ఇటీవల ట్రాఫిక్ ఏసిపి గా నూతన బాధ్యతలు స్వీకరించిన అనంతరము ఆయన ఏసీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కమిషనరేట్ పరిధిలో రోడ్ల పైన, నగరంలోని ప్రధాన వీధుల్లో వాహనాలధాలు తమ వాహనాలను నిలిపి ట్రాఫిక్ అంతరాయంతో రోడ్డు ప్రమాదాలకు దారితీస్తున్నాయని ఆయన తెలిపారు. రామగుండం ప్రాంతం నిత్యము రాజీవ్ రహదారి పైన భారీ వాహనాలు రాకపోకలు ఉంటాయని వాహనాలు రద్దీ దృష్ట్యా వాహన యజమానులు డ్రైవర్లు జాగ్రత్త వాహనాలు నడపాలని అన్నారు. రామగుండం కమిషనరేట్ పరిధిలో మద్యం తాగి వాహనాలు నడిపిన, హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించు కోకుండా వాహనం నడితే జరిమానా విధించబడునని, మైనర్ పిల్లలకు వాహనాలు ఇస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, ప్రతి వాహనదారుడు డ్రైవింగ్ లైసెన్స్, బీమా, వాహన పత్రాలు కలిగి కచ్చితంగా ఉండాలని తెలిపారు.

# త్వరలో టన్నెల్ పనులు

మహబూబ్ నగర్, జూన్ 9, శ్రీశైలం ఎడమ కాల్వ టన్నెల్ ప్రమాదం సంభవించి దాదాపు నాలుగు నెలలు కావస్తుంది. అయితే రెస్క్యూ ఆపరేషన్ ను ప్రభుత్వం నిలిపి వేసింది. శ్రీశైలం ఎడమ గట్టు సొరంగంలో రెస్క్యూ ఆపరేషన్ కు బ్రేక్ పడింది.మరో మూడు నెలల వరకూ ప్రమాదం జరిగిన ప్రాంతంలో తవ్వకాలు జరిపే అవకాశం లేదని అధికారులు తెలిపారు. మృతుల కుటుంబాలకు కనీసం మృతదేహాలను కూడా అప్పగించలేని పరిస్థితి తలెత్తింది. ఇప్పటికే శ్రీశైలం ఎడమ కాల్వ టన్నెల్ ప్రమాదం వంద రోజులు దాటిపోయింది. శ్రీశైలం ఎడమ కాల్వ టన్నెల్ ప్రమాదం లో రెస్క్యూ ఆపరేషన్ కు తాత్కాలిక బ్రేక్ అని చెప్పినప్పటికీ ఇక కొనసాగించే అవకాశాలు మాత్రం కనిపించడం లేదు.మొత్తం ఎనిమిది మంది కార్మికులు శ్రీశైలం ఎడమ కాల్వ టన్నెల్ లో జరిగిన ప్రమాదంలో చనిపోగా అందులో ఇద్దరి మృతదేహాలు మాత్రమే లభ్యమయ్యాయి. మరో ఆరుగురి మృతదేహాలు లభ్యం సాధ్యం కాలేదు. ప్రమాదకరమైన ప్రాంతంలో మృతదేహాలుంటాయని గుర్తించినప్పటికీ అక్కడకు సహాయక బృందాలకు వెళ్లలేక చేతులెత్తేశాయి. దాదాపు మూడు నెలల పాటు నిర్విరామంగా పనిచేసిన సహాయక బృందాలు ఆ తర్వాత తమ వల్ల కాదని చెప్పేశాయి. అందులో జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా కూడా ఇక మృతదేహాల గాలింపు సాధ్యం కాదని తేల్చి చెప్పడంతో ప్రభుత్వం కూడా దీనిపై నిర్ణయం తీసుకుంది. ఈ ప్రమాదంలో సహాయక చర్యలను పర్యవేక్షించేందుకు ఉన్నతాధికారి శివశంకర్ ను నియమించినా ఆయన ఇచ్చిన నివేదిక కూడా అలాగే ఉంది.. ప్రమాదం జరిగిన డీ2 ప్రాంతంలో తవ్వకాలు జరిపితే పై కప్పు మళ్లీ కూలుతుందని అధికారులు చెప్పడంతో ఆ ప్రయత్నం విరమించుకున్నారు. ప్రమాదకరమైన జోన్ లో తవ్వకాలు జరపడం మంచిది కాదని, సేఫ్ కూడా కాదని, కార్మికుల ప్రాణాలకు ముప్పు వాటిల్లే ప్రమాదముందని హెచ్చరికలతో నెలరోజులకు పైగానే అక్కడ సహాయక చర్యలు కొనసాగడం లేదు.దీంతో మృతదేహాలను మాత్రం కుటుంబీకులకు అప్పగించలేకపోయారు. కేవలం ఇద్దరిని మాత్రమే అప్పగించారు. అయితే ఇప్పుడు నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చేసిన ప్రకటన మరోసారి చర్చనీయాంశమైంది. మరోసారి శ్రీశైలం ఎడమ కాల్వ టన్నెల్ పనులు ప్రారంభిస్తామని, ఈ ఏడాది శాసనసభ సమావేశాల్లోపు వాటిని పూర్తి చేస్తామని, అందుకు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తామని చెప్పడంతో మృతదేహాలను వెలికి తీయడంలో బ్రేక్ ఇచ్చిన ప్రభుత్వం మరోసారి ప్రారంభిస్తుందా? లేక టన్నెల్ పనులను అలాగే మొదలు పెడుతుందా? అన్నది తేలాల్సి ఉంది

## స్పోర్ట్స్ స్కూల్ అడ్మిషన్లకు లైన్ క్లియర్

అదిలాబాద్, జూన్ 9, తెలంగాణ ప్రభుత్వ క్రీడా పాఠశాలల్లో ప్రవేశానికి సంబంధించి ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. హకీంపేట్, కరీంనగర్, ఆదిలాబాద్ స్కూల్స్ కోసం ఎంపిక ప్రక్రియ జరుగుతుంది.విద్యార్థులను చిన్నప్పటి నుంచే క్రీడలపై ఆసక్తి పెంచి.. క్రీడలలో శిక్షణ అందించేందుకు తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ క్రీడా పాఠశాలలను నిర్వహిస్తోంది. అయితే ఇందులో అడ్మిషన్ కోసం చాలా మంది వెయిట్ చేస్తూ ఉంటారు. ఇప్పుడు టైమ్ వచ్చింది. తెలంగాణ క్రీడా పాఠశాలల్లో నాలుగో తరగతి ప్రవేశానికి సంబంధించిన ప్రవేశాల ప్రక్రియ షురూ అయింది. 2025-26 సంవత్సరానికి సంబంధించి ఎంపిక ప్రక్రియ జరగనుంది.

సీట్ల వివరాలు

హకీంపేట్, కరీంనగర్, ఆదిలాబాద్ క్రీడా పాఠశాలల కోసం ఎంపిక ప్రక్రియ జరుగుతుంది. హకీంపేట్ బాలురు-20 సీట్లు, బాలికలు-20 సీట్లు. కరీంనగర్ బాలురు-20 సీట్లు, బాలికలు-20 సీట్లు, ఆదిలాబాద్ బాలురు-20 సీట్లు, బాలికలు-20 సీట్లు ఉన్నాయి. అంటే మె?త్తం 120 సీట్లలో 60 బాలురకు, 60 బాలికలకు అన్నమాట.ఎంపిక ప్రక్రియ మూడు విధానాల్లో జరుగుతుందని గుర్తుంచుకోవాలి. 16-06-2025 నుంచి 19-06-2025 మధ్య మండల స్థాయి ఎంపిక జరుగుతుంది. 23-06-2025 నుంచి 26-06-2025 మధ్య జిల్లా స్థాయి సెలక్షన్ ఉంటుంది. 01-07-2025 నుంచి 05-07-2025 వరకు రాష్ట్ర స్థాయి ఎంపిక చేస్తారు. ఇందులో ఎంపికైన వారి మెరిట్ ఆధారంగా తీసుకుంటారు.ఫిజకల్ పరీక్షలు(27 మార్కులు)

30 మీటర్ల ఫ్లయింగ్ స్టార్స్, స్టాండింగ్ బాడీ జంప్, 800 మీటర్ల రన్, 6లీ10 మీటర్ల షటిల్ రన్, మెడిసిన్ బాల్ త్రో, వర్టికల్ జంప్, ఫ్లెక్సిబిలిటీ టెస్ట్, ఎత్తు, బరువు. ఈ పరీక్షలు చేస్తారు. ఇందులో ప్రతీదానికి 3 మార్కులు ఉంటాయి. మె?త్తం కలిపితే 27 మార్కులు అవుతాయి.

మెడికల్ పరీక్షలు : వయసు ధృవీకరణ, పోస్టర్, బోన్ అబ్ నార్మలిటీస్ పరీక్షలు చేస్తారు.

పుట్టిన తేదీలు : 01-09-2016 నుంచి 31-08-2017 మధ్య జన్మించి ఉండాలి. అంటే 8 నుంచి 9 సంవత్సరాల వయసు.

ముఖ్యమైన వివరాలు

ఆన్లైన్ రిజిస్ట్రేషన్ మొదలైంది. విద్యార్థులు లిలిలి.బిణబబ.బివశ్రీజీనిణజీనిజీ.ణనీల.తినిలో వివరాలు నమోదు చేసుకోవచ్చు. పరీక్షలు నిర్వహించే ప్రదేశం, తేదీలు, ఇతర వివరాలకు సంబంధిత జిల్లా క్రీడా, యువజన శాఖ అధికారిని సంప్రదించాలని నోటిఫికేషన్లో పేర్కొన్నారు.

# మిడిల్ క్లాస్ ఇంటిని మర్చిపోవడమేనా...

హైదరాబాద్, జూన్ 8, హైదరాబాద్లో పెరుగుతున్న రియల్ ఎస్టేట్ ధరలు యువ టెక్కీలకు చుక్కలు చూపిస్తున్నాయి. కొంతమంది సొంత ఇల్లు లేని కారణంగా వివాహాలు కూడా చేసుకోలేకపోతున్నామని బాధపడుతున్నారు. ఇంకొందరు ఇల్లు కొనడం కన్నా ప్లాట్ కొనుక్కోవడం బెటర్ అంటున్నారు.ఒకప్పుడు భారతదేశంలోని మధ్యతరగతికి అఫార్డబుల్ హౌసింగ్గా గుర్తింపు పొందిన హైదరాబాద్ రియల్ ఎస్టేట్ మార్కెట్ ఇప్పుడు బాగా సంపాదిస్తున్న టెక్ నిపుణులకు కూడా దడదడలాడిస్తోంది! ఆకాశాన్ని అంటుతున్న ప్రాపర్టీ ధరలు, పెరుగుతున్న కుటుంబ బాధ్యతలు, ఇంటిని సొంతం చేసుకోవాలనే తీవ్రమైన సామాజిక ఒత్తిడి, ముఖ్యంగా వివాహ సంబంధాలను మెరుగుపరచుకోవాలన్న ఉద్దేశాల మధ్య చాలా మంది యువకులకు ఇప్పుడు పరిమిత ఆప్షన్స్ మాత్రమే ఉంటున్నాయి. ఇది అందరిని ఇబ్బందిపెడుతోంది.హైదరాబాద్ రియల్ ఎస్టేట్లో అందుబాటులో ఉన్న గృహాల ఇన్వెంటరీకి, మధ్య ఆదాయ కొనుగోలుదారులు వాస్తవంగా కొనుగోలు చేయగల వాటికి మధ్య స్పష్టమైన వ్యత్యాసం ఉండటాన్ని తాజా పరిస్థితులు సూచిస్తున్నాయి. హైటెక్ సిటీకి 40 నిమిషాల దూరంలో ఉన్న బ్రాండెడ్ కాని అపార్ట్మెంట్ల ధరలు కూడా ఇప్పుడు రూ. 1.2-1.5 కోట్లు పలుకుతున్నాయి. ధరలు ఈ స్థాయిలో ఉండటంతో ఇంటిని సొంతం చేసుకోవడం అనేది కేవలం భరించలేని విధంగా ఉందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.కొంతమందికి, ప్రాపర్టీని సొంతం చేసుకోవాలనే ఒత్తిడి వ్యక్తిగత పరిణామాలను కలిగి ఉంది. తనకు ఇల్లు లేనందున పెళ్లి సంబంధాలు పోతున్నాయని ఒక వ్యక్తి అంగీకరించారు. భారతీయ వివాహ సంస్కృతిలో సొంతిల్లు ఉండటం అనేది ఒక ముందస్తు అవసరంగా ఎలా మారుతుందో ఇది స్పష్టంగా ప్రతిబింబిస్తుందికొంతమంది యువ కొనుగోలుదారులు ఇప్పుడు ప్లాట్ పెట్టుబడుల వైపు మొగ్గు చూపుతున్నారు. ఇవి సాపేక్షంగా సరసమైనవి, వారికి నచ్చిన విధంగా ఇళ్లను నిర్మించుకోవడానికి అవకాశం కల్పిస్తాయిహైదరాబాద్లోని ఒక ప్రొడక్ట్ ఆధారిత కంపెనీలో పనిచేస్తున్న 28 ఏళ్ల సాఫ్ట్వేర్ ఇంజనీర్.. సంవత్సరానికి రూ. 29 లక్షల వార్షిక ప్యాకేజీ ఉన్నప్పటికీ, ఇంటిని సొంతం చేసుకోవడం తనకు ఎలా కష్టంగా మారిందో వివరించాడు. పరిశ్రమ ప్రమాణాల ప్రకారం గౌరవనీయమైన ఆదాయం ఉన్నప్పటికీ, అతను నగరంలో ఇంటిని కొనుగోలు చేయలేకపోతున్నాడట."మా కుటుంబం 20 సంవత్సరాల క్రితం విడిపోయినప్పటి నుంచి నేనే కుటుంబ పోషణ భారాన్ని మోస్తున్నాను. నా ఆదాయంలో దాదాపు సగం నా తోబుట్టువుల చదువుకు, ఇతర ఇంటి ఖర్చులకు వెళుతోంది," అని అతను చెప్పడు. అతని తమ్ముడు, చెల్లి ఇంకా కాలేజీలో ఉండటం, వివిధ బీమా, ఆరోగ్య సంరక్షణ ఖర్చులు భరించాల్సి ఉండటంతో పొదుపు లేదా ఇంటి పెట్టుబడి కోసం అందుబాటులో ఉన్న ఆదాయం తక్కువగానే ఉంది.

'అపార్ట్మెంట్ కొనే బదులు ప్లాట్ కొంటాను'

సరసమైన గృహనిర్మాణ ఆప్షన్స్ని వెతుకుతున్నప్పుడు ఏదో ఒక సమస్య వస్తోందని సామాజిక మాధ్యమం రెడ్డిట్లో యువ టెకీలు చెబుతున్నారు. హైదరాబాద్కు దాదాపు 100 కి.మీ దూరంలో ఉన్న తన స్వగ్రామంలో కూడా, 1,200 చదరపు అడుగుల సాధారణ ఇంటి ధర దాదాపు రూ. 75 లక్షలు ఉందని ఓ వ్యక్తి చెప్పాడు."ఇది నిరాశ కలిగిస్తోంది," అని అతను అన్నాడు. "ఆ మొత్తానికి, నేను ఒక ప్లాట్ కొని సొంతంగా ఇల్లు కట్టుకుంటాను. కనీసం అప్పుడైనా నాకు భూమి ఉంటుంది, అది కాలక్రమేణా విలువ పెరిగే అవకాశం ఉంది," అని వివరించాడు.అపార్ట్మెంట్లలో పెట్టుబడుల గురించి అతను సందేహం వ్యక్తం చేశాడు. దీర్ఘకాలిక విలువ తగ్గింపును ఉటంకిస్తూ.. "నార్సింగి వంటి ప్రాంతాల్లో 10 ఏళ్ల అపార్ట్మెంట్లు ఎలా ఉంటాయో నేను చూశాను, గోడలపై పగుళ్లు, నీటి లీకేజీలు సాధారణం. నిర్మాణ నాణ్యత నిలబడదు. మీ మొత్తం పొదుపులు బిల్డర్కు వెళతాయి. అది పెట్టుబడి కాదు, అదొక బాధ్యత," అని పేర్కొన్నాడు.ప్రస్తుతానికి, కొనుగోలుదారులు భూమిని కొనుగోలు చేయడం వైపు మొగ్గు చూపుతున్నారు. అది నగరం నుంచి మరింత దూరంగా వెళ్లవలసి వచ్చినా సరే! "నేను రూ. 70 లక్షలు ఖర్చు చేయాల్సి వస్తే, నేను ఒక భూమిని కొని నాకు నచ్చిన విధంగా నిర్మించుకుంటాను. నాకు వంశపారంపర్య ఆస్తి లేదా ఆర్థిక వనరులు లేవు. భవిష్యత్తు కోసం ఏదైనా నిర్మించుకోవడానికి ఇది ఏకైక అవకాశం అనిపిస్తుంది," మరో వ్యక్తి చెప్పుకొచ్చాడు.హైదరాబాద్ రియల్ ఎస్టేట్ తాజా పరిస్థితితో నిర్మాణంలో ఉన్న అపార్ట్మెంట్లను బుక్ చేసుకోండని నెటిజన్లు అంటున్నారు.టైర్-1 బిల్డర్తో నిర్మాణంలో ఉన్న ఫ్లాట్ను బుక్ చేసుకోవాలని, ఆర్థిక స్థిరత్వాన్ని సూచించడానికి దానిని ఉపయోగించుకోవాలని, పెళ్లి చేసుకోవాలని, ఆపై అపార్ట్మెంట్ను విక్రయించి డబ్బును తిరిగి పొందాలని నెటిజన్లు సూచిస్తున్నారు."నిర్మాణంలో ఉన్నంత వరకు మీరు రిజిస్ట్రేషన్ ఖర్చులను ఆదా చేసుకుంటారు. ఏకైక ప్రతికూలత.. పాక్షిక పంపిణీపై వడ్డీ. కానీ మీరు 20:80 చెల్లింపు ప్రణాళికను కనుగొంటే, మీరు ఆ 20% డౌన్ పేమెంట్ను ఏర్పాటు చేయగలిగితే అది కూడా తప్పించుకోవచ్చు, ఇది కష్టమే కానీ సాధ్యం చేసుకోవచ్చు," అని ఒక నెటిజన్ సలహా ఇచ్చాడు.

# పార్టీల్లో కోవర్టుల కలకలం...

హైదరాబాద్, జూన్ 9, రాజకీయాల్లో గెలవాలన్నా.. గెలిచి నిలవాలన్నా? ఎత్తులకు పైఎత్తులు వేయడం వచ్చుండాలి. తమ బలాన్ని నమ్ముకోవడం ఒకెత్తయితే.. ఎదుటివారి బలహీనతల్ని పసిగట్టడం, అవతలివైపు లోగుట్టును ఎప్పటికప్పుడు తెలుసుకోవడం.. మరో బలమైన ఎత్తు. సమకాలీన రాజకీయాల్లో.. అన్ని రాజకీయ పార్టీలూ ఇప్పుడ రెండో ఎత్తుగడమీదే ఎక్కువ ఆధారపడుతున్నట్టు కనిపిస్తోంది. గల్లీ నుంచి ఢిల్లీ పాలిటిక్స్ వరకు.. ప్రధాన పార్టీలను కలవరపెడుతున్న అంశం కూడా అదే. ఇంతకీ, ఆ ముచ్చటేంటి? ఆ కలవరానికి కారణమేంటితెలుగు రాజకీయాల్లో.. ఇప్పుడు ఇలాంటి చర్చే జరుగుతోంది. ఏ పార్టీలో ఎవరి కోవర్టులు ఉన్నారో తెలియని గందరగోళ పరిస్థితులు నెలకొనడమే దీనికి ప్రధానంగా కారణంగా తెలుస్తోంది. చిన్నచితక నాయకులు మాట్లాడేదైతే మరేమంత సీరియస్ ఇష్యూగా పరిగణించాల్సిన అవసరం ఉండేది కాదేమో. రాహుల్ గాంధీ నుంచి.. చంద్రబాబు, కేటీఆర్లవరకు? బడానేతలు ఈ విషయాన్ని నొక్కి వక్కాణించడమే ఈ స్థాయి చర్చకు దారితీస్తోంది. చర్చకు సంగతి పక్కనపెడితే.. ప్రాంతీయ పార్టీ నుంచి జాతీయ పార్టీల వరకు? ప్రతిఒక్క పక్షాన్ని కోవర్టుల సమస్య ఇబ్బంది పెడుతోందనేది మాత్రం స్పష్టమవుతోంది. అయితే, ఏ పార్టీలో ఎవరికెవరు కోవర్టులుగా పనిచేస్తున్నారని తెలుసుకోవడమే ఇప్పుడు సవాలుగా మారింది.ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు? పార్టీలో కోవర్టులపై ఇటీవల చేసిన వ్యాఖ్యలు సంచలనం రేపాయి. హత్యా రాజకీయాల్లో తలపండిన వైసీపీ నాయకులు కొందరు కోవర్టుల్ని తెదేపాలోకి పంపి వారి ఎజెండాను నెరవేర్చుకోవాలని అనుకుంటున్నారంటూ బాంబు పేల్చారు. సంతనూతలపాడులో టీడీపీ నేత వీరయ్య చౌదరి, మాచర్లలో మరో ఇద్దరు కార్యకర్తల హత్యలతో.. తనకు అదే అనుమానం కలుగుతోందన్నారు చంద్రబాబు. అలాంటివారిని ఉపేక్షిస్తే మన వేలితో మన కన్ను పొడుచుకున్నట్టేనంటూ.. కార్యకర్తల్ని హెచ్చరించారు.పదేళ్ల పాటు అధికారం చెలాయించిన బీఆర్ఎస్ను కూడా ఇప్పుడు కోవర్టుల భయం వెంటాడుతోంది. ఇటీవల కేసీఆర్కు కవిత రాసిన అంతర్గత లేఖ.. బయటకు లీకవడంతోనే కోవర్టుల ముచ్చట తెరమీదకు వచ్చింది. అంతర్గత విషయం బయటకెలా వచ్చిందో తేల్చాలని కవిత డిమాండ్ చేయగా ? పార్టీలో సీఎం రేవంత్రెడ్డి కోవర్టులు ఉన్నారంటూ ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కీలక వ్యాఖ్యలు చేశారు. టైమొచ్చినప్పుడు ఆ కోవర్టులు వాళ్లంతట వాళ్లే బయటపడ్తారంటూ? ఇండైరెక్టుగా గట్టి వార్నింగే ఇచ్చారు. ఆలోపు ఇంకెన్ని బీఆర్ఎస్ సీక్రెట్స్ బయటకు వస్తాయో తెలియదు.కేటీఆర్ చెప్పిన దాంట్లో వాస్తవం లేకపోలేదు. ప్రతీ పార్టీలోనూ కోవర్టులు ఉంటారు. అక్కడి అంతర్గత విషయాలను.. తమ బాసులకు చేరవేస్తుంటారు. అయితే, ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీలో సైతం.. బీఆర్ఎస్కు, బీజేపీకి కోవర్టులుగా పనిచేస్తున్నవారు ఉన్నారనే ప్రచారం చాలారోజులుగానే ఉంది. కాంగ్రెస్ ప్రతిపక్షంలో ఉండగా? వరంగల్ సభలో ఏకంగా రాహుల్గాంధీ ఈ విషయాన్ని ప్రస్తావించారు. అలాంటి వారు ఎవరైనా, ఎంతవారైనా తమకు అక్కర్లేదనీ.. బీజేపీలోనో, బీఆర్ఎస్లోనో చేరిపోవాలంటూ? తేల్చి చెప్పేశారు.కోవర్టులతో చాన్నాళ్లుగా ఇబ్బందపడిన కాంగ్రెస్ పార్టీకి? ఇప్పటికీ ఆ బెడద పోలేదని తెలుస్తోంది. జాతీయ స్థాయిలోనూ ఆ పార్టీకి కోవర్టుల సమస్య వెంటాడుతోంది. ఇటీవల గుజరాత్లో జరిగిన పార్టీ ముఖ్యనేతల సమావేశంలోనూ రాహుల్ ఇదే విషయాన్ని ఉటంకించారు. కాంగ్రెస్లో సగంమందికిపైగా బీజేపీకి కోవర్టులుగా పనిచేస్తున్నారంటూ? తీవ్రవ్యాఖ్యలు చేశారు. వారివల్లే పార్టీ నష్టపోతోందని చెప్పారు.చంద్రబాబైనా, కేటీఆరైనా, రాహుల్ గాంధీ అయినా.. ఎవరు చెప్పినా కోవర్టుల ముచ్చట కొత్తదేం కాదు. మరీ ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీలో కోవర్టు సంస్కృతి ఎప్పటి నుంచో ఉందంటారు రాజకీయ విశ్లేషకులు. అధికారంలో లేనప్పుడు కాంగ్రెస్ నేతలు తమ పనులకోసం అధికారపక్షంతో అంటకాగిన సందర్భాలు చాలానే ఉన్నాయనే ప్రచారం ఉంది. తెలంగాణలో కేసీఆర్ అధికారంలో ఉన్నప్పుడు? చాలామంది కాంగ్రెస్ నేతలు ఇలాంటి ఆరోపణలే ఎదుర్కొన్నారు. జగ్గారెడ్డి, కోమటిరెడ్డి, ఉత్తమ్కుమార్రెడ్డి సహా భట్టి విక్రమార్క వరకు.. అందరూ ఈ ఆరోపణలు ఎదుర్కొన్నవారే. గతంలోనూ ఇలాంటి రాజకీయాలు చేసిన నేతలు.. కాంగ్రెస్లో సొంతనేతలను ఓడించుకున్న పరిస్థితులు ఉన్నాయ్.కాళేశ్వరం కమిషన్ ముందు హాజరైన బీజేపీ ఎంపీ ఈటల విషయంలో.. కాంగ్రెస్ చేస్తున్న ఆరోపణలు తిప్పికొడుతున్న బీజేపీ? అసలు కోవర్టులు కాంగ్రెస్లోనే ఉన్నారనీ, వారంతా బీఆర్ఎస్ కోసం పనిచేస్తున్నారనీ ప్రతివిమర్శలు చేస్తోంది. పీసీసీ చీఫ్ మహేష్గౌడ్ , కేసీఆర్కు అనుకూలంగా కోవర్టు రాజకీయాలు చేస్తున్నారంటూ.. బీజేఎల్పీ లీడర్ మహేష్గౌడ్ ఆరోపించారు. 2014 లోకసభ ఎన్నికల్లో పరోక్షంగా అప్పటి బీఆర్ఎస్ అభ్యర్థి కవితకు మద్దతునిచ్చారంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు.అధికారంలో ఉన్నా, లేకపోయినా? ప్రధాన రాజకీయ పార్టీలను ఇప్పుడు కోవర్టుల అంశం కుదిపేస్తోంది. ఈ సమస్యంతో అప్పట్లో అతలాకుతలమైన హస్తం పార్టీ అధికారం దక్కించుకోగా, ఇప్పుడు బీఆర్ఎస్ను ఆ సమస్య వెంటాడుతున్నట్టు తెలుస్తోంది. మరి, ఏ పార్టీకి ఎవరు కోవర్టులున్నారు? ఎంతమంది ఉన్నారు? వాళ్లెవరు? అనే విషయం ఎలా బయటకొస్తుందో? ఎప్పుడు బయటపడుతుందో చూడాలి.

# తెలంగాణ బియ్యానికి బ్రాండింగ్...

హైదరాబాద్, జూన్ 9, తెలంగాణలో సన్న వడ్ల దిగుబడి అధికంగా ఉంది. దీంతో రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ కీలక నిర్ణయం తీసుకుంది. 'తెలంగాణ బ్రాండ్' పేరుతో నాణ్యమైన బియ్యాన్ని మార్కెట్లో విక్రయించాలని డిసైడ్ అయింది. బీపీటీ, ఆర్ఎన్ఆర్, జై శ్రీరాం వంటి రకాలు మిల్లింగ్ చేసి సొంత బ్రాండ్తో విక్రయించాలని యోచిస్తోంది. సూపర్ మార్కెట్లు, కిరాణా, రేషన్ షాపులలో కూడా వీటిని అందుబాటులో ఉంచనున్నారు. ఏపీఎల్ కార్డుదారులకు మార్కెట్ ధర కంటే కాస్త తక్కువకే ఈ బియ్యాన్ని విక్రయించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.తెలంగాణలో రాష్ట్ర అవసరాలకు మించి సన్న వడ్లు ఉత్పత్తి అవుతుండటంతో.. మిగులు ధాన్యాన్ని వినియోగించుకోవడానికి పౌరసరఫరాల సంస్థ వినూత్న ప్రణాళికతో ముందుకొచ్చింది. మిగులు ధాన్యాన్ని మిల్లింగ్ చేయించి నాణ్యమైన బియ్యంగా 'తెలంగాణ బ్రాండ్' పేరుతో మార్కెట్లోకి విడుదల చేయాలని డిసైడ్ అయింది. ముఖ్యంగా బీపీటీ, ఆర్ఎన్ఆర్, జై శ్రీరాం వంటి అధిక డిమాండ్ ఉన్న సన్నబియ్యం రకాలను మిల్లింగ్ చేసి విక్రయించాలని డిసైడ్ అయ్యారు. ప్రస్తుతం ఈ రకం బియ్యాన్ని పౌరసరఫరాల సంస్థ ప్రత్యేకంగా నిల్వ చేసింది.వానాకాలం, యాసంగి సీజన్లలో తెలంగాణలోని కొనుగోలు కేంద్రాలకు భారీ మొత్తంలో సన్నధాన్యం చేరింది. యాసంగి పంటతో పోలిస్తే వానాకాలం పంటలో నూకలు తక్కువగా వస్తాయి. దీంతో బియ్యం నాణ్యత మెరుగ్గా ఉంటుంది. ఈ కారణంగానే వానాకాలం వడ్లతో వచ్చిన బియ్యాన్నే 'తెలంగాణ బ్రాండ్' పేరుతో విక్రయించనున్నట్లు పౌరసరఫరాల శాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్ తెలిపారు. ఇది రైతులకు మంచి మద్దతు ధర లభించడానికి, అధిక దిగుబడికి ప్రోత్సాహం అందిస్తుందని అధికారులు భావిస్తున్నారు.తెలంగాణ బ్రాండ్ బియ్యాన్ని కేవలం సూపర్మార్కెట్లు, కిరాణా దుకాణాల్లో మాత్రమే కాకుండా.. రాష్ట్రంలోని రేషన్ షాపుల్లోనూ విక్రయించనున్నారు. ప్రస్తుతం ఆహార భద్రత కార్డు (తెల్లకార్డు) ఉన్నవారికి ఉచితంగా బియ్యం పంపిణీ చేస్తున్నారు. దారిద్ర్యరేఖకు ఎగువన ఉన్నవారికి త్వరలో కార్డులు ఇవ్వనున్నట్లు ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించింది. ఈ ఏపీఎల్ కార్డుదారులు తమకు అవసరమైన 'తెలంగాణ బ్రాండ్' బియ్యాన్ని రేషన్ దుకాణాల ద్వారా మార్కెట్ ధరతో పోలిస్తే కాస్త తక్కువకే కొనుగోలు చేసేందుకు వీలు కల్పించనున్నారు. ఇది పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని మధ్యతరగతి ప్రజలకు నాణ్యమైన బియ్యాన్ని అందుబాటు ధరలో పొందడానికి సహాయపడుతుందని అధికారులు భావిస్తున్నారు.'తెలంగాణ బ్రాండ్' పేరుతో విక్రయించే బియ్యానికి ధర ఎంత నిర్ణయించాలన్న విషయంపై అధికారులు ఇప్పటికే కసరత్తు ప్రారంభించారు. ప్రస్తుతం మార్కెట్లో ఉన్న వివిధ సన్నబియ్యం ధరలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. భారత ఆహార సంస్థ (ఈఅఎ)కి ధాన్యాన్ని విక్రయిస్తే డబ్బులు రావడానికి కనీసం ఆరు నెలల నుంచి ఏడాది వరకు సమయం పడుతుంది. కానీ తెలంగాణ బ్రాండ్తో బియ్యాన్ని నేరుగా విక్రయించడం ద్వారా త్వరగా ఆదాయం పొందవచ్చని ఉన్నతాధికారులు అంచనా వేస్తున్నారు. అంతేకాకుండా ఇతర రాష్ట్రాల్లోనూ ఈ బియ్యాన్ని విక్రయించేందుకు పౌరసరఫరాల శాఖ విస్తృత ప్రణాళికలను సిద్ధం చేస్తోంది. ఇది తెలంగాణ బ్రాండ్కు దేశవ్యాప్తంగా గుర్తింపు తీసుకురావడంతో పాటు, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు కూడా బలం చేకూరుస్తుందని అధికారులు భావిస్తున్నారు.

## కోడెలను వ్యవసాయ అవసరాలకే వినియోగించాలి. కలెక్టర్ సందీప్ కుమార్ ఝు.

## తిప్పాపూర్ గోశాలలో కోడెల 100 జతలు పంపిణీ.





వేములవాడ టౌన్,( ప్రజాబలం ), దక్షిణ కాశీగా ప్రసిద్ధి పొందిన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి గోశాలలో పంపిణీ చేసే కోడెలను వ్యవసాయ అవసరాలకు మాత్రమే ఉపయోగించాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝు సూచించారు.

సోమవారం రోజున సాయంత్రం వేములవాడ శ్రీ రాజరాజస్వామి దేవస్థానానికి సంబంధించిన తిప్పాపూర్ లోని గోశాలలో దరఖాస్తు చేసుకున్న రైతులకు 100 జతల కోడెలను 200 జీవాలను అధికారులు రైతులకు పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గోశాల నుంచి పంపిణీ చేసే కోడెలను కేవలం వ్యవసాయ అవసరాలకు మాత్రమే ఉపయోగించాలని స్పష్టం చేశారు. వాటిని పక్కదారి పట్టిస్తే కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కోడెల సంరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, వ్యవసాయ విస్తరణ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ కోడెల స్థితిగతులపై ఆరా తీస్తారని తెలిపారు. కోడెలను పొందిన రైతులు వాటి సంరక్షణ బాధ్యతను పక్కగా చూడాలని సూచించారు. వాటిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి సంరక్షించాలని కలెక్టర్ పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో వినోద్ రెడ్డి జిల్లా వ్యవసాయ అధికారి అబ్జల్ బేగం, పశువైద్యాధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# స్కూళ్లు బాగు చేయండి....

అదిలాబాద్, జూన్ 9, ర్కారు బడిలో భద్రత కరువుతుంది. ప్రభుత్వ విద్యను అందించేందుకు ప్రభుత్వ పాఠశాల భవనాలను నిర్మించిన ప్రభుత్వం ఏళ్ల తరబడి వాటి నిర్వహణను విస్మరించడంతో శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. దీంతో పా త భవనాలు ఎప్పుడు కూలుతాయో నన్న భయం విద్యార్థులు తల్లిదండ్రులకు ఉపాధ్యాయులకు కంటిమీద కొనుక్కు లేకుండా చేస్తోంది.పేరుకి ప్రభుత్వ పాఠశాల అయినప్పటికీ అందులో పిల్లలు చదువుకోవడానికి నిర్మించిన భవనాలు గోడలకు రంగులు వెలిసిపోవడం పగుళ్లు తీరడం స్లాబుపై రంధ్రా లు పడి వర్షాలు కురిస్తే క్లాస్ రూముల్లో కురిసే బదులు సైతం ఉన్నాయని విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు. జిల్లాలో మొత్తం 723 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా 300 పైగా ప్రభుత్వ పాఠశాలలో ఎన్నో సంవత్సరాల క్రితం నిర్మించినవేనని విద్యాశాఖ అధి కారులు తెలిపారు. కుబీర్ మండలంలోని అంతర్నీ గ్రామం లో శుక్రవారం ప్రాథమిక పాఠశాల పాత భవనం ఒక్కసారిగా కుప్పకూలిపోయింది. ఈ భవనం 30 ఏళ్ల క్రింద నిర్మించగా వర్షాలకు భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరు కోవడం గోడలకు రంధ్రాలు ఏర్పాటుతో ఇటీవల కురిసిన వర్షాలకు తడి ఎక్కువై ఒక్కసారిగా కూలిపోయింది. ఆ సమయంలో అక్కడ పిల్లలు ఉపాధ్యాయులు లేక పెను ప్రమాదం తప్పింది.సాయికుమార్ ప్రసాద్ ఇద్దరు పిల్లలు పాత భవనం వరండాలో ఆడుకోవడం వల్ల ఆ ప్రాంతంలో స్లాబు కూలక లోపలి భాగం కూలగా వరండాలోని స్లాబు పెచ్చులు పిల్లలపై పడడంతో ఇద్దరికీ గాయాలైన సంగతి తెలిసింది. నిర్మల్ పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాల భవనం కూడా శిథిలావస్థకు చేరుకోగా వర్షం కురిస్తే క్లాస్ రూమ్లో నీరు వస్తుందని స్లాబు పెచ్చులు కూలిపోతున్నాయని విద్యార్థులు తెలిపారు.కుబీర్ గొల్లమోడా దిల్వార్పూర్ లక్ష్మణ్ చందా సారంగాపూర్ బాసర ముథో ల్ తానూర్ కుంటాల తదితర మండలాల్లో కూడా వివిధ పాఠశాలలో పాఠశాల పురాతన భవనాలు శిథిలావస్థకు చేరుకొని ఎప్పు డు కూలుతాయో.. అన్న భయం నెలకొంది. వానకా లం ప్రారంభకోడదు భారీగా వర్షాలు కురిస్తే భవనాల భద్రత దృశ్య పిల్లలను మరో గదిలోకి షిఫ్ట్ చేయడం లేదా పాఠశాలకు సెల వు ప్రకటించే పాఠశాలను కూడా జిల్లాలో ఉన్నట్టు విద్యావంతులు తెలిపారు.జిల్లాలో మన ఊరు మనబడి అమ్మ పాఠశాల కింద కొన్ని బడులను మెరుగుపరిచినప్పటికీ కొన్ని బడులు ఇప్పటికీ పాత భవనంలోనే క్లాసుల నిర్వహణ చేపడుతున్నారు. కొన్ని పాఠశాలలో పాత భవనాలకు రంధ్రాలు పగుళ్లు ఏర్పడి పాములు తేళ్లు పాఠశాలలో కనిపిస్తున్నాయి. మరుగుదొడ్లు మూత్రశాల లు ఉన్న నిర్మాణ లేక దుర్గంధం వెదజల్లుతోంది. పాఠశాలలో ప్రహరీ కూడా లేకపో వడంతో రక్షణ కరువు అవుతుంది.పాఠశాలలో అటెండర్లు కొన్ని పాఠశాలలో ఉన్న దినసరి అటెండర్గా విధులు నిర్వహిస్తున్న వారిని ప్రభుత్వం తొలగించింది. పాఠశాలలో పిచ్చి మొక్కలు పెరిగి క్రిమి కీటకాలు చేరుతున్నాయి. కిటికీలు తలుపులు ధ్వంసం పాఠశాల రికార్డులకు భద్రత లేని పాఠశాలలో కూడా ఉన్నాయని విద్యావంతులు పేర్కొంటున్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థుల్లో 90 శాతం ఎస్సీ, ఎస్టీ బీసీ మైనార్టీ పేద వర్గాల పిల్లలే కావడంతో అనుకోని ప్రమాదం జరిగి ఏదైనా ఘటన జరిగితే ఆ కుటుంబాల పరిస్థితి ఏం కావాలని విద్యావేత్తలు సూటిగా ప్రశ్నిస్తున్నారు. నిర్మల్ జిల్లా వ్యాప్తంగా వివిధ ప్రాంతా ల్లో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో శిథిలావస్థకు చేరుకున్న ప్రభుత్వ పాఠశాల భవనాలను వెంటనే కూల్చివేయాలని జిల్లా కలెక్టర్ అధికారులకు ఆదేశాలు ఇవ్వడం జరిగింది. రెం డు రోజుల క్రితం కుబీర్ మండలంలోని అం తర్నీ పాఠశాల స్లాబు భవనం కుప్పకూలడం ఇద్దరు పిల్లలు గాయాలతో బయటపడ్డారు. తరగతులు నిర్వహిస్తున్నప్పుడు ఆ భవనం కూలితే పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించడానికి కష్టంగా ఉంది.ఈ ఘటనను ప్రభు త్వం సీరియస్గా తీసుకొని అంతర్నీ పాఠశాల భవనాన్ని పూర్తిగా జెసిబిల సాయంతో కూల్చివేశారు. అదేవిధంగా జిల్లాలోని 19 మండలాల్లో నిర్మల్ భైంసా ఖానాపూర్ పట్టణాల్లో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో శిథిలావస్థకు చేరుకుని తరగతి గదులు నిర్వ హిస్తున్న పాఠశాల వివరాలను 24 గంటల్లోనే నివేదిక రూపంలో అందించాలని జిల్లా కలెక్టర్ విద్యాశాఖ అధికారులను ఆదేశించారు.దీంతో ఆయా పాఠశాల ప్రధా నోపాధ్యాయులు తమ పాఠశాలలో ఉన్న శిథిలావస్థ భవనాల వివరాలు ఫోటోలతో సహా విద్యాశాఖ ఆధ్వర్యంలో నివేదికను అందించారు. జూన్ 12 నుంచి ప్రభుత్వ పాఠశాలలు తిరిగి తెచ్చుకోవడం వానాకా లం సీజన్ ప్రారంభం కావడంతో ఈ సీజన్లో పాత భవనాలు కూలిస్తే తరగతులు నిర్వాణకు ఇబ్బందులు ఏర్పడతాయని కొందరు ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్నారు. అసలే ఆర కోరని వసతుల మధ్య విద్యావ్యవస్థను అమలు చేస్తున్న ప్రభుత్వ ఉపాధ్యా యులకు కొత్త చిక్కులతో వారు మరింత ఇబ్బంది గురిఅయ్యే అవకాశముంది.

శిథిల భవనాలను కూల్చివేస్తాం

నిర్మల్ జిల్లాలోని వివిధ ప్రాంతా ల్లో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో శిథిలావస్థకు చేరుకున్న ప్రభుత్వ పాఠశాల భవనాలను కూల్చివేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. వానాకాలం సీజన్ రావడంతో విద్యార్థుల భద్రత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఇచ్చిన నివేదికల ఆధారంగా ఏఈలు పాత భవనాలను పరిశీలించి ఏఏ భవనా లు కూల్చివేతకు అనుకూలమైన నివేదిక అంటిన వెంటనే వాటిని కూల్చివేయడానికి చర్యలు తీసుకుంటున్నాం. కూల్చివేసిన భవనాల స్థానంలో కొత్త భవనాల నిర్మాణానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపి నిధులు సమకూర్చిన వెంటనే భవనా లు నిర్మిస్తాం. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది కలకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నాం.

– కలెక్టర్ అభిలాష అభినవ్

## విద్యుత్ ప్రమాదంలో లారీ దగ్ధం

## డ్రైవర్ మృతి

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ కొత్తపేట మండలం కండ్రిగ గ్రామంలో లారీ దగ్ధమైంది. విద్యుత్ తీగ తగలడంతో లారీ కాలిపోయింది. రావులపాలెం – అమలాపురం ప్రధాన రహదారిలో కండ్రిగ వద్ద ఈ ప్రమాదం జరిగింది. డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందాడు.

# ప్రాంతాలు, కుల,మతాల మధ్య విభేదాలు సృష్టించేందుకు కుట్ర

### అడుగడుగునా మహిళలను అవమానిస్తున్నారు
### ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకుంటాం
### వైసీపీ దుష్ప్రచారాలను తిప్పికొట్టాల్సిన బాధ్యత అందరిపై ఉంది
### జులై 1 నుంచి గడపగడపకు వెళ్లి కూటమి ప్రభుత్వ సంక్షేమం, అభివృద్ధిని వివరించాలి
### నిరంతరం కష్టపడి ప్రజలకు అందుబాటులో ఉండాలి
### పార్వతీపురం నియోజకవర్గ టీడీపీ నేతలు, కార్యకర్తలతో సమన్వయ సమావేశంలో మంత్రి లోకేష్ దిశానిర్దేశం





పార్వతీపురం: ప్రాంతాలు, కుల, మతాల మధ్య విభేదాలు సృష్టించేందుకు ప్రతిపక్షం కుట్ర పన్నుతోందని, నిరంతరం అప్రమత్తంగా ఉండాలని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పిలుపునిచ్చారు. పార్వతీపురం మండలం చినబొండపల్లిలో నియోజకవర్గ టీడీపీ నేతలు, కార్యకర్తలతో నిర్వహించిన సమన్వయ సమావేశంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ.. మన సమస్యలు మనమే పరిష్కరించుకుందాం. ఈ రోజు చాలా వింత పరిస్థితి. దారిపొడవునా ఎక్కడ చూసినా పోలీసులే. యువగళంలో పోలీసులు అడుగడుగునా అడ్డుకున్నారు. ఆనాడు అడ్డుకున్న పోలీసులే నేడు సెల్యూట్ చేస్తున్నారు. అదీ ప్రజాతీర్పు. ప్రతిపక్షంలో ఆనాడు చంద్రబాబు గారు చలో ఆత్మకూరు పిలుపునిస్తే గేట్లకు తాళ్లు కట్టారు. అచ్చెన్నాయుడు, కొల్లు రవీంద్ర వంటి నాయకులపై అక్రమ కేసులు పెట్టి వేధించారు. నాపై 23 కేసులు పెట్టారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు పెట్టారు. యువగళం పాదయాత్రలో మైక్, స్టూల్ లాక్కున్నారు. అయినా బిల్డింగ్ పైకి ఎక్కి మాట్లాడా. ఇప్పుడు మనం అధికారంలో ఉన్నా ప్రతిపక్షం మాదిరిగా వ్యవహరించాలి.

అభివృద్ధి, సంక్షేమం కోసం కూటమికి ప్రజలు పట్టం కట్టారు

నేడు పోలీసు ఎస్కార్ట్ ఉన్నా, చుట్టూ పోలీసులు ఉన్నా ప్రతిపక్ష నేత అసెంబ్లీకి రావడం లేదు. 1985 తర్వాత గెలవని మంగళగిరి నియోజకవర్గాన్ని ఎంచుకున్నా. 2019లో ఓడిపోయాను. కసితో పనిచేసి 2024 ఎన్నికల్లో 91వేల భారీ మెజార్టీతో విజయం సాధించాను. ఉమ్మడి రాష్ట్రంలో ఎన్నడూ రాని మెజార్టీ మంగళగిరిలో వచ్చింది. అహంకారం, అడ్డగోలు అరెస్ట్ లు, బూతులు వద్దని ప్రజలు వైసీపీని తిరస్కరించారు. అభివృద్ధి, సంక్షేమం కోసం కూటమికి ప్రజలు బ్రహ్మరథం పట్టారు. స్థానిక సంస్థల ఎన్నికల సమయంలో తొడగొట్టిన అంజిరెడ్డి తాత, రక్తం కారుతున్నా బూత్ లో చివరి ఓటు వరకు ఎదురొడ్డి నిలిచిన మంజులా రెడ్డి, మెడపై కత్తిపెట్టి వాళ్ల నాయకుడు పేరు చెప్పమన్నా భయపడకుండా జై చంద్రబాబు, జై తెలుగుదేశం అని నినదించిన తోట చంద్రయ్యలే నాకు స్ఫూర్తి. తోట చంద్రయ్య కుమారుడికి ప్రభుత్వం ఉద్యోగం ఇవ్వాలంటే అధికారులు చట్టప్రకారం కుదరదన్నారు. కేబినెట్ లో పెట్టి చట్టాన్ని మార్చి తోట చంద్రయ్య కుమారుడికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాం.

జులై 1 నుంచి గడపగడపకు వెళ్లి కూటమి ప్రభుత్వ సంక్షేమం, అభివృద్ధిని వివరించాలి

నేడు కూటమి ప్రభుత్వంలో వృద్ధులకు రూ.4వేల పెన్షన్, దివ్యాంగులకు రూ.6వేలు, పూర్తిగా మంచానికే పరిమితమైన వారికి రూ.15వేలు చెల్లిస్తున్నాం. దీపం-2 పథకం ద్వారా కోటి మందికి గ్యాస్ సిలిండర్లు అందజేశాం. వచ్చే నెల నుంచి గ్యాస్ సబ్సిడీ నేరుగా బ్యాంక్ అకౌంట్లకే బదిలీ చేస్తాం. సంక్షేమాన్ని దేశానికి పరిచయం చేసింది అన్న ఎన్టీఆర్. వచ్చే నెల తల్లికి వందనం కార్యక్రమం అమలుచేస్తాం. వైసీపీ దుష్ప్రచారాలను తిప్పికొట్టాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉంది. జులై 1 నుంచి గడపగడపకు వెళ్లి కూటమి ప్రభుత్వ సంక్షేమం, అభివృద్ధిని వివరించాలి. నియోజకవర్గ పర్యటనలో ముందుగా కార్యకర్తలను కలుస్తామనే హామీని నిలబెట్టుకున్నాం. టీడీపీ సిద్ధాంతాలను మార్చకుండా మారుతున్న కాలానికి అనుగుణంగా మహానాడులో ఆరు శాసనాలను ప్రకటించడం జరిగింది. తెలుగుజాతి విశ్వఖ్యాతి, యువగళం, స్త్రీశక్తి, పేదల సేవలో సోషల్ రీ ఇంజనీరింగ్, అన్నదాతకు అండగా శాసనాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి.

అడుగడుగునా మహిళలను అవమానిస్తున్నారు

సాక్షి టీవీలో ఇప్పుడు కూడా మహిళలను కించపరిచే విధంగా మాట్లాడారు. ఈ అంశంలో ఒకరిని అరెస్ట్ చేశాం. మరొకరు పారిపోయినా వదిలిపెట్టే ప్రసక్తే లేదు. నాకు చీర, గాజులు పంపిస్తానని గతంలో వైసీపీ మహిళా నేత అన్నారు. శాసనసభ సాక్షిగా నా తల్లిని అవమానించారు. వారు ఇప్పటికీ మారలేదు.

ప్రాంతాలు, కుల, మతాల మధ్య విభేదాలు సృష్టించడానికి కుట్ర

నేతలు, కార్యకర్తలు నిరంతరం కష్టపడి ప్రజలకు అందుబాటులో ఉండాలి. జగన్ రెడ్డి ఐదేళ్లలో తిరగనిది.. చంద్రబాబు గారు 11 నెలల్లోనే తిరిగారు. రాష్ట్రాన్ని సరైన దారిలో పెట్టేందుకు అహర్నిశలు కృషిచేస్తున్నారు. ప్రాంతాల మధ్య, కుల, మతాల మధ్య విభేదాలు సృష్టించేందుకు కుట్ర పన్నుతున్నారు. విశాఖ ఉక్కును కాపాడింది కూటమి ప్రభుత్వం. విశాఖకు టీసీఎస్, గూగుల్ తీసుకువస్తోంది కూటమి ప్రభుత్వమే. రైల్వే జోన్ ఏర్పాటుచేసింది కూటమి ప్రభుత్వమే. డబుల్ ఇంజన్ సర్కార్ వల్లే ఇది సాధ్యమైంది. మిత్రధర్మం పాటించాలి. అందరూ కలిసికట్టుగా పనిచేయాలి.

పార్వతీపురంలో రౌడీల ఆగడాలకు ఫుల్ స్టాప్ పెడతాం

పార్వతీపురంలో రౌడీల ఆగడాలకు మూడు వారాల్లో ఫుల్ స్టాప్ పెట్టే బాధ్యత నాది. అధికారుల్లో ఇంకా మార్పు రాలేదని అంటున్నారు. కార్యకర్తలపై నమోదు చేసిన అక్రమ కేసుల్లో సగానికి పైగా ఎత్తివేయడం జరిగింది. ఈ ఏడాది చివరి నాటికి అక్రమ కేసులు మొత్తం ఎత్తివేస్తాం. మీ భవిష్యత్-నా బాధ్యత. పెండింగ్ బిల్లులు త్వరలోనే చెల్లిస్తాం.

మాది కక్షసాధింపు కాదు

రెడ్ బుక్ చూస్తేనే ఒకరికి గుండెపోటు వచ్చింది. మరొకరు టాయిలెట్ లో జారిపడ్డారు. ఒకరేమో బెంగుళూరుకు పరారయ్యారు. మాది కక్షసాధింపు కాదు. చట్టాన్ని ఉల్లంఘించి ప్రజలను, కార్యకర్తలను ఇబ్బందిపెట్టిన వారిని చట్టపరిధిలో శిక్షిస్తాం. ఒకరికి నల్లజుట్టు కాస్తా తెల్లదైంది. అర్థమైందా..రాజా! ఎవరూ అహంకారంతో వ్యవహరించవద్దు. ఎంత ఎదిగితే అంత ఒదిగి ఉండాలి. టీడీపీ అంటేనే ప్రజల్లో ఒక నమ్మకం ఉంది.

జవాన్లు ఎక్కడ కనిపించినా సెల్యూట్ చేయాలి

పహల్గాంలో అమాయక ప్రజలను ఉగ్రవాదులు కాల్చిచంపారు. 2004 నుంచి 2014 వరకు దేశంపై 25 వరకు ఉగ్రదాడులు జరిగాయి. మోదీ వచ్చిన తర్వాత ధీటైన సమాధానం చెబుతున్నారు. మనం క్షేమంగా ఉంటున్నామంటే సరిహద్దుల్లో సైనికుల త్యాగాల వల్లే. మురళీ నాయక్ ఆ కుటుంబానికి ఒకే ఒక బిడ్డ. ఇంటి దగ్గరే ఉండాలని కోరినా వినలేదు. తాను చనిపోతే దేశం మొత్తం కదిలివస్తుందని చెప్పాడు. మొన్న దాడులు జరుగుతున్న సమయంలో కూడా మిత్రుడికి మెసేజ్ పెట్టాడు. తల్లిదండ్రులు ధైర్యంగా ఉండాలని చెప్పాడు. జవాన్లు ఎక్కడున్నా అండగా నిలవాలి. ఉగ్రవాదానికి ఫుల్ స్టాప్ పెట్టాలంటే మనం ఐక్యంగా ఉండాలి. ప్రధానికి అండగా నిలుద్దాం. జవాన్లు ఎక్కడ కనిపించినా వారికి సెల్యూట్ చేయాలన్నారు. జోహార్ మురళీ నాయక్, వందేమాతరం అంటూ మంత్రితో పాటు అందరూ నినదించారు.

# జియోసైన్సెస్ లో భవిష్యత్తు గమనానికి భారత్ బాటలు

### హైదరాబాద్ లోని జీఎస్ఐలో 'నెక్స్ట్ జనరేషన్ జియోఫిజిక్స్ 2025' సదస్సును ప్రారంభించిన కేంద్రమంత్రి కిషన్ రెడ్డి







హైదరాబాద్, 9 జూన్,2025: హైదరాబాద్ బండ్లగూడ-నాగోల్ లోని జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా ట్రైనింగ్ ఇన్ స్టిట్యూట్ (జీఎస్ ఐటీఐటీఐ)లో 'నెక్స్ట్ జనరేషన్ జియోఫిజిక్స్ 2025: అన్ లాక్ ఎర్త్ హిడెన్ ట్రెజర్స్ ' సదస్సును కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి ఈరోజు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మల్కాజిగిరి పార్లమెంటు సభ్యుడు ఈటల రాజేందర్ కూడా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడుతూ, ఖనిజ అన్వేషణలో శాస్త్ర, సుస్థిరత, సాంకేతిక పరిజ్ఞానం కీలక పాత్ర పోషించే కొత్త శకంలోకి భారత్ ప్రవేశిస్తోందని అన్నారు. వాతావరణ మార్పులు, పట్టణీకరణ, విపత్తుల నివారణ వంటి సవాళ్లను ఎదుర్కోవడానికి వినూత్న సాధనాలను అందించడం ద్వారా వికసిత భారత్ లక్ష్యాలను సాధించడంలో భూభౌతికశాస్త్రం పాత్ర కీలకమని ఆయన పేర్కొన్నారు.

జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా (జీఎస్ ఐ) తన 175వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని సరైన సమయంలో ఈ సదస్సును నిర్వహించడం అభినందనీయమని మంత్రి కొనియాడారు. సహజ వనరుల శాస్త్రీయ అన్వేషణలో భారత్ దీర్ఘకాలిక నిబద్ధతకు ఈ మైలురాయిని ఆయన ఒక నిదర్శనంగా అభివర్ణించారు.

కొండచరియలు విరిగిపడడాన్ని ముందుగా సూచించే జాతీయ కేంద్రం ఏర్పాటు, విపత్తు సంసిద్ధతను మెరుగుపరచడానికి ఇటలీతో ఇటీవలి అవగాహన ఒప్పందం (ఎంఓయు) సహా భారత్ సాధించిన ప్రధాన పురోగతుల్ని కిషన్ రెడ్డి వివరించారు.

పర్యవేక్షణ వ్యవస్థలను విస్తరించాలని, ముందస్తు హెచ్చరికలకు సంబంధించి అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అనుసరించాలని ఆయన పిలుపునిచ్చారు.

ప్రపంచ విద్య, పరిశోధనల్లో పెరుగుతున్న భారత్ ప్రాబల్యాన్ని మంత్రి ప్రస్తావించారు, క్యూఎస్ వరల్డ్ యూనివర్సిటీ ర్యాంకింగ్స్ 2025 లో భారతీయ సంస్థల పెరుగుదల 318% ఉన్నట్టు పేర్కొన్నారు. ఐఐటీ సీట్లను రెట్టింపు చేయడం, అనుసంధాన్ నేషనల్ రీసెర్చ్ ఫౌండేషన్ (ఏఎన్ఆర్ఎఫ్) ను ఏర్పాటు చేయడం సైన్స్ అభివృద్ధి పట్ల ప్రభుత్వ నిబద్ధతకు ఉదాహరణలుగా ఆయన పేర్కొన్నారు.

నిక్షిప్త ఖనిజ వనరులను అంచనా వేయడం, భూకంప సమాచారాన్ని మరింత కచ్చితత్వంతో వివరించడం సహా మెరుగైన అన్వేషణ కోసం కృత్రిమ మేధ (ఏఐ), క్వాంటమ్ కంప్యూటింగ్ వంటి అభివృద్ధి చెందుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని కిషన్ రెడ్డి జియో సైంటిస్టులను కోరారు. రూ.10,300 కోట్లతో చేపట్టిన ఇండియా ఏఐ మిషన్, రూ.6,000 కోట్లతో చేపట్టిన నేషనల్ క్వాంటమ్ మిషన్ వంటి ప్రతిష్టాత్మక కార్యక్రమాల గురించి ఆయన ప్రముఖంగా పేర్కొన్నారు.

కీలక ఖనిజాల వ్యూహాత్మక ప్రాముఖ్యతను వివరిస్తూ, కృత్రిమ మేధ ఆధారిత, శుభ్రమైన, సమర్థవంతమైన అన్వేషణ పద్ధతుల ద్వారా లిథియం, కోబాల్ట్ వంటి కీలక ఖనిజాల దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించుకోవడాన్ని బట్టి భారత ఆర్థిక భవిష్యత్తు ఆధారపడి ఉందని కేంద్ర మంత్రి పేర్కొన్నారు.

ప్రభుత్వం, విద్యాసంస్థలు , పరిశ్రమల మధ్య బలమైన భాగస్వామ్యాల కోసం సహకారం, సుస్థిరతతో పాటు నూతన ఆవిష్కరణల ఆవశ్యకతను ఆయన స్పష్టం చేశారు. ఇందుకోసం మినరల్ ఎక్స్ ప్లోరేషన్ హ్యాకథాన్ ను ఒక విజయవంతమైన నమూనాగా ఉదహరించారు. అలాగే స్థానిక సముదాయాలకు లాభదాయకంగా ఉండేలా, పర్యావరణాన్ని పరిరక్షించేలా బాధ్యతాయుతమైన గనుల తవ్వకం విధానాల ప్రాముఖ్యతను కూడా ఆయన స్పష్టం చేశారు.

***పార్లమెంటు సభ్యుడు ఈటల రాజేందర్ ప్రసంగిస్తూ,*** "జియోసైన్స్ ఒక మార్పు దశలోకి ప్రవేశిస్తోంది. ఇక్కడ సంప్రదాయ పద్ధతులు కృత్రిమ మేధ ఆధారిత అంచనా నమూనాలు, క్వాంటమ్ సెన్సింగ్, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాలతో కలిసి వనరుల అన్వేషణలో విప్లవాత్మక మార్పులు తీసుకురావడానికి, భవిష్యత్తుకు సిద్ధంగా ఉన్న వికసిత భారత్ నిర్మాణానికి దోహదం చేస్తాయి" అని అన్నారు. ఖనిజ భద్రత, పర్యావరణ సుస్థిరత, ప్రకృతి వైపరీత్యాల సన్నద్ధతకు సంబంధించిన సవాళ్లను పరిష్కరించడంలో జియోసైంటిఫిక్ పరిశోధన కీలక పాత్రను ఆయన వివరించారు. భూ ప్రమాదాల అంచనాలు, ఖనిజ అన్వేషణలో జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా (జీఎస్ ఐ) కృత్రిమ మేధను, మెషీన్ లెర్నింగ్ ను వినియోగించడాన్ని ప్రశంసించిన రాజేందర్, డేటా ఆధారిత అన్వేషణ, సుస్థిర వనరుల నిర్వహణలో భారత్ ప్రపంచ అగ్రగామి కాగలదనే నమ్మకాన్ని వ్యక్తం చేశారు.

కిషన్ రెడ్డి అంతకుముందు ఈటల రాజేందర్ తో కలిసి, జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా (జిఎస్ఐ) లో కొత్తగా ప్రవేశపెట్టిన రెండు హైడ్రోస్టాటిక్ డ్రిల్ రిగ్ లను ప్రారంభించారు, ఇది భారత్ భౌగోళిక శాస్త్ర సామర్థ్యాలలో ఒక ముఖ్యమైన మైలురాయిని సూచిస్తుంది. అత్యాధునిక జియోఫిజికల్ టూల్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత అన్వేషణ నమూనాలతో ఏర్పాటు చేసిన నెక్స్ట్ జనరేషన్ జియోఫిజిక్స్ ఎక్స్ పో పెవిలియన్ ను కూడా కిషన్ రెడ్డి ప్రారంభించారు. కీలకమైన ఖనిజ వనరుల సుస్థిర అభివృద్ధి కోసం భారతదేశ దార్శనికతకు మద్దతు ఇచ్చే అగ్రగామి సాంకేతిక పరిజ్ఞాన నమూనాలపై లైవ్ ప్రదర్శనలను కూడా ఈ పెవిలియన్లో ఏర్పాటు చేశారు.

రెండు రోజుల పాటు జరిగే ఈ సదస్సులో భారత్ తో పాటు ఆస్ట్రేలియా, కెనడా, రష్యా, అమెరికా, పోలాండ్, మలేషియా, సింగపూర్ దేశాలకు చెందిన ప్రముఖ జియో సైంటిస్టులు, పరిశోధకులు, పారిశ్రామిక దిగ్గజాలు పాల్గొంటున్నారు.. అధునాతన జియోఫిజికల్ టెక్నాలజీలు, ఏఐ/ఎంఎల్ ఇంటిగ్రేటెడ్ ఎక్స్ ప్లోరేషన్ మోడల్స్, హై రిజల్యూషన్ సబ్ సర్ఫేస్ ఇమేజింగ్, డేటా ఆధారిత ఖనిజ అన్వేషణ లక్ష్యాల నిర్దేశంపై సదస్సులో ప్రధానంగా చర్చిస్తున్నారు.

జీఎస్ఐటీఐ మిషన్-5 (ట్రైనింగ్ అండ్ కెపాసిటీ బిల్డింగ్) డిప్యూటీ డైరెక్టర్ జనరల్, హెడ్ డాక్టర్ ఎస్.రవి, జిఎస్ఐ డైరెక్టర్ జనరల్ అసిత్ సాహా, జిఎస్ఐ (దక్షిణ ప్రాంతం) అదనపు డైరెక్టర్ జనరల్ ఎస్.డి.పట్నాజే, సీనియర్ అధికారులు, అంతర్జాతీయ ప్రతినిధులు, ప్రముఖ భౌగోళిక శాస్త్ర నిపుణులు కూడా ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

## ఇండియా సిమెంట్ ఫ్యాక్టరీ దగ్గర ఉద్రిక్తత

కడప జిల్లా యర్రగుంట్ల మండలంలోని ఇండియా సిమెంట్ లిమిటెడ్ ఫ్యాక్టరీ వద్ద ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. ఇండియా సిమెంట్ లో పనిచేస్తున్న జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి వర్గీయులు కొందరు తమ సమస్యలు పరిష్కారం కోసం గత ఐదు రోజులుగా సమ్మె బాట చేపట్టారు. ఈరోజు తమకు వ్యతిరకమైన వర్గీయులుతో పాటు మేనేజ్మెంట్ స్టాఫ్ ఫ్యాక్టరిలోకి వెళ్లాలని చూడడంతో ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి వర్గీయులు అడ్డుకున్నారు. దీంతో ఇరు వర్గాల మధ్య తోపులాట చోటు చేసుకుంది. తమ సమస్యలు పరిష్కారం అయ్యేంత వరకు సిమెంట్ ఫ్యాక్టరీలోకి ఎవరిని లోపలికి పంపించమని ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి వర్గీయులు తేల్చి చెప్పారు.

## మదనపల్లెలో 500కు పైగా గోవుల హత్య

మదనపల్లె ఆరోగ్య వరం కేంద్రంగా 500కు పైగా గోవులను హత్య చేశారని బీజెపి నేత నారదరెడ్డి ఆరోపించారు. సిటిఎం రోడ్డులోని ఆరోగ్యవరం వద్ద ఉండే ఓ కోళ్ల ఫారంలో ఆదివారం గోవులను వధిస్తుండగావెళ్లి అడ్డుకున్నట్లు తెలిపారు. ఇక్కడ వాతావరణం చూస్తే 500కు పైగా గోవులను దారుణంగా హత్య చేశారన్నారు. మనం భారతదేశంలో ఉన్నామా..? అనే సందేహం. త్వరలో మదనపల్లికి బాంగ్లాదేశ్ పరిస్థితి దాపురించ నుందని హిందువులు మేల్కోవాలి అన్నారు . అధికారులు పీస్ కమిటీ సమావేశంలో గోవధ చేయరాదని, ప్రభుత్వ ఉత్తర్వులు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరికలు ఏమయ్యాయని గో సంరక్షణ సమితి, విహెచ్పి, బిజెపి నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు

# మోదీ 11 ఏళ్ల పాలనలో ప్రచారం మాత్రమే ఉంది - - మోదీ సర్కార్- 2047 గురించి కలలు కంటోంది':రాహుల్ గాంధీ

## మోదీ ప్రభుత్వం దేశ ప్రజాస్వామ్యం, ఆర్థిక వ్యవస్థ, సామాజిక వ్యవస్థను తీవ్రంగా దెబ్బ కొట్టింది :కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే





న్యూఢిల్లీ, జూన్ 9(భారత్ సమాచార్)కేంద్ర ప్రభుత్వంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మండిపడ్డారు. మోదీ సర్కార్ 11ఏళ్ల పాలనలో ఎటువంటి జవాబుదారీతనం లేదని, ప్రచారం మాత్రమే ఉందని ఆరోపించారు. ప్రస్తుతం గురించి మాట్లాడటం మానేసి, ఇప్పుడు 2047 కలలు కంటోందని ఆరోపించారు. మహారాష్ట్రలోని ఠాణెలో రద్దీగా ఉన్న లోకల్ రైలు నుంచి జారిపడి నలుగురు మరణించడం, ఆరుగురు గాయపడడంపై రాహుల్ ఎక్స్ వేదికగా స్పందించారు. ఈ క్రమంలో కేంద్రం తీరుపై విమర్శనాస్త్రాలు సంధించారు.

'రైల్వేలు అందుకు చిహ్నంగా మారాయి'మోదీ ప్రభుత్వం 11ఏళ్ల పాలన సంబరాలు జరుపుకుంటుండగా, ముంబయి నుంచి వస్తున్న విషాద వార్త దేశ వాస్తవికత ప్రతిబింబిస్తుంది. రైలు నుండి పడి అనేక మంది మరణించారు. భారతీయ రైల్వేలు కోట్లాది మంది జీవితాలకు వెన్నెముక. కానీ నేడు అభద్రత, రద్దీ, గందరగోళానికి చిహ్నంగా మారింది. మోదీ సర్కార్ 11 ఏళ్ల పాలనలో జవాబుదారీతనం, మార్పు లేదు. ప్రచారం మాత్రమే ఉంది. 2025 గురించి మాట్లాడటం మానేసి, 2047 గురించి మాట్లాడుతోంది. ఠాణె రైలు ప్రమాద మృతుల కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను. గాయపడినవారు త్వరగా కోలుకోవాలి." అని ఎక్స్ పోస్ట్ లో పేర్కొన్నారు.

కేంద్రంపై మండిపడ్డ కాంగ్రెస్ చీఫ్ ఖర్గే,గత 11ఏళ్లలో మోదీ ప్రభుత్వం దేశ ప్రజాస్వామ్యం, ఆర్థిక వ్యవస్థ, సామాజిక వ్యవస్థను తీవ్రంగా దెబ్బ కొట్టిందని కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే ఆరోపించారు. అలాగే రాజ్యాంగంలోని ప్రతి పేజీలో నియంతృత్వ సిరాను మాత్రమే పూసిందని విమర్శించారు. ఈ మేరకు ఎక్స్ పోస్ట్ లో సర్కార్ పై మండిపడ్డారు."దేశంలోని అన్ని రాజ్యాంగబద్ధమైన సంస్థలను బీజేపీ, ఆర్ఎస్ఎస్?లు బలహీనపరిచి, వాటి స్వయంప్రతిపత్తిపై దాడి చేశాయి. ప్రజాభిప్రాయానికి వ్యతిరేకంగా వెళ్లి ప్రభుత్వాలను కూల్చేసిన పార్టీ బీజేపీ. గత 11 ఏళ్లలో రాష్ట్రాల హక్కులను కాషాయ పార్టీ విస్మరించింది. అలాగే సమాఖ్య నిర్మాణం బలహీనపడింది. ద్వేషం, బెదిరింపులు, భయానక వాతావరణాన్ని వ్యాప్తి చేయడానికి నిరంతరం ప్రయత్నాలు జరుగుతున్నాయి."వారి హక్కులను హరించేందుకు కుట్ర'గత 11 ఏళ్లలో దేశంలో ఎస్?సీ, ఎస్?టీ, ఓబీసీలు, మైనార్టీలు, బలహీన వర్గాలపై దోపిడీ పెరిగిందని ఆరోపించారు. వారి రిజర్వేషన్లు, సమాన హక్కులను హరించే కుట్ర జరుగుతోందని విమర్శించారు. మణిపుర్ లో కొనసాగుతున్న హింస బీజేపీ పరిపాలనా వైఫల్యానికి అతిపెద్ద సాక్ష్యమన్నారు. యూపీఏ హయాంలో సగటున 8 శాతంగా ఉన్న దేశ జీడీపీ వృద్ధి రేటును 5-6 శాతం వద్ద ఉంచడం బీజేపీ, ఆర్ఎస్ఎస్?లు అలవాటుగా మార్చుకున్నాయని మండిపడ్డారు.

"ఏటా 2 కోట్ల ఉద్యోగాల హామీని నెరవేర్చడానికి బదులుగా, యువత నుంచి ఏటా కోట్లాది ఉద్యోగాలు లాక్కుంటున్నారు. ద్రవ్యోల్బణం కారణంగా ప్రజా పొదుపులు 50ఏళ్లలో అత్యల్ప స్థాయికి చేరుకున్నాయి. ఆర్థిక అసమానతలు గత 100 ఏళ్లలో అత్యధికంగా ఉన్నాయి. నోట్ల రద్దు, జీఎస్?టీ, ప్రణాళిక లేని లాక్ డౌన్ అసంఘటిత రంగాన్ని దెబ్బతీశాయి. కోట్లాది మంది ప్రజల భవిష్యత్తును నాశనం చేశాయి. మేక్ ఇన్ ఇండియా, స్టార్టప్ ఇండియా, స్టాండ్ అప్ ఇండియా, డిజిటల్ ఇండియా, నమామి గంగే, 100 స్మార్ట్ సిటీలు వంటి కార్యక్రమాలు విఫలమయ్యాయి. భారతీయ రైల్వే నాశనమైంది. కాంగ్రెస్ (యూపీఏ) శ్రమించి నిర్మించిన మౌలిక సదుపాయాల రిబ్బన్లను మాత్రమే కత్తిరిస్తున్నారు." అని విమర్శించారు.



**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి:** ఆదివారం మంత్రివర్యులుగా ప్రమాణ స్వీకారం చేసినటువంటి మక్తల్ శాసనసభ్యులు డాక్టర్ వాకిటి శ్రీహరి ని సోమవారం హైదరాబాద్ వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది..

ఎస్ వినోద్ కుమార్

టిపిసిసి జనరల్ సెక్రెటరీ మహబూబ్ నగర్

# శేరిలింగంపల్లి నియోజకవర్గంలో మహిళా కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం



**శేరిలింగంపల్లి ప్రజాబలం ప్రతినిధి:**సోమవారంనాడు శేరిలింగంపల్లి నియోజకవర్గం లో మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో నియోజకవర్గ ఎగ్జిక్యూటివ్ బాడీ మీటింగ్ జరిగింది.

నియోజకవర్గ అధ్యక్షురాలైన పి.చంద్రిక ప్రసాద్ గౌడ్ ఆధ్వర్యంలో జరిగింది.

ముఖ్య అంశం ఆల్ ఇండియా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలైన ఆల్కలాంబ మరియు తెలంగాణ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు మొగలి సునీత రావు రంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు శ్రీజ్యోతి పామేన ఆదేశాల మేరకు శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని 12 డివిజన్స్ లో మహిళా కాంగ్రెస్ డివిషన్స్, బ్లాక్, మరియు మండల కమిటీలు పూర్తిచేసుకుని ఈరోజు బూత్ కమిటీ బలోపేత దిశగా అడుగులు వేస్తూ మహిళా కాంగ్రెస్ ముందుకు వెళుతూ ఉంది. రానున్న స్థానికసంస్థ ఎన్నికలలో మహిళా కాంగ్రెస్ ఒక ముఖ్య పాత్ర వహించాలని దానికి ప్రతి నెల మొదటి వారంలో జిల్లాస్థాయి ఎగ్జిక్యూటివ్ బాడీ మీటింగ్ తో పాటు నాయకత్వ శిక్షణా తరగతులు వహించనున్నట్లు పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో బ్లాక్ ఏ మరియు బ్లాక్ బి అధ్యక్షురాళ్లు శ్రీదేవి మరియు భాగ్యలక్ష్మి జిల్లా సెక్రెటరీ రాణి డివిజన్ అధ్యక్షురాళ్లు వి.రాజ్యలక్ష్మి, విమల, కే. లక్ష్మి, శ్రీజ్యోతి, సుప్రజా, మరియు కమిటీ సభ్యులైన జి.జ్యోతి, కే. సౌందర్య, వై. నాగలక్ష్మి , కరుణశ్రీ, పద్మ, గాయత్రి, కృష్ణకుమారి, విజయలక్ష్మి, మౌనిక, స్వప్న, సంధ్య పాల్గొన్నారు

# వంటల రాజేశం మృతితో వేములవాడ పట్టణంలో విషాదఛాయలు.



**వేములవాడ టౌన్, ( ప్రజాబలం ),** వేములవాడ పట్టణానికి చెందిన వంటల ( పొలాస ) రాజేశం సోమవారం రోజు సాయంత్రం గుండెపోటుతో మృతి చెందాడు. వేములవాడ పట్టణంలో ఏ కార్యక్రమాలు జరిగినా వంటలు చేసే వ్యక్తిగా గత 25 సంవత్సరాల నుండి గుర్తింపు పొందినాడు.

తెలంగాణ ఉద్యమ సమయంలో దివ్యాంగుడైనప్పటికీ తన వాహనానికి గులాబీ జెండాను కట్టి, తెలంగాణ రాష్ట్రం సిద్ధించే వరకు తెలంగాణ ఉద్యమంలో కీలకంగా వ్యవహరించి, ఎన్నోమార్లు అరెస్టయి, చివరకు 15 రోజులు కరీంనగర్ లో జైలు శిక్ష అనుభవించి తెలంగాణ ఉద్యమ వీరునిగా, వంటల వల్లభునిగా వేములవాడ పట్టణంలో పేరు కొని తెచ్చుకున్నాడు. తెలంగాణ ఉద్యమ సమయంలో మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావుకు, ప్రజా యుద్ధనౌక గద్దర్ అన్నకు, ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థులకు, తన వంటల రుచిని చూపించి హౌరా అనిపించుకున్నాడు. ప్రజాయుద్ధ నౌక గద్దర్ అన్న వేములవాడ ప్రాంతంలో పర్యటిస్తే వంటల రాజేశం చేతి రుచిని ఆస్వాదించేవాడు. చాలా కాలం పాటు టిఆర్ఎస్ పార్టీలో కొనసాగాడు.

వేములవాడ పట్టణంలో ఎంతో సుపరిచితుడు అయిన రాజేశం గుండెపోటుతో మృతి చెందడం పట్ల పలువురు రాజకీయ నాయకులు, స్నేహితులు, సన్నిహితులు అతడి కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. పొలాస రాజేశం కు భార్య, ఇద్దరు కుమారులు కలరు.

# నిరంతరం రాజన్న గోశాలలో కోడెలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నాం.

**కలెక్టర్, ఈవోలు అనునిత్యం పర్యవేక్షిస్తున్నారు.**

**శ్రీ రాజరాజేశ్వర స్వామి వారికి ఎలాంటి కోడెలు సమర్పించాలనే అంశాలపై భక్తులకు కీలక సూచనలు చేసిన వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ అభిలాష్.**

**కోడెలు ఫ్రీగా తీసుకువెళ్లిన రైతులు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి.**



**వేములవాడ టౌన్, ( ప్రజాబలం ),** వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి ఆలయం కు సంబంధించిన తిప్పాపూర్ గోశాలలో రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ, ఈవో వినోద్ రెడ్డి ఆదేశాల మేరకు అనారోగ్యానికి గురి అయిన కోడెలకు ప్రతిరోజు మెరుగైన చికిత్సలు అందిస్తున్నట్లు వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ అభిలాష్ తెలిపారు. కలెక్టర్ ప్రత్యేక చొరవ తీసుకొని వెటర్నరీ వైద్య బృందాన్ని ప్రత్యేకంగా ఏర్పాటు చేసి గోశాలలో కోడెల ఆరోగ్యాన్ని పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు.

వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి గారికి ఎలాంటి కోడెలు సమర్పించాలని అంశాలను వెటర్నరీ వైద్యులు అభిలాష్ తెలిపారు. మొక్కుల రూపంలో స్వామివారికి సమర్పించే కోడెలు ఆరోగ్యంగా ఉన్నవి, లోకల్ వెరైటీస్ మాత్రమే ఇవ్వాలని కోరారు. పాలు మరువని, చిన్న కోడె పిల్లలను ఇవ్వద్దని సూచించారు. రెండు సంవత్సరాల పైబడిన కోడెలను మాత్రమే ఇవ్వాలని అన్నారు. గత కొన్ని రోజులుగా గోశాలలో అనారోగ్యానికి గురి అయిన కోడెలకు వైద్యాన్ని అందిస్తున్నారు.

# సొంతింటి కల సాకారం చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

## వేములవాడ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



**రాజన్న సిరిసిల్ల జిల్లా, జూన్ 9 (ప్రజాబలం ప్రతినిధి)** సొంతింటి కల సాకారం చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష్యమని సిరిసిల్ల పట్టణ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కేకే మహేందర్ రెడ్డి,పేద ప్రజల అవసరాలను గుర్తించి వారి సంక్షేమానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. సిరిసిల్ల మున్సిపాలిటీ పరిధిలోని 6 వ వార్డు ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారులు వెతుకు సౌజన్య, ఆడెపు లత ,కు జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, ప్రభుత్వ ఆది శ్రీనివాస్ చేతుల మీదుగా మంజూరు పత్రాలను అందజేసిన విషయం తెలిసినదే .ఆదివారం రోజున సొంత జాగాలో ఇంటి నిర్మాణం కొరకై భూమి పూజ చేయడం జరిగింది వీరికి కాంగ్రెస్ ప్రభుత్వం 5 లక్షల ఉచిత రుణం మంజూరు చేయడం జరిగింది. పేదవాడి కలను నెరవేర్చడం ప్రధాన లక్ష్యం అన్నారు. ప్రభుత్వం ఎన్నికల హామీ మేరకు అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తుందన్నారు. గత ప్రభుత్వ హయాంలో డబల్ బెడ్ రూమ్ ఇల్లు కలగానే మిగిలిపోయాయని. రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ గుండ్లపెల్లి రామానుజన్, దూడం శ్రీనివాస్, గుండ్లపెల్లి గౌతమ్ , బక్కి వెంకటేశం, మెతుకు వేణు, ఆడెపు భూమేష్ తదితరులు పాల్గొన్నారు

## భూసమస్యల పరిష్కారానికి భూభారతి

## పుల్కల్ మండల తహసిల్దార్ వంశీకృష్ణ





**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి , (జూన్ 09 ప్రజాబలం)** సంగారెడ్డి జిల్లా, అందోల్ నియోజకవర్గం పుల్కల్ మండల పరిధిలో గల, సూర్రెడ్డి ఇటిక్యాల గ్రామంలో ఈరోజు అనగా( 9, 6, 2025) సోమవారం నాడు గ్రామంలో ఏర్పాటు చేసిన, భూభారతి రెవెన్యూ సదస్సులో పుల్కల్ మండల తహసిల్దార్, వంశీకృష్ణ మాట్లాడుతూ, భూభారతి రెవెన్యూ సదస్సు గురించి, గ్రామంలో ఒకరోజు ముందుగ చాటింపు వేయడం జరిగిందని, గ్రామంలో భూసమస్యలు అనగా, పౌతీలు, మిస్సింగ్, సర్వే నంబర్లు,ఎక్సన్స్ కరప్షన్లు, దానికి సంబంధించిన అప్లికేషన్లు తీసుకోబడతాయని, ఈరోజు ఉదయం 9,గంటల నుంచి, సాయంత్రం 5,గంటల వరకు నా టీం మొత్తం ఇక్కడే ఉండి అప్లికేషన్లు తీసుకోబడతాయని తెలిపారు,అలాగే ఈ భూభారతి చట్టంతో, రైతుల భూసమస్యలు పూర్తిగా పరిష్కారం అవుతాయని, భూమి యజమానులకు పూర్తి హక్కులు కల్పించేందుకే రాష్ట్ర ప్రభుత్వం ఈ చట్టాన్ని అమలు చేస్తుందని, తహసిల్దార్ పేర్కొన్నారు, ఇప్పుడు ఈ సదస్సులో దరఖాస్తులు స్వీకరిస్తున్నామని, ఈ రెవెన్యూ సదస్సులో రైతులు, దరఖాస్తు చేసుకున్న భూ సమస్యలపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి, పై అధికారుల సూచన మేరకు పరిష్కరింపబడతాయని తెలిపారు, ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బందితోపాటు, రైతులు గ్రామస్తులు పాల్గొన్నారు....

## అర్జీలకు సకాలంలో పరిష్కారం చూపాలి

## ప్రజావాణి లో కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

## మొత్తం 134 దరఖాస్తుల రాక



**రాజన్న సిరిసిల్ల జిల్లా, జూన్ – 09 (ప్రజా బలం ప్రతినిధి)**ప్రజావాణిలో వచ్చే అర్జీలకు సకాలంలో పరిష్కారం చూపాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియం లో సోమవారం ప్రజావాణి నిర్వహించి, ప్రజల నుంచి దరఖాస్తులను కలెక్టర్ స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అర్జీలు తీసుకుని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. రెవెన్యూ శాఖకు 51, హౌసింగ్ 32, ఏడీ ఎస్ఎల్ ఏ, డీఈఓ కు 7 చొప్పున, డిఆర్డీఓకు 6, జిల్లా సంక్షేమ అధికారి 5, జిల్లా పౌర సరఫరాల అధికారి, ఎస్సీ కార్పొరేషన్, ఉపాధి కల్పన శాఖకు మూడు చొప్పున, సిరిసిల్ల మున్సిపల్, ఎంపీడీఓ బోయినపల్లి కి రెండు చొప్పున ఎస్పీ, ఎస్డీసీ, నీటి పారుదల శాఖ, సెస్, ఎక్సైజ్ శాఖ, మిషన్ భగీరథ, ఎల్డీఎం, ఏడీ హ్యాండ్ లూమ్స్, సీపీఓ కి ఒకటి చొప్పున దరఖాస్తులు మొత్తం 134 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు.ప్రజావాణిలో సిరిసిల్ల ఆర్డీవో వెంకటేశ్వర్లు, డీఆర్డీఓ శేషాద్రి, ఆయా శాఖల ఉన్నతాధికారులు, సిబ్బంది , తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణిలో స్వీకరించిన దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి.

### ప్రజావాణికి 31 ఫిర్యాదులు.

### జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్.



**ములుగు జిల్లా ప్రతినిధి (ప్రజాబలం) 9 జూన్:** ప్రజావాణిలో స్వీకరించిన దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా
కలెక్టర్ దివాకర టి.ఎస్. అధికారులకు సూచించారు.
సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 31 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్ తో పాటు, అదనపు కలెక్టర్లు సి హెచ్ మహేందర్ జి, సంపత్ రావు లకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు.
అర్జీదారుల దరఖాస్తుల లో పేర్కొన్న సమస్యల పై క్షుణ్ణంగా పరిశీలించి, వెంటనే పరిష్కరించుటకు తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు.
ఈ రోజు ప్రజావాణి కార్యక్రమంలో 31 దరఖాస్తులు రాగా అత్యధికంగా గృహ నిర్మాణ శాఖకు 21, భూ సమస్యలు 04, ఇతర శాఖలకు సంబంధించినవి 06 దరఖాస్తుల స్వీకరించగా వాటిని వెంటనే సంబంధిత అధికారులకు బదిలీ చేసి పరిష్కరించాలని ఆదేశించారు.
ఈ కార్యక్రమంలో వివిధ జిల్లా స్థాయి అధికారులు, కలెక్టరేట్ పరిపాలన అధికారి, పర్యవేక్షకులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ఇద్దరు ఎస్ఐ లకు పదోన్నతి

### పదోన్నతి పొందిన ఇన్స్పెక్టర్స్ వెంకట్ రెడ్డి, ప్రసాద్ రావ్ లను అభినందించిన జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ ఐపియస్





**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి జూన్ 09(ప్రజాబలం)**సంగారెడ్డి జిల్లా:సంగారెడ్డి/2012లో పోలీసు శాఖలో సబ్-ఇన్స్పెక్టర్స్ గా నియామకమైన వెంకట్ రెడ్డి ఎస్ఐ, ప్రసాద్ రావ్ ఎస్ఐ లు గడిచిన 13 సంవత్సరాలుగా ఉమ్మడి మెదక్ జిల్లాలో వివిధ పోలీసు స్టేషన్ లలో యస్.హెచ్.ఓ.లుగా విధులు నిర్వహించి, విశిష్ట సేవలందించచారు. సర్వీసులో ఎలాంటి రిమార్క్ లేకుండా అధికారుల మన్ననలు పొందారని, వీరు అందించిన ఉత్తమ సేవలకు గాను ఇన్స్పెక్టర్స్ గా పదోన్నతి కలిస్తూ మల్టీ జోన్- 2 ఐజి వి.సత్యనారాయణ ఐపియస్ ఉత్తర్వులు వెలువరిచారని జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ ఐపియస్ తెలియజేశారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సుధీర్ఘ సర్వీస్ లో ఎలాంటి రిమార్క్ లేకుండా ఇన్స్పెక్టర్స్ గా పదోన్నతి పొందడం అభినందనీయమని, పదోన్నతి పొందిన వెంకట్ రెడ్డి, ప్రసాద్ రావ్ లను ఎస్పీ అభినందించి, ఇన్స్పెక్టర్ ర్యాంక్ చిహ్నంను ధరింపజేసి శుభాకాంక్షలు తెలియజేశారు,పదోన్నతి ద్వారా స్థాయితో పాటు బాధ్యత మరింత పెరుగుతుందని, పెరిగిన బాధ్యతను క్రమశిక్షణతో నిర్వర్తిస్తూ ప్రజలలో పోలీస్ శాఖ పట్ల ఉన్న నమ్మకాన్ని, గౌరవాన్ని మరింతగా పెంచే విధంగా కృషి చేస్తూ సర్వీసులో మరిన్ని ఉత్తమ సేవలను అందించి రాష్ట్ర పోలీసు శాఖకు మంచి పేరు తీసుకురావాలని అన్నారు.

## ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో పాల్గొన్న పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి




**పరకాల నియోజకవర్గ ప్రతినిధి (ప్రజాబలం) జూన్ 9:** సోమవారం సంగెం మండలం మొండ్రాయి గ్రామంలో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట 2025 కార్యక్రమంలో పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి పాల్గొన్నారు. ప్రభుత్వ పాఠశాలలో ఎంతో ఉన్నతమైన విద్యార్హతలు, అనుభవం కలిగిన ఉపాధ్యాయులు ఉన్నారని తెలిపారు.ఇంటింటికి వెళ్లి బడి ఈడు పిల్లల సర్వే నిర్వహించడంతోపాటు, ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలపై తల్లిదండ్రులకు వివరించాలని కోరారు.ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్, మధ్యాహ్న భోజనం, రాగి జావా, యూనిఫార్మ్ అందించటం జరుగుతుందని అన్నారు.ప్రభుత్వ పాఠశాలలో చేర్పించడం ద్వారనే మంచి నాణ్యమైన విద్యా అందుతుందన్నారు. ప్రతీ ఒక్కరు తమ పిల్లలను గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని కోరారు

## దారి తప్పుతున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ లక్ష్యం.

### భూమి లేని వారిని గుర్తించి లబ్ధిదారులుగా ఇండ్లు కేటాయించండి.



**రాజన్న సిరిసిల్ల ప్రతినిధి, బోయినపల్లి, ( ప్రజాబలం ),** తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతో ఉన్నత ఆశయంతో ఇల్లు, ఇంటి స్థలం లేని వారికి ఇందిరమ్మ ఇండ్ల పథకం అమలు చేయాలని సదుద్దేశంతో ప్రవేశ పెట్టిన ఈ పథకాన్ని ఇందిరమ్మ కమిటీ నాయకులు సరియైన లక్ష్యంతో పని చేయడం లేదని, గ్రామాల్లో నిజమైన అర్హులకు చెందాల్సిన ఇందిరమ్మ ఇండ్లను దాదాపు భూమి ఉన్న వారికే, వారికి అనుకూలంగా ఉన్న వారికే ఇందిరమ్మ ఇండ్లకు పేర్లను అర్హులు గా వారు ప్రకటించి అమలు చేస్తున్నారని, నిజమైన లబ్ధిదారులకు చెందడం లేదు అని సిపిఎం నాయకుడు గురజాల శ్రీధర్ ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వ అధికారులు స్పందించి గ్రామసభల ద్వారా నిజమైన అర్హులను గుర్తించి ప్రభుత్వ లక్ష్యానికి చెడ్డ పేరు రాకుండా చూడాల్సిన బాధ్యత అధికార యంత్రాంగం మీద ఉంది కాబట్టి ఆ దిశగా నిజమైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్లు కేటాయించాలని ఈ సందర్భంగా మండల సిపిఎం పార్టీ కన్వీనర్ గురజాల శ్రీధర్ పత్రిక ముఖంగా తెలియజేయడం జరిగింది.

## తెలంగాణ సైకాలజిస్ట్ అసోసియేషన్ సమావేశం ఏర్పాటు




**రాజన్న సిరిసిల్ల జిల్లా, మే 9 (ప్రజాబలం ప్రతినిధి)**రాజన్న సిరిసిల్ల జిల్లాలో పాఠశాల, కళాశాల విద్యార్థుల్లో నైపుణ్యాలు పెంపొందించుకునే విధంగా అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని తెలంగాణ రాష్ట్ర సైకాలజిస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ మోత్కూరి రామచంద్రరావు అన్నారు. ఆయన అధ్యక్షతన హైదరాబాద్లో ఆదివారం ఒక రోజు వర్క్ షాప్ లో భాగంగా “డిస్ట్రిక్ట్ అండ్ స్టేట్ లీడర్స్” సమావేశం నిర్వహించారు. ఇందులో లీడర్షిప్ క్వాలిటీస్, టీం బిల్డింగ్, టిపిఏ రూల్స్ అండ్ రెగ్యులేషన్స్, వాటి ఇంప్లిమెంటేషన్ ఇన్ డిస్ట్రిక్ట్ తదితర అంశాలపై చర్చించారు. తెలంగాణ రాష్ట్ర సైకాలజిస్ట్ కౌన్సిల్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ సమావేశానికి తెలంగాణ రాజన్న సిరిసిల్ల జిల్లా సైకాలజిస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ యేలగొండ ఆంజనేయులు, ఉపాధ్యక్షుడు అలువాల ఈశ్వర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రాష్ట్ర అధ్యక్షుడు ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాల, కళాశాల, ఇనిస్టిట్యూట్లలో నాయకత్వ లక్షణాలు, చదువు పట్ల ఏకాగ్రత, డ్రగ్ డీ అడిక్షన్ తదితర అంశాలపై అవగాహన కల్పించి కౌన్సిలింగ్ నిర్వహించుటకు సంసిద్ధతను వ్యక్తం చేశారు.

## ఇందిరమ్మ ఇళ్లకు భూమి పూజ



**ఆందోల్ నియోజకవర్గం ప్రతినిధి (జూన్ 09 ప్రజాబలం)** సంగారెడ్డి జిల్లా, నియోజకవర్గం పుల్కల్ మండల పరిధిలోగల కోడూరు గ్రామంలో ఈరోజు సోమవారం ఇందిరమ్మ ఇళ్లకు ముగ్గు పోసి భూమి పూజ చేయడం జరిగింది , ఈ కార్యక్రమంలో పుల్కల్ మండల ఇన్చార్జి ఎంపీడీవో శ్రీకాంత్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మల్లన్న గారి దుర్గారెడ్డి, మండల కాంగ్రెస్ సీనియర్ నాయకులు రామచంద్రారెడ్డి, గోవర్ధన్, యువజన కాంగ్రెస్ నాయకులు ఆత్మారి రవీందర్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు అనంతరావు, మానేయ, పంచాయతీ సెక్రెటరీ భార్గవి, బయప్ప, సంగయ్య, దశరథ, గ్రామ ప్రజలు పాల్గొన్నారు....

# నవంబర్ నాటికి ఇందిరా మహిళా శక్తి భవనాలు పూర్తి చేయాలి. మంత్రి దనసరి అనసూయ సీతక్క.

**పెట్రోల్ పంప్ ఏర్పాటుకు అనువైన స్థలాలను వెంటనే ఎంపిక చేయాలి.**

**సోలార్ విద్యుత్ ప్లాంట్ ఏర్పాటుకు అనువైన భూములను 10 రోజుల్లో గుర్తించాలి.**

**జూన్ 12న పండగ వాతావరణం లో పాఠశాలల పున:ప్రారంభం చేయాలి.**

**బడి బాట, ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం పై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించిన మంత్రి సీతక్క.**







**ములుగు జిల్లా ప్రతినిధి (ప్రజాబలం) జూన్ 9 :** నవంబర్ నాటికి జిల్లాలో చేపట్టిన నూతన ఇందిరా మహిళా శక్తి భవనాలు పూర్తి చేయాలని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి వర్యులు దనసరి అనసూయ సీతక్క అన్నారు.

సోమవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి వర్యులు దనసరి అనసూయ సీతక్క, సి.ఎస్ కే. రామ కృష్ణా రావు లతో కలిసి బడి బాట, ఇందిరా మహిళా శక్తి కార్యక్రమాల పై జిల్లా కలెక్టర్ లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు.

ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి పాల్గొన్నారు.

మంత్రి వర్యులు ధనసరి అనసూయ సీతక్క మాట్లాడుతూ, మహిళా శక్తి భవనాలకు ముఖ్యమంత్రి చేతుల మీదుగా గత నవంబర్ మాసంలో శంకుస్థాపన చేసుకున్నామని, చాలా జిల్లాల్లో వీటి పురోగతి ఆశించిన స్థాయిలో లేదని అన్నారు. పంచాయతీరాజ్ శాఖ ఇంజనీర్ల సమన్వయం చేసుకుంటూ నిర్దేశించుకున్న గడువు లోపు పనులు పూర్తయ్యేలా చూడాలని అన్నారు.

మహిళా సంఘాల ద్వారా ప్రభుత్వ పాఠశాలలో చదివే పిల్లలకు ఏకరూప దుస్తులు కుట్టు పనులు వేగంగా జరిగాయని, దీనికి కృషి చేసిన ప్రతి ఒక్కరికి మంత్రి ధన్యవాదాలు తెలిపారు. జూన్ 12న పాఠశాలలో పునః ప్రారంభోత్సవం సందర్భంగా పండగ వాతావరణం లో పిల్లలకు ఏకరూప దుస్తులు, పాఠ్యపుస్తకాలు పంపిణీ చేయాలని మంత్రి ఆదేశించారు.

ప్రభుత్వ పాఠశాలల పునః ప్రారంభోత్సవం సందర్భంగా పారిశుధ్య నిర్వహణకు అధిక ప్రాధాన్యత కల్పించాలని అన్నారు. పాఠశాల పరిసరాలను పరిశుభ్రం చేయాలని, వర్షపు నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని అన్నారు.

అంగన్వాడీలను బలోపేతం చేయాలని, పండుగ వాతావరణంలో ఈ విద్యా సంవత్సరంలో అంగన్వాడీలను ప్రారంభించాలని అన్నారు. తల్లిదండ్రులను ఆహ్వానించాలని తెలిపారు. వర్షాకాలం వల్ల కూలిపోయే స్థితిలో ఉన్న కేంద్రాలను తక్షణమే వేరొక చోటికి మార్చాలని ఆదేశించారు. అన్ని అంగన్వాడీలలో మౌలిక వసతులు కల్పించాలని, రాష్ట్రంలో త్వరలో 1000 అంగన్వాడీ కేంద్రాలకు సొంత భవనాలు నిర్మించనున్నామని అన్నారు.

కోటి మంది మహిళలను కోటీశ్వరులు చేయాలని లక్ష్యంతో సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో అనేక కార్యక్రమాలు చేపట్టామని ఇందులో భాగంగా మహిళా సంఘాల ద్వారా పెట్రోల్ పంప్ లను ఏర్పాటు చేస్తున్నట్లు మంత్రి తెలిపారు.

జిల్లాలలో పెట్రోల్ పంప్ ఏర్పాటుకు అనువైన స్థలాలను ఎంపిక చేయాలని, ఒక పెట్రోల్ పంప్ ఏర్పాటు వల్ల 10 కుటుంబాలు బాగు పడతాయని మంత్రి అధికారులను ఆదేశించారు. మహిళా సంఘాల ద్వారా రైస్ మిల్స్, సోలార్ విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్ల స్థాపన, ఆర్టీసీ కు అద్దె బస్సులు నడపడం వంటి అనేక కార్యక్రమాల అమలుకు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు.

గ్రామీణ ప్రాంతాలు, గిరిజన ప్రాంతాల్లో మహిళలకు అవగాహన కల్పిస్తూ నూతన మహిళ సంఘాలను ఏర్పాటు చేయాలని, పేదరికం అధికంగా ఉండే ప్రాంతాలలో అవగాహన కల్పిస్తూ మహిళా గ్రూపుల వల్ల కలిగే ఉపయోగాలపై అవగాహన కల్పించాలని అన్నారు. ప్రైవేట్ వడ్డీ వ్యాపారుల దగ్గర రుణాల కోసం మహిళలు పోయే దుస్థితి రాకుండా, జిల్లాలో పూర్తి స్థాయిలో నూతన మహిళా సంఘాలను తయారు చేసి మహిళలను గ్రూపు లలో జాయిన్ చేయాలని అన్నారు.

మహిళా సంఘాల ద్వారా సోలార్ విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్ల ఏర్పాటు ప్రక్రియ గాంధీ జయంతి నాటికి పూర్తి చేయాలని అన్నారు. ప్రతి జిల్లాలో మహిళా సంఘాల ద్వారా విద్యుత్ ప్లాంట్ ఏర్పాటు కోసం సబ్ స్టేషన్ పరిధిలో 8 ఎకరాల అనువైన భూమి 10 రోజుల్లో గుర్తించాలని అన్నారు.

సీఎస్ కె.రామకృష్ణా రావు మాట్లాడుతూ,

100 శాతం పిల్లలు బడులలో నమోదు కల్గి ఉండాలని అన్నారు. బడికి వచ్చే పిల్లలకు నాణ్యమైన విద్య అందేలా పటిష్ట కార్యాచరణ అమలు చేయాలని అన్నారు. వేసవి సెలవులలో జిల్లా కలెక్టర్ల సహకారంతో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న దాదాపు లక్షా 12 వేల ఉపాధ్యాయులకు 5 రోజుల పాటు నూతన బోధన పద్ధతుల పై శిక్షణ అందించామని అన్నారు.

10వ తరగతి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు తప్పనిసరిగా పై చదువులు చదివేలా జిల్లా కలెక్టర్లు ప్రత్యేక చొరువ చూపాలని సీఎస్ సూచించారు. పాఠశాలలు ప్రారంభించిన మొదటి రోజే పాఠ్య పుస్తకాలు, ఏక రూప దుస్తుల పిల్లలకు పంపిణీ చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అన్నారు.

బడి బాట కార్యక్రమం ద్వారా ఇంటింటికి వెళ్ళి ప్రభుత్వ పాఠశాలలో కల్పిస్తున్న సదుపాయాలు, ఏఐ టూల్స్ ద్వారా అందిస్తున్న ప్రాథమిక విద్య, డిజిటల్ తరగతులు, పాఠశాలల్లో వచ్చిన మార్పులను వివరిస్తూ ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్స్ పెంచాలని అన్నారు. స్వశక్తి మహిళా సంఘాలతో ప్రత్యేక సమావేశంలో నిర్వహించే ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు గురించి చర్చించాలని అన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో 20 లక్షల పైగా విద్యార్థులు చదువుతున్నారని, పిల్లలు ఏం నేర్చుకుంటున్నారు బడులలో అనే అంశం పట్ల మనం మరింత మెరుగ్గుపర్చుకోవాల్సి ఉంటుందని అన్నారు. తొలిమెట్టు కార్యక్రమం మరింత సమర్థవంతంగా అమలు చేయాలని, దీని పై కలెక్టరులు ప్రత్యేక శ్రద్ధ వహించి రెగ్యులర్ గా తనిఖీలు చేయాలని సీఎస్ ఆదేశించారు.

2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తెలంగాణను రూపొందించాలని పెట్టుకున్న లక్ష్యం నెరవేరాలంటే మహిళలను భాగస్వామ్యం చేయడం చాలా కీలకమని సీఎస్ పేర్కొన్నారు. ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం క్రింద వివిధ వాణిజ్య వ్యాపార యూనిట్ల మహిళలచే గ్రౌండింగ్ చేయాల్సి ఉంటుందని అన్నారు.

ప్రభుత్వ పాఠశాలల ఏకరూప దుస్తులు కుట్టిన మహిళలందరికి కుట్టు కూలీ 75 రూపాయల ప్రభుత్వం విడుదల చేసిందని, ఈ నిధులను సంబంధిత మహిళలకు త్వరగా చేరేలా చూడాలని అన్నారు. 110 కోట్ల రూపాయలతో 22 నూతన జిల్లాలో ప్రభుత్వం ఇందిరా మహిళా శక్తి భవనాలను నిర్మిస్తుందని, వీటిలో ప్రభుత్వం 19 కోట్ల రూపాయల విడుదల చేసిందని, కలెక్టర్ స్థానిక పంచాయతీ రాజ్ శాఖ అధికారులతో రివ్యూ నిర్వహించి పనులు వేగవంతం చేయాలని, నవంబర్ 19 నాటికి ఇందిరా మహిళా శక్తి భవనాల నిర్మాణం పూర్తి కావాలని అన్నారు.

నారాయణపేట జిల్లాలో మహిళా సంఘాల ద్వారా పెట్రోల్ పంప్ ఏర్పాటు చేశామని , అదే విధంగా అన్ని జిల్లాలలో పెట్రోల్ పంప్ ఏర్పాటు చేసేందుకు కలెక్టర్ అనుకూలంగా ఉన్న 6 నుంచి 10 గుంటల భూమి గుర్తించాలని అన్నారు.

వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్., మాట్లాడుతూ జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఏకరూప దుస్తుల కుట్టు పనులు చివరి దశకు చేరుకున్నాయని తెలిపారు. పెండింగ్ లో ఉన్న కుట్టు పనులు వేగంగా పూర్తవుతున్నాయని అన్నారు. నవంబర్ నాటికి ఇందిరా మహిళా శక్తి భవన నిర్మాణం పూర్తి చేయుటకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.

ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## అనుమతులు లేని ప్రైవేట్ పాఠశాలలపై కఠిన చర్యలు తీసుకోవాలి.

## తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు బత్తుల మహేందర్ యాదవ్.



**వేములవాడ టౌన్, ( ప్రజాబలం ),** సోమవారం రోజున తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు బత్తుల మహేందర్ యాదవ్ స్థానిక ఎంఈఓ కి వినతి పత్రం అందజేశారు. వేములవాడ పట్టణంలో అనుమతి లేకుండా నడుస్తున్న, పుట్టగొడుగుల వెలిసిన అనధికారిక పాఠశాలలపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. విద్యను వ్యాపారంగా మార్చుతున్న పాఠశాలలు ప్రభుత్వ అనుమతి లేకుండానే బోర్డులు ఏర్పాటు చేసి, ఒక స్కూల్ పేరుతో మరో స్కూల్ నడుపుతూ విద్యార్థులను మోసం చేస్తున్నాయని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. షిఫ్టింగ్ పర్మిషన్ లేకపోయినా స్కూలు మారుతున్న ప్రదేశాలలో కొనసాగిస్తున్న యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఆయా పాఠశాలల బోర్డులను కూడా తొలగించాలని వేములవాడ మండల విద్యాధికారిని ఆయన కోరారు. ఈ సందర్భంగా బత్తుల మహేందర్ యాదవ్ మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడే విద్యాసంస్థలపై అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని, నిజమైన విద్యా విలువలు నిలబెట్టాలంటే ఈ వ్యవహారంలో అడ్డుకట్ట వేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ అధ్యక్షుడు మొగిలి కరుణాకర్, మండల అధ్యక్షుడు పార్వతి మహేష్, బీసీ నాయకులు బండారు గవాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## జాతీయస్థాయి మెరిట్ స్కాలర్షిప్ కు ఎంపికైన మర్రిపల్లి పాఠశాల విద్యార్థినిలు.





**వేములవాడ టౌన్, ( ప్రజాబలం ),** జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మర్రిపల్లి కి చెందిన విద్యార్థినిలు టి. గంగాజల, మరియు డి. హంసిని జాతీయస్థాయి మెరిట్ స్కాలర్షిప్ కు ఎంపికయ్యారు. వీరికి ఇంటర్ వరకు ప్రతి సంవత్సరం 12000/- రూపాయలు ప్రభుత్వం ఆర్థిక సాయం అందించనున్నట్లు మర్రిపల్లి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మాధవి లత తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను, ప్రధానోపాధ్యాయురాలు, ఉపాధ్యాయ బృందం, మర్రిపల్లి గ్రామ మాజీ సర్పంచ్ కటకం మల్లేశం, మరియు అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ లావణ్య, గ్రామస్తులు అభినందించారు.

## సొంతింటి కలను నెరవేర్చడమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యం.

**వేములవాడ పట్టణం 21వ వార్డులో ఇందిరమ్మ ఇళ్లకు భూమి పూజ.**

**ప్రతి నిరుపేద కుటుంబానికి కూడు, గూడు అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ దేయం.**

**ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించి డబ్బులు రావని తప్పుడు ప్రచారం చేస్తున్న ప్రతిపక్షాల మాటలు నమ్మకండి.**



**వేములవాడ టౌన్, ( ప్రజాబలం ),** సోమవారం రోజున వేములవాడ పట్టణం 21వ వార్డులో ఇందిరమ్మ ఇండ్లకు భూమి పూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ కమిటీ సభ్యులు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి నిరుపేద కుటుంబానికి కూడు, గూడు సమస్య లేకుండా చూడడమే లక్ష్యంగా పనిచేస్తుందని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు ఇంటి నిర్మాణాన్ని వేగంగా ప్రారంభించాలని సూచించారు. ప్రతి ఇంటికి ఐదు లక్షల రూపాయల సహాయం నాలుగు దశలో అందించబడుతుందని తెలిపారు. ప్రభుత్వం అందించే ఈ సహాయాన్ని పొందడానికి ఎలాంటి దళారి వ్యవస్థ లేదా అధికారుల ద్వారా పైరవీ అవసరం లేదని స్పష్టం చేశారు.

ఇంటి నిర్మాణం పురోగతిని బట్టి పారదర్శకంగా నిధులు విడుదల అవుతాయని, ఒక్క రూపాయి కూడా ఎవరికి ఇవ్వాల్సిన అవసరం లేదని ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు భరోసా ఇచ్చారు. కొందరు తప్పుడు ప్రచారం చేస్తూ డబ్బులు రావు అని చేస్తున్న ప్రచారాన్ని ఎవరు నమ్మవద్దని కాంగ్రెస్ పార్టీ కి ఎక్కడ ఆదరణ వస్తుందోనని బి ఆర్ ఎస్, బిజెపి పార్టీ నాయకులు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని, కాబట్టి వారికి తగిన రీతిలో ప్రజలు బుద్ధి చెప్పాలని వారన్నారు. ఇందిరమ్మ ఇల్లు కట్టుకున్న ప్రతి ఒక్కరికి డబ్బులు వస్తాయని ఎవరు అధైర్య పడవద్దు అని వేములవాడ స్థానిక ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ నాయకత్వంలో డబ్బులు వారి అకౌంట్లో పడతాయని, తొందరగా ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు ఇండ్ల నిర్మాణాలు మొదలు చేసి దసరా పండుగ వరకు గృహప్రవేశం చేసుకోవాలని వారన్నారు. బిజెపి, బిఆర్ఎస్ నాయకుల తప్పుడు మాటలు నమ్మవద్దు అని వారన్నారు.

ఇల్లు మంజూరు చేయించిన వేములవాడ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కు లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వేములవాడ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కనికరపు రాకేష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సాగరం వెంకటస్వామి, నాయకులు చిలక రమేష్, కూరగాయల కొమరయ్య, ఇందిరమ్మ కమిటీ సభ్యులు కోయల్ కార్ మస్తాన్, కూర దేవయ్య, కాంగ్రెస్ పార్టీ వికలాంగుల నాయకులు జోగిని తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

## దేవస్థానం కోనేరులో పడి ములుగు జిల్లా వాసి మృతి.



**వేములవాడ టౌన్, ( ప్రజాబలం ),** ములుగు జిల్లా మల్లంపల్లి మండలం భూపాల్ నగర్ ( పందికుంట ) కు చెందిన సాధం రాజు (32) అనే వ్యక్తి రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ రాజన్న ఆలయ అనుబంధ దేవాలయమైన నాంపల్లి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం వద్ద ఉన్న కోనేరులో పడి ప్రమాదవశాత్తు మృతి చెందాడు.

సాదం సమ్మయ్యకు ముగ్గురు కుమారులు కాగా రాజు (32) రెండో కుమారుడు కాకతీయ విశ్వవిద్యాలయంలో పీజీ, ఎంఈడి పూర్తి చేసి ప్రభుత్వ ఉద్యోగాల కోసం సమాయత్తమవుతున్నాడు. తిరుపతి, వేములవాడ దైవ దర్శనాల కోసం వెళ్లి వస్తానని 05/06/2025 గురువారం రోజున ఉదయం 8 గంటలకు ఇంటి నుండి బయలుదేరారు. 08/06/2025 ఆదివారం ఉదయం5:30 నిమిషాలకు రాజు బంధువైన జక్కుల మహేందర్ వేములవాడ దైవ దర్శనానికి వచ్చి రాజుకు ఫోన్ చేయగా రాజు అట్టి ఫోన్ కాల్ లిఫ్ట్ చేయలేదు. అయితే రాత్రి జక్కుల మహేందర్ తో రాజు ఉదయం లక్ష్మి నరసింహ స్వామి టెంపుల్ కి వెళ్తానని చెప్పినాడని అయితే రాజు సడన్గా ఫోన్ లిఫ్ట్ చేయకపోవడంతో సదరు బంధువులతో పాటు లక్ష్మీ నరసింహ స్వామి టెంపుల్ ఆవరణలో వెతికాసాగారు. పక్కనే ఉన్న కోనేరు దగ్గర రాజుకు సంబంధించిన బ్యాగు, చెప్పులు, పర్సు లభించడంతో అనుమానంతో కోనేరులో పడి ఉంటాడని వెతికే ప్రయత్నం చేయగా రాజు డెడ్ బాడీ లభించింది. వేములవాడ పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేసుకొని పోస్టార్టం కోసం మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతికి సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. పంచనామా అనంతరం ములుగు జిల్లా మల్లంపల్లి మండలం భూపాల్ నగర్ ( పందికుంట) కు రాజు మృతదేహాన్ని తరలించనున్నారు.

## సామాజిక న్యాయానికి పర్యాయపదం కాంగ్రెస్ పార్టీ.

### కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బుర్ర రవితేజ గౌడ్.



**వేములవాడ టౌన్, ( ప్రజాబలం ),** తెలంగాణ కాంగ్రెస్ పార్టీ ముగ్గురు కొత్త మంత్రులను క్యాబినెట్ లోకి తీసుకున్న విషయం పట్ల హర్షం వ్యక్తం చేశారు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బుర్ర రవితేజ గౌడ్. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం దళితులకు పెద్దపీట వేసింది అని పేర్కొన్నారు. ఉప ముఖ్యమంత్రి, స్పీకర్ సహా ముగ్గురు మంత్రులు ఉన్నారు. గత ప్రభుత్వం దళితులను మోసం చేసిందన్నారు. మరో మూడు మంత్రి పదవులలో మున్నూరు కాపు సామాజిక వర్గానికి కూడా అవకాశం లభిస్తుందని వేములవాడ నియోజకవర్గ ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారన్నారు. మాజీ ముఖ్యమంత్రి కుమారుడు కేటీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న సిరిసిల్ల జిల్లా కావున కేటీఆర్ ను బలంగా ఎదుర్కొనేందుకు మంత్రి పదవి, కేకే మహేందర్ రెడ్డికి ఎమ్మెల్సీ పదవి ఇస్తే బాగుంటుందని సిరిసిల్ల నియోజకవర్గ కార్యకర్తలు కోరుతున్నారని అన్నారు. వైయస్సార్ ప్రభుత్వ హయాంలో ఇందిరమ్మ ఇండ్లు ఇస్తే, మళ్లీ కాంగ్రెస్ వచ్చాకే పేదోడి సొంతింటి కల నెరవేరుతుందని అన్నారు. రాష్ట్రంలో రాజన్న జిల్లాకి అత్యధిక ఇందిరమ్మ ఇండ్లు మంజూరు రావడం సంతోషంగా ఉందన్నారు. వేములవాడ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అధిక సంఖ్యలో సీఎంఆర్ఎఫ్ నిధులు తెస్తున్నారని ఆయన హర్షం వ్యక్తం చేశారు. దొడ్డు బియ్యం బదులు ప్రతి ఇంటికి నేడు సన్నబియ్యం ఇస్తుంది కాంగ్రెస్ ప్రభుత్వం అని కొనియాడారు. రానున్న రోజుల్లో మరిన్ని సంక్షేమ పథకాలను ప్రజలకు అందిస్తుందని, ప్రజా ప్రభుత్వానికి ప్రజలు మద్దతుగా నిలబడాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఇమ్మడిశెట్టి విశాల్, కవంపల్లి నరేష్, సన్నీ, సోఫియాన్, జీవాన్సు తదితరులు పాల్గొన్నారు.

## క్యాన్సర్ పేషంట్ ను పరామర్శించిన జగ్గారెడ్డి

**నా నియోజకవర్గం లో క్యాన్సర్ తో బాధపడే నిరుపేద లకు ట్రీట్ మెంట్ కోసం ఆర్థిక సహకారం అందించాలని నిర్ణయించుకున్నాను. క్యాన్సర్ ట్రీట్ మెంట్ లక్షల రూపాయల తో కూడుకున్న వ్యవహారం కావడం తో పేద లు ఆర్థికం గా చితికిపోతున్నరు. క్యాన్సర్ పేషంట్ రాణమ్మ కు ట్రీట్ మెంట్ కోసం నాలుగు లక్షలు రూపాయల ఆర్థిక సహాయం అందించిన జగ్గారెడ్డి జగ్గారెడ్డి మాట్లాడుతూ**




సంగారెడ్డి ప్రజాబలం ప్రతినిధి:సంగారెడ్డి పట్టణం లో నీ సోమేశ్వర వాడ కు చెందిన రాణి కి బ్రెస్ట్ క్యాన్సర్ వచ్చింది

ట్రీట్ మెంట్ కోసం ఆర్థిక సహాయం నాలుగు లక్షలు అందించాను

స్పెసిఫిక్ గా మీడియా ముందుకు రావడానికి కారణం క్యాన్సర్ అనేది ఎవ్వరికీ రావొద్దు...

క్యాన్సర్ బాధితుల ది టెన్షన్ లతో కూడిన జీవితం క్యాన్సర్ ట్రీట్ మెంట్ లక్షల రూపాయల తో కూడుకున్న వ్యవహారం కావడం తో పేద లు ఆర్థికం గా చితికిపోతున్నరు.

లక్షల రూపాయల ఖర్చు చేసినా కొన్ని సందర్భాల్లో బతకడం లేదు... ఆ పేషంట్ ట్రీట్ మెంట్ కోసం అప్పులు చేసిన ఆ కుటుంబాలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

నా నియోజకవర్గానికి చెందిన ఆర్థిక స్థోమత లేని పేద క్యాన్సర్ పేషెంట్ల కు ఆర్థిక సహకారం అందించాలని నిర్ణయించుకున్నా ను

మొన్న సదాశివపేట లో క్యాన్సర్ పేషంట్ కు 10 లక్షల రూపాయలు, ఈరోజు సంగారెడ్డి పట్టణానికి చెందిన క్యాన్సర్ పేషంట్ కు 4 లక్షల రూపాయలు ఆర్థిక సహకారం అందించాను.

నా వద్దకు ఆరోగ్య సమస్య ల ట్రీట్ మెంట్ కోసం సహాయం కావాలని ఎంతోమంది వస్తారు.. వారికి నా ద్వారా సహాయం అందుతుంది. కానీ ఎన్నడూ మీడియా లో రా దు.. అది నాకిష్టం ఉండదు.

ఇలా మీడియా ముందుకు రావడానికి ప్రధాన కారణం రాష్ట్రం లో ఎంతో మంది దాతలు ఉన్నారు. క్యాన్సర్ పేషంట్ లకు వారి ద్వారా సహాయం దొరుకుతుందనే ఉద్దేశ్యం తో మీడియా ముఖంగా అందించడం జరిగింది.

## శివరాజ్ సింగ్ చౌహాన్ ను కలిసిన కోదండరెడ్డి.




రెండు అంశాలపై కేంద్ర మంత్రికి ప్రతిపాదన లేఖలు ఇచ్చిన కోదండరెడ్డి

ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేయాలనీ, మైనర్ ఇరిగేషన్కు కేంద్ర నిధులు కేటాయించాలని కోరిన రైతు కమిషన్ చైర్మన్.

తెలంగాణ గోలుకట్టు చెరువులకు నిలయమని, రాష్ట్రంలో 45 వేల చెరువులు ఉన్నాయని.. వాటి మరమ్మతులు, నిర్వహణకు ప్రత్యేక నిధులు కేటాయించాలని కోరారు.

ఇతర రాష్ట్రాల్లోని చెరువుల అభివృద్ధికి కేంద్రం నిధులు కేటాయిస్తున్న విషయాన్నీ గుర్తుచేశారు.

వ్యవసాయ రంగంలో కూలీల కొరత తీవ్రంగా ఉందని, ఉపాధి హామీ పథకాన్ని అగ్రికల్చర్ కు లింక్ చేస్తే.. వ్యవసాయ రంగం మరింత పురోగతి చెందుతుందన్నారు.

ఇబ్రహీంపట్నం మండలం మంగళ్ పల్లి గ్రామంలో జరిగిన విక్షిత్ కృషి సంకల్ప్ అభియాన్ కార్యక్రమంలో కేంద్రమంత్రి తో పాల్గొన్న రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు, రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి.

## ఆధునిక అంబేద్కర్‌లా సీఎం రేవంత్ రెడ్డి దళితుల పక్షాన నిలిచారు

### ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ప్రీతం




**నాంపల్లి గాంధీభవన్ ప్రజాబలం ప్రతినిధి:**ప్రజా ప్రభుత్వ ఏర్పాటుతో దళిత, గిరిజనులకు స్వేచ్ఛ గాలి పీల్చే అవకాశం

అడ్లూరి లక్ష్మణ్, వివేక్ లను కేబినెట్‌లోకి తీసుకోవడం ద్వారా సాధారణ కార్యకర్తలకు సీఎం రేవంత్ రెడ్డి ,కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన గౌరవం

పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో దళితుల గొంతు నొక్కే ప్రయత్నం జరిగింది

స్వరాష్ట్ర సాధనలో దళితులు, గిరిజనులు పోరాడిన త్యాగాలకు కాంగ్రెస్ స్ఫూర్తిదాయక గౌరవం

బీఆర్ఎస్ పాలనలో ఎస్సీల భూములను పార్టీ కార్యాలయాల కోసం కేటాయించడం చిన్నచూపు ఉదాహరణ

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే స్పీకర్‌గా గడ్డం ప్రసాద్‌ను నియమించి దళితులను గౌరవించింది

దళితుడిని డిప్యూటీ సీఎం, ఫైనాన్స్ మినిస్టర్‌గా చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీదే

దళితులకు గౌరవస్థానం కల్పించిన కాంగ్రెస్ పార్టీకి చరిత్రలో ప్రత్యేక స్థానం

గత పదేళ్ల బిఆర్ ఎస్ పాలనలో లేని విధంగా కాస్మొటిక్ చార్జీలు 50 శాతం మెస్ చార్జీలు 200 శాతం పెంచిన ఘనత కాంగ్రెస్ పార్టీది

50 చోట్ల 200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ ఏర్పాటు చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీ,సీఎం రేవంత్ రెడ్డిది

ఎస్సీల సుదీర్ఘ 30 సంవత్సరాల కల ఎస్సీ వర్గీకరణను ఒక్క సంతకంతో పూర్తి చేసిన ఘనత సీఎం రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీది

కాంగ్రెస్ ప్రభుత్వంపై బిఆర్ఎస్ దుష్ప్రచారం మానేసి అభివృద్ధి పై చర్చకు రండి

ఎంగిల మెతులకు ఆశపడి కాంగ్రెస్ ప్రభుత్వం పై దుష్ప్రచారం చేస్తే ఊరుకునే ప్రసక్తే లేదు

మిగిలిన కేబినెట్ బెర్త్ లతో పాటు కార్పొరేషన్ చైర్మన్లలో బడుగు బలహీన వర్గాలకు కాంగ్రెస్ పార్టీ సముచిత స్థానం కల్పిస్తుంది

రాజీవ్ యువ వికాసం తో 5 లక్షల మందికి ఉపాధి కల్పించే ప్రయత్నం

సీఎం రేవంత్ రెడ్డి గారిని బలపరిచే విధంగా రాష్ట్ర వ్యాప్త పర్యటనలకు శ్రీకారం చుట్టబోతున్నాం

## ప్రభుత్వ పథకాలు ప్రజలలోకి తీసుకెళ్తా

### మొహ్మద్ ఇఫతేఖర్ ఉద్దీన్




గోషామహల్ ప్రజాబలం ప్రతినిధి:సోమవారం నాడు మిద్దెల జితేందర్ తెలంగాణ కాంగ్రెస్ కమిటీ సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షులు మొహ్మద్ ఇఫతేఖర్ ఉద్దీన్ ను ఖైరతాబాద్ జిల్లా కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షులు గా నియమకం ఆర్డర్ లెటర్ ఇవ్వడం జరిగినది.ఈ సందర్భంగా మొహ్మద్ ఇఫతేఖర్ ఉద్దీన్ మాట్లాడుతూ అధ్యక్షులు జితేందర్ కి, టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ కి, ముఖ్య మంత్రి ఎ. రేవంత్ రెడ్డి కి, ఏఐసీసీ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ కి, మెట్టు సాయి కుమార్ ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ కి ధన్యవాదములు, కృతజ్ఞతలు తెలియచేస్తూ పార్టీ పురోభి వృద్ధికి, మరియు ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు ప్రజలకు చేరేవిధంగా కార్యక్రమాలు నిర్వహిస్తానని,షాదీముబారక్ ,కళ్యాణలక్ష్మీ , మహిళలలకు ఉచిత బస్సు ,రేషన్‌షాప్ ద్వారా సన్న బియ్యం.భూభారతి,మొదలగు పథకాలు ప్రజలలోకి తీసుకెళ్తానని అన్నారు.

### ఆస్త్రం యాప్ ను ప్రారంభించిన హోం మంత్రి అనిత

విశాఖపట్నం రాష్ట్రంలో మహిళల రక్షణ కోసం ప్రత్యేక యాప్ ను అందుబాటులోకి తీసుకురావాలని ఇటీవల ఏపీ హోం మంత్రి వంగల పూడి అనిత అధికారులను ఆదేశించారు.ఈ క్రమంలో రాష్ట్రం లో మహిళలు, చిన్నారుల రక్షణ, తీసు కోవాల్సిన చర్యలపై ప్రత్యేక దృష్టి పెట్టా రు.ఈ క్రమంలో ఏపీ హోంమంత్రి అనిత అస్త్రం యాప్ను ప్రారంభించారు.ఈ యాప్లో ట్రాఫిక్ పూర్తి సమాచారం అందు బాటు లో ఉంటుంది.విశాఖ వాసిగా ట్రాఫి క్ కష్టాలు ప్రత్యక్షంగా చూశానని ఆమె తెలిపారు.ఈ తరు ణంలో పబ్లిక్ ఫ్రెండ్లీ యాప్ను తేవాలని ఆలోచన చేశామని అన్నా రు. టెలిగ్రామ్ నుంచి యాప్ డౌన్లోడ్ చేసుకోవచ్చు. 3 నెలల్లో యాప్ పూర్తిగా అందుబాటులోకి వస్తుం దని హోం మంత్రి అనిత స్పష్టం చేశారు.

### బదిలీపై వెళ్తున్న ఉన్నాతాదికారులకు ఘన సన్మానం



**ప్రజాబలం చెన్నూరు నియోజకవర్గ రిపోర్టర్ జూన్ 9:**మందమర్రి జిఎం కార్యాలయంలో విధులు నిర్వహిస్తు బదిలీపై వేరే ప్రాంతానికి వెళ్తున్న ఇరువురు ఉన్నతాధికారులను ఎస్సీ,ఎస్టీ ఉద్యోగస్తుల సంక్షేమ సంఘం కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. మందమర్రి ఏరియా డివైపియం, ఎస్సీ లైజన్ ఆదికారి కె. మైత్రేయ బంధు, డివైజియం, ఐఈడి రాజన్న లు ఇతర ప్రాంతాలకు బదిలీ కాగా ఆదివారం అసోసియేషన్ కార్యాలయంలో సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ డిప్యూటి జనరల్ సెక్రెటరీ కనుకుల తిరుపతి, ఉపాధ్యక్షులు దాసరి సుదర్శన్, ముల్కల రాజలింగు, భూపెల్లి కనకయ్య, వై శ్రీనివాస్, సీపెల్లీ రాజలింగు, కలువల శ్రీనివాస్, పురుషోత్తం, రాజేందర్, సంగి రవి, కుమార్, రాజ్ కుమార్, దుర్గం వెంకటి ఎస్టీ నాయకులు శివ,కార్యదర్శి రవి నాయక్, ప్రేమ్ లాల్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

Edited ,Printed Published & Owned by A.SRAVANTHI ,Printed at: SRAVANTHI ENTER PRISES 1-9-18/A,Ramnagar,Hyderabad - 500020, T.S
and Published at 5-2-518,Osmangunj ,Risala Abdulla,Hyderabad -95 Editor; A.SRAVANTHI, RNI NO ; TELTEL/2005/16755 Cell ; 92921 04449
Email;prajaabalamnews@gmail.com